UNIVERSAL LIBRARY
OU_204664
UNIVERSAL LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No T82/K15B  Accession No T1333

Author శ్రీపాద కామేశ్వరరావు.

Title భారతక్షత్రరమణి.

This book should be returned on or before the date last marked below.

# భారత రమణి

(ద్విజేంద్రలాల్ రాయని వంగనాటకమునకు తెనుగు)

గ్రంథః

## శ్రీపాద కామేశ్వరరావు

ప్రకాశకుడు

చెఱుకువాడ వేంకటరామయ్య

రాజమహేంద్రవరము

1926

All rights reserved] [వెల రు 1—0—0

The last Six formes printed in
SARASWATHI POWER PRESS
RAJAHMUNDRY

# ఉపోద్ఘాతము

ఆంధ్రమున సాంఘికనాటకములు చాలా తక్కువ. ఉన్నవాటిలోనైన ఆధునిక సమస్యాచర్చ అంశముగా లేదు. ఈనాటకము కీర్తిశేషులు వంగనాటక కవిసార్వభౌములు నగు ద్విజేంద్రలాల్ రాయుని తుదిరచన. వారు దీనికి "వంగనారి" అను పేరిడ, అనువాదకులగు బ్రా॥ శ్రా॥ హిందీగ్రంధరత్నాకరమువారు "భారతరమణి" అని నామకరణము చేయుటచే మేమీ పేరే పెట్టితిమి.

ఇందు ఆధునికాచారములగు వివాహము, శుల్కము, స్త్రీవిద్య, సముద్రయానము, బహిష్కారము మొదలగునవి చర్చింపబడినవి కావున నేటి యువకుల కిది అమితసంతోషదాయకమగునని విశ్వసించుచున్నాము.

రాజమంద్రి
12—3—26

చలుకువాడ వేంకటరామయ్య
ప్రకాశకుడు

## —। ఇందలి కుశీలవగణము ।—

### పురుషులు

| | |
|---|---|
| ఉపేంద్రుడు | వకీలు |
| దేవేంద్రుడు | ఉపేంద్రుని తమ్ముడు |
| సదానందుడు | దేవేంద్రుని మిత్రుడు |
| కేదారుడు | ,, బంధువు |
| యజ్ఞేశ్వరుడు | ధనికుడు |
| మహేంద్రుడు | దేవేంద్రుని కొడుకు |
| వినయకుమారుడు | సదానందుని కొడుకు |

### స్త్రీలు

| | |
|---|---|
| మానద | దేవేంద్రుని భార్య |
| వినోదిని, సుశీల, కుముదిని | ,, కూతుళ్ళు |

## —। సవరణలు ।—

పే 8 జిలో 10 పంక్తి "కన్యకైనను" తరువాత "విత్తంతువుకైనను" అని చదువుడు.

పే 9 జిలో 7 పంక్తి వీర్యము బదులు చలము అని చదువుడు.

పే 75 జిలో 15 పంక్తి తరువాత "మనమున ప్రాణముల తీపి—మానవామె చిత్రమేమొ॥తిరు॥"

పే 165 లో 19 పంక్తి, ఉపే—దేవేంద్రా బదులు దేవే—కేదారా అని చదువుడు.

షరా:—గ్రంథకర్త అనుమతిలేక ఈనాటకము నాడరాదు

# భారత రమణి

## మొదటి అంకము.

### మొదటి రంగము.

[దేవేంద్రుని యింటిలో దేవేంద్రుడు సదానందుడును కూర్చుండి యుందురు]

దేవే—ఏమి చేయుమందువు? బి-ఏ-పరీక్ష నీయక ముందే సంతతి కల్గి సంసారకూపమున పడితిని. అంతట చదువు సాగక తక్కువజీతముగల పనిలో ప్రవేశింపవలసి వచ్చెను.

సదా—మీ తండ్రిగారు ఆస్తి యెట్లు పంపకము చేసిరి?

దేవే—ఆతని మరణశాసనము ప్రకారము యావదాస్తియు మా అన్నగారికి సంక్రమించి, పెద్దలనాటి ఈ యిల్లు ఇందలి సామగ్రియు నా వంతుకు వచ్చెను. ఐదువేల రూపాయిల ఋణము మేము చెరి సగము తీర్చుకొనవలసి వచ్చెను.

సదా—చిత్రముగా నున్నదే!

దేవే—అట్లనెదవేల?

సదా—ఆర్జనపరుడగు సుతునకు ఆస్తి నంతయు నిచ్చి, అర్భకునకు అప్పు తలజుట్టిరా, మీ తండ్రిగారు ?

దేవే—దాని కేమి ? స్వార్జితమును వారు ఇచ్చవచ్చి నట్లు పంచవచ్చును, ఆక్షేప మేమి ? అందరికి పిత్రార్జిత ము ఉంనా ? ఆ విషయమున నా కేచింతయు లేదు.

సదా—ఆతడొక అపూర్వ వ్యక్తి. మీ కెందరు సంతానము ?

దేవే—ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు.

సదా—కొడుకు లేమి చేయుచున్నారు ?

దేవే—పెద్దవాడు సన్యసించెను, చిన్నవాడు చదువు కొనుచున్నాడు.

సదా—కూతుళ్ళకు పెండ్లి చేసితివా ?

దేవే—పెద్దది తలచెడ్డది. తగినంత కట్నము నీయ లేనందున తగినల్లుడు దొరక లేద- మా వియ్యంకుడు కడు బీదవాడగుటచే పిల్ల మాయొద్దనే ఉన్నది.

సదా—రెండో పిల్ల ?

దేవే—దానికే వరుని **వెదకు**చున్నాను. అది బి-ఏ- పరీక్ష నిచ్చినది.

సదా—ఓహో ! మా వినయునితో నాడుకొనుచుం డునది ఆ పిల్లేనా ?

దేవే—అవే. దానిని ఏ తలమాసినవానికో కట్టిబెట్ట వీలులేదు. చదువుకొన్న పిల్ల, తెలివైనది.

సదా—పెద్దది కూడా చదువుకొనినట్లే ఉన్నది. ఒక నాడు హితోపదేశములోని శ్లోక మొకటి చదివినది.

దేవే—అవును. ఒక పిల్లకు సంస్కృతము. రెండవ దానికి ఇంగ్లీషును నూ తండ్రిగారు చెప్పించినారు- రెండు విద్యల పరిణామ మెట్లుండునో చూడవలయునని వారి యూహ.

సదా—సరే- మూడవది?

దేవే—అది చాల చిన్నది, దాని కెప్పుడును రోగాలే. పెద్దదాని పెండ్లితో నా పేర్మి తగ్గినది, సంపద సన్నగిల్లినది. ఇప్పుడు రెండవదానికి పెండ్లిచేయక తీరదు- అదే గట్టిచి క్కొచ్చినది.

సదా—దాని పెళ్లికి చిక్కేమి? పిల్ల రూపసి, చదువు కొన్నది, తెలివైన దేమో?

దేవే—కావుననే చిక్కు. ఇప్పటి వరులతండ్రులు కోడళ్ల యందము చందమును చూచుట లేదు. తమ సుతుల నడిబజారున పెట్టి ఎక్కువవెల యిచ్చినవారికి అమ్ముచున్నారు. దిక్కుమాలిన మన సంఘమున ధనహీనులు తమకూతుళ్లకు పెళ్లి చేయుట కడుప్రయాసముగా నున్నది.

సదా—సంఘమును నిందింపకు, అది చేసిన నేర మేమి?

దేవే—ఆడపిల్లల పెళ్లిళ్ల మూలమున చాలమంది సం

సారులు చిక్కి పోయినారు, ఎంతమంది కౌరవమో హీనమగుచున్నది. ఇది అన్యాయము కాదా ?

సదా — ఓయీ ! నీకు పుత్రులున్నారు, పుత్రికలున్నారు- వారి భరణ పోషణములకు బాధ్యుడవు నీవే కదా ? పుత్రులను ఇరువదియైదేండ్ల వరకు పెంచుదువు, కాని పుత్రికలకు పదేండ్లు పైబడిన తోడనే వారి భరణపోషణ భారము పరుని నెత్తిపై నెత్తుదువు- కొడుకులతో బాటు కూతుళ్లను కూడ తక్కిన పదునైదేండ్లును నీవు పోషింప నక్కఱలేదా ? అదిగాక ఆస్తినంతయు కొడుకులకు చెందజేసి ఆడపిల్లలకు చిల్లిగవ్వయైన నందనీయవు. కొడుకులతో సమముగా కూతుళ్లను నీవు చూడకుండుటకు వారేయేటిలోనైన కొట్టుకొని వచ్చిరా ? చేతనైనంత శీఘ్రముగా వారిని చేవదల్చుకొన జూతువు. కావున ఆడపిల్లల కన్నవారే అన్యాయమున కొడిగట్టుచుండ, అట్లు చేయదగదనియు, వారిని మగపిల్లలతో సమముగా చూడవలయు ననియు సంఘము నిర్బంధించు చున్నది. అపరాధము చేయునది నీవు, దానిని సంఘము నెత్తిపై రుద్దెద వేల ?

దేశే — నా కూతుళ్ల విషయమున నే నట్లు చేయదలచు కొనలేదు- నా శక్తి కొలది వారి కెద్దియో ఒసంగుదును. ఇంత యిమ్మని నను తండ్రి పట్టు బట్టనేల ?

సదా — అట్లు నిర్బంధింపని యెడల తగినంత ధనము

నీ వీయవు. నీ పిల్లను యావజ్జీవము భరించు భారము వారిదే కదా? ఆలోచినంత యిత్తునని నీ వేతృణమో వారికిచ్చినచో నీ కూతురిని వారు తగినరీతిని పోషింప గలరా?

దేవే—సరే. నే నిచ్చిన ద్రవ్యమును వారింకొక విధమున కాజేసిన?

సదా—అబ్బో! నీవే యొగవేసిన?... వారెట్లు కావించినను, కోడలికి యావజ్జీవము అన్నవస్త్రముల నిచ్చు బాధ్యతను వహించియుందురు కదా? పెండ్లినాడు వారు నిన్ను నిర్బంధింపకున్న ఆ వెనుక నీవు పెట్టుపోతల సరిగా జరుపుదువో జరపవో? ముందు జరుగబోవునది ఎవరు నిశ్చయింప గలరు? "లగ్నము నాటి మాటలు నాగవిల్లినా డుండవు" అందుచే పెళ్లినాడే పిల్లతండ్రి యొద్ద తగినంత ధనము పుచ్చుకొనుట ఆవశ్యకము.

దేవే—నా శక్తికొలది నేను కట్న మిచ్చెదనన్న, వారు తృప్తి నొందక నా యిల్లు గుల్లచేయ నేల?

సదా—వారు నీ నెత్తికొట్టి నీ సర్వస్వము నపహరించుట లేదు. నీవే వారి కొసంగ బోవుదువు.

దేవే—ఏమి చేయుదు? కన్యను గన్న ఋణము తీర్ప వలదా?

సదా—కన్యకు వివాహము చేయుట తప్పదంటివి; కాని ఆమె కన్నవస్త్రములకు ఆధారము కల్పించుట తప్పని

సరి కాక నీ యిష్టానుసార మంటివి ; అట్లైన నీ శక్తికి తగిన చవక బేరమునకు నీవు పొమ్ము- అట్లు చేయక అల్లుడు పెద్ద పెద్ద పరీక్షల నీయవలె ననియు, ధనము నార్జించి లక్షాధికారి కావలెనని నీ యాశ ; అట్టివాని తండ్రి ఐదారువేలు కట్న మిమ్మన్న అది తప్పా? చిన్న పరీక్షల నిచ్చినవారు వేనవేలు వేయిరూపాయిలకు కుదురుదురు, అట్టివారికి నీ పిల్ల నేల ఈయ గూడదు ? ఇంకొకటి- వారు నీపిల్ల చూపని, తెలివితేటలు కలది, చదువుకొన్నది అని కట్నము తగ్గింతు రేమో ?

దేవే—ఎట్లైనను వివాహ మన వరవిక్రయమే కదా ?

సదా—“విక్రయ” మన్నమాట చెడ్డదే, కాని ఈ లోకమున అన్ని దేశములయందు నిట్లే జరుగుచున్నది. కొడుకుల నమ్మి ధనము కూర్చువారు కూతుళ్ల పెళ్లికి గొప్పగొప్ప శుల్కముల నర్పింతురు. పుచ్చుకొన్నదాని కిచ్చినది చెల్లు- అందుచే కొడుకుల నెక్కుడు కన్నవారికి లాభము ; కూతుల నెక్కుడు కన్నవారికి నష్టము. ఇంత యేల ? సృష్టియందే ఇట్టి వైషమ్యము కనబడుచున్నది. ఒకడు లక్షాధికారి, ఇంకొకడు భిక్షాధికారి ; ఒకడు బుద్ధిమంతుడు, ఇంకొకడు మూర్ఖుడు; ఒకడు బలవంతుడు, వేరొకడు బలహీనుడు- ఏమి చేయనగు?

దేవే—అంతేనా ? ఇక వెరవు లేదా ?

సదా—నీకు లేదు, కాని నీపిల్లలకు లేకేమి ? చిన్నప్పుడు వారికి పెండ్లిసేయకు ; ధనము నార్జింపగల దార్ఢ్యము,

మానవుల త్రిప్పుకొను నేర్పు, బాలకులకు అలవడకముందు సంసారభారము వారి నెత్తిపై కెత్తెను. ఈ బాల్యవివాహములే మనజాతికి శీర్ణతయు, శైథిల్యమును ప్రసాదించినవి. ఇట్టి మహోపకారమును ఇంకే అనాచారము చేయుటలేదు. హిందువుల కింత హానికరమగు దురాచారము ఇంకొక్కటియు కాదు.

దేవే—ఓహో! సనాతనార్యధర్మమును తారుమారు చేయనెంతువా?

సదా—ఆహా. అవశ్యమట్లే చేయనెంచితి. ఏలయన, ఆ ధర్మము లోపబాహుళ్యమున శిథిలము కాకున్న మనజాతి కిట్టి దుర్దశ ప్రాప్తించి యుండదు. మన ఆచారద్రుమములు కేవల ధర్మరశ్మిపోషితము లనజెల్లదు. అధర్మము బదనిక రూపమున నాటియందు వేళ్లు తన్నియున్నది, దాని నూడ బెరకవలయు.

దేవే—గట్టి చిక్కే తెచ్చిపెట్టితివే?

సదా—ఈ సంగతి ఆలోచించుకో- నీకు బాల్యముననే వివాహము కాకున్న, నీ గతి యిట్టి హీనస్థితికి వచ్చియుండునా? నీకీ విషమదశ ప్రాప్తించి యుండునా?

దేవే—బాలకులకు చిన్నతనమున పెండ్లి చేయగూడదు, సరే; బాలికలకో?

సదా—వివాహ యోగ్యమగు వయసున మంచి

వరుడు లభించెనా, వారికి పెండ్లి చేయవలసినదే.

దేవే—అట్టి వీలు చిక్కకున్న ?

సదా—పెండ్లియే వలదు. బ్రహ్మచర్యమున వారి నుంచవలయు. బాల వితంతువులు బ్రహ్మచర్య మాచరింప గల్గినచో, అవివాహితలు సూత్ర మాచరింప జాలరా? వీరు చేయజాలరని అందువా, వారును చేయలేరు. కావున కన్యలతో బాటు వితంతువులకును పెండ్లి కావలసినదే!

దేవే—నీ అభిప్రాయము నాకు తేటతెల్లము కాలేదు.

సదా—చెప్పెద నాలకింపుము. యోగ్యుడగు వరున కిచ్చి పెండ్లిచేయు శక్తియున్నచో, కన్యకైనను వితంతువున కైనను వివాహముచేయ దగును. అట్టి సామర్థ్యము లేనిచో ఇల్లు వాకిలి నమ్మి వారిలో నెవ్వరికిని పెండ్లి సేయవలదు. ఇద్దరకు బ్రహ్మచర్యమే గతి.

దేవే—దాని వలన కీడు మూడదా?

సదా—ఆపజ్జనకము కాని ఆచారము ప్రపంచమున నెచ్చటనైన కలదా?

దేవే—లేదు, నిజమే. కాని క్రొత్త యాపద నొక దానిని తెచ్చి పెట్టుచుంటివే?

సదా—వితంతువులకు పెండ్లిచేయుటచే కొంత ఆపద తగ్గుట లేదా? దేవేంద్రా! మన దేశమున ధనవంతులు తక్కువైనను, ఉపజీవుల సంఖ్యను హెచ్చించు ఇచ్ఛ అన్ని

దేశములకంటె ఇచ్చట ప్రబల మగుచున్నది. దారిద్ర్యమున మున్గియున్నవారి దరి కెవ్వరు చేరరు గాని, "తెప్పలుగ చెరువు నిండిన, కప్పలు పదివేలు చేరు" అన్నట్లు ఏదో సంబంధము కల్పించుకొని ధనికులకొంపకందరుచేరు దురు. ఒక కవి భారత రమణుల నుద్దేశించి ఇట్లు ప్రార్థించెను:—

"కాంతలార మీరు కనబోకు డెన్నడు
బలము చేతము లేని పంద సుతుల."

కాని ఇందు స్త్రీలు దోషులు కారు, పురుషులే దోషులని అతఁ డూహింప లేకపోయెను... దేవేంద్రా! బాల్య వివాహము వేగ మాపివేయ వలెను. దీనివలన ఇతరాచారము లనేకములు జీర్ణము లగుచున్నవి. వాటిని కూడ సంస్కరింప వలయు, కాని మొదట దీనిపనిబట్టవలయును. బాల్య వివాహముల మూలముననే మనజాతి మజ్జాభావమున దుర్బలమై, ఆహారశూన్యత శీర్ణమై, బలరాహిత్యమున భీరువై, ఉత్సాహ విరహిత నిరర్థక మగుచున్నది. మనలో ఇంతకన్న నష్టహేతు వగు ఆచార మింకొకటియు లేదు......(నిట్టూర్పు)

దేవే—ఊరకుంటి వేమి?

సదా—ఇక మాటాడజాలను...(పోవును).

దేవే—ఇప్పటికి నీతని స్వభావ మప్పటిలాగుననే ఉన్నది. ఆహా! ఇతని జూచి ఎంతకాలమైనది! పది సంవత్సరములకు తక్కువ కాదు. బాల్యమిత్రుల జూడ బాధలు తగ్గును, హృదయతాపము చల్లారును, చిన్ననాటి దినములు

యొద్దికి వచ్చును. ఆ దినములలో సదానందుని శిరముతో నా శిరము జేర్చి, ఆతని బాహువులతో నా బాహువులను కీలించి, నిస్సంకోచముగా మరుగు విడిచి మాటలాడుచుంటిని- ఆహా! శైశవ మెంత మధురము! అప్పుడు శరద్రాకాచంద్రికల జూచి ఉలుకు పలుకు లేక ఉప్పొంగుచుంటిమి, వర్షర్తుమేఘగర్జనముల విని గెంతుచుంటిమి, గ్రీష్మరాత్రుల నిర్మలనక్షత్రపుల కితనభశ్శోభ గాంచి, చీకట్లుక్రమ్మ కన్నుల ఆనందబాష్పవారి చిమ్ముచుంటిమి; అట్టి రమణీయ దినసము లిక రావు. అప్పుడు "నేనెట్లు గడుచును? కొడుకులకు చదువు చెప్పించుటకు, కూతుళ్లకు పెండ్లిసేయుటకును ధన మెట్లు కూడబెట్టుదును?" అను చింతయే లేకుండెను. "గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్"

కేదారుడు వచ్చును.

కేదా—వాడు వదలడు.

దేవే—ఏమిటి?

కేదా—ఈ యిల్లు. అసలు పుచ్చుకొను గాక, వడ్డి కూడబెట్టునట... నేను బారిస్టరు దగ్గరకు పోయెద,

(పో బోవును)

దేవే—ఎక్కడికి పోయెదవు?

కేదా—బారిష్టరింటికి.

దేవే—కొంచె మాగి పొమ్ము.

కేదా—వ్యవధి లేదు.

దేవే—దాహము పుచ్చుకొనుము.

కేదా—ఆలస్య మగును.

దేవే—వేళ—

కేదా—మించిపడి- రేపు వచ్చెద- ఇదుగో-మాను... కాదు, ముం దాలోచించవలయు. ఇం దేదో మోస మున్నదని నా నమ్మకము.

దేవే—దేని యందు ?

కేదా—కాని... వెనుక చెప్పెదను... (పోబోవును)

మానద వచ్చును.

మాన—వంటాయినది, స్నానము చేయుడు... నవ్వెద రేమి ?

దేవే—కేదారుడు వచ్చెను.

మాన—ఐన నేమి ?

దేవే—పాపము ! నా కొరకాత డెంతయో పాటు పడు చున్నాడు. వడ్డీ నెవడైన వదలుకొనునా ?

మాన—దేని వడ్డీ ?

దేవే—తండ్రిగారు నాకప్పగించిన ఋణమునకు వడ్డి మూడువేల రూపాయ లయినది. అప్పిచ్చువాడు వడ్డి వదలునా ? వ్యర్థప్రయాసము నెత్తిపై పెట్టుకొన్నాడు కేదారుడు.

మాన—మీ కిదితప్ప వేరు చింతయే లేదా ? లెండు. స్నానము చేసి భోజనమునకు లెండు.

దేవే—పాతాళహోమము ప్రారంభించినాడు ... సరే...పద.

మాన— అన్నట్లు- మహేంద్రునకు నూరు రూపాయిలు కావలెనట.

దేవే—ఎందుకు ?

మాన—అదేమో ?

దేవే—జూదమాడి సొమ్ము పాడుచేయవలె నన్న తానే ఆర్జించి వెచ్చబెట్టుకొమ్మని వానితో చెప్పు. తగలబెట్టుటకు కూడ ధనము నేను తేజాలను.

మాన—ఈయకున్న వాడలుగును.

దేవే—పోనీ.

మాన—ఒకడు సొమ్ములేక సన్యసించెను కదా !

దేవే—వీడు కూడ లేచి పోనీ. ఇక భరించలేను. ఎప్పుడును "సొమ్ముతే, సొమ్ముతే"అను మాటేనా, కొడుకునకు తండ్రికి నుండవలసిన సంబంధము ? ప్రాణము విసుగుచున్నది... (పోవుదురు).

---

## రెండవ రంగము.

[ఉపేంద్రుని యిల్లు- అతని భక్తగణము కేదారుడును కూర్చుందురు.]

నవీనుడు—మా గురువుగారిని నీవు దర్శించనే లేదా, కేదారా ?

కేదా—చూడ కేమి ? పలుమారు దర్శించితిని.

వినోదుడు—అట్లైన వారి మాహాత్మ్యము నీకు తెలియలే నట్లున్నది !

కేదా— తెలిసినది, తెలిసినది. చక్కగా విదితమైనది.

శంకరుడు—ఎరుగ వెరుగవు. నీకు తెలిసియుండినచో వారి నిట్లు నిందించుతువా ?... వారు కేవలము విష్ణుభక్తులు, సాధువులు, పరమభాగవతులు....

నవీ—అబ్బో ! వారి జడ లింత పొడవు....

కేదా—ఓహో, జడల పొడవును బట్టి సాధుత్వ సాంప్రదత నిర్ణయించు చున్నారా ?

నవీ—కాదు కాదు- భక్తి ! భక్తి ! మా గురువుగారి హరిభక్తిని మీరు చూడలేదు. అందుచేతనే పొరపడుచున్నారు. వారి భక్తి మీ కెట్లు తెలియ గలదు ?

కేదా—నాకు తెలియ నవసరము లేదు.

వినో—హరినామ సంకీర్తనము వారు చేయుచున్నప్పుడు వారికి విష్ణుమూర్తి పూనుటచే నిలువు నిటాకున పరవశులై వారు పడిపోవుదురు.

కేదా—అటులనా ? వారి వెనువెంట మీరుకూడ పడిపోవుదురా ?

శంక—అది మాకు వశమా ? వైష్ణవధర్మతత్వము వారియొద్ద నేర్చుకొను చున్నాము.

కేదా—నేర్చుకొనవలసినదే. చక్కగా నేర్చుకొనుడు,

తరించిపోవుదురు. సశరీరస్వర్గము మీకు లభించును.

నవీ—ఈ భాగ్యాగ్యుల కంతటి అదృష్టమా? దానికై వారి శ్రీచరణములను సదా గొల్చుచున్నాము.

కేదా—శ్రద్ధగా గొల్చు చుండుడు.

వినో—అటువంటి త్యాగియు, మహాత్ముడును....

కేదా—త్యాగమా? ఎవనికైన ఒక దమ్మిడీ వద లునా?

వినో—దమ్మిడీ! పాడు దమ్మిడీ! తుచ్ఛము! తుచ్ఛము! అమూల్యమైన ఉపదేశము అందరికి వితరణము చేయుదురు.

కేదా—డబ్బు పుచ్చుకొనకయే?

వినో—వారికి ధనము తృణతుల్యము. వైష్ణవసంప్ర దాయమునకు వ్యాఖ్యానము వారినోటనుండి మీరు వినినచో

కేదా—తరించుదును కాబోలు?

నవీ—అదే వారి త్యాగము. మాయధనము గొనక యే వారు మనోవ్యాధికి మందిత్తురు.

కేదా—రోగము కుదరకున్న సొమ్మును తిరుగ ఇచ్చి వేయుదురా?

శంక—ఇచ్చివేయుట ఏమిటి? మొదట పుచ్చుకొన నిదే!

కేదా—బొత్తిగా? అట్లైన రోగుల కుచితముగా సేవ జేయుదురు కాబోలు?

వినో — సేవ చేయుటయా? గురుపుగారు రోగులను సేవ చేయుదురా? ఆయన ముఖచంద్రబింబము నారయుమ్మా. అట్టి దివ్యసుందరమూర్తి ఒకరికి సేవ చేయునా?

కేదా — అమ్మో! రాణీ! ఎంత ప్రమాదము! రోగి గాని రోగవతిగాని ఎక్కువ చిక్కుదనము కలవారైనచో?

వినో — అవేటిమాటలు కేదారా? గురువుగారిని నిందింతువా?

కేదా — నిందించుట నా కలవాటు లేదు. నేడు ఇంటింట ఇట్టి మహాత్ములే వెలయుచున్నారు. కుక్కగొడుగులు లాగున ఎటుచూచినను దాంభిక భాగవతులే! వారి చుట్టును మీబోటి భక్తులు కూడ కుమురుపడినారు. దేశము భాగ్యము పండినది.

వినో — అదుగో! ప్రభువువారు విచ్చేయుచున్నారు.

కేదా — ఎవరు? గురుపుగారా! అవతరించుచున్నారా? ఉదయించుచున్నారా?

అందరు — అవునో! దయచేసినారు. గురువుగారు ఉదయించినారు

కేదా — ఓహో! వారికాంతి సలుదిక్కులను విస్తరించుచున్నది!

వినో — అదిగో! వచ్చినారు.... (లేతురు)

[జపమాల త్రిప్పుచు కన్నులరమోడ్చి ఉపేంద్రుడు వచ్చును]

భక్తులు — సద్గురు! సద్గురు! నమోనమః

ఉపే—భక్తకోటికి భద్రమగుగాక! వత్సలారా! లెండు..(అందరు నిలుతురు)

వినో—ప్రభూ—కేదారుడు—

ఉపే—ఓహో! కేదారా! (నవ్వుచు) నేడు గొప్ప సుదినము. చైతన్యనాటకము చరితార్థమైనది. కేదారా! ఊరక రారు నీబోటి మహాత్ములు.

కేదా—ఒకసారి మీ నోటినుండి వైష్ణవధర్మ తత్త్వోపన్యాసము వినుటకు వచ్చితిని. మహాత్మా! వందనములు.

ఉపే—తత్త్వమా?...నాకేమి తెలియును? మూర్ఖుడను, జాల్ముడ, అవివేకిని! ఆ ధర్మతత్త్వము మహాజ్ఞానియు, భక్తశిరోమణియు నగు గౌరాంగదేవుడు... (కన్నులుమూసి నమస్కరించును).

భక్తు—ఓహో! హో! హో! (నమస్కరింతురు)

ఉపే—శ్రీకృష్ణ-చైతన్య-ప్రభు-నిత్యానందా-

భక్తులు—(పాడుచురు)

ఉపే—హరేకృష్ణ-హరే రామ-రాధాగోవిందా!

భక్తు—(పాడుదురు)

ఉపే—వృక్షమునుండి పుష్పము, పుష్పమునుండి ఫలము, ఫలమునుండి బీజము...కాబట్టి బీజమే ఉత్పత్తికి కారణము.

భక్తు—ఓహో! ఏమి గూఢతత్త్వము!

ఉపే—చూచుటకు పుష్ప మందముగా నుండును...
కాని

భక్తు — ఔను. కాని...కాని...

ఉపే.— పుష్పమే వృక్షమునకు చరమపరిణామము కాదు- చరమ పరిణతి బీజము. శ్రీకృష్ణుని బాల్యక్రీడలు పుష్పము- భగవద్గీత దానికి బీజము. రాధారమణ-కృష్ణా!

భక్తు —ఓహో! హో! (నమస్కరింతురు)

కేదా—పోకిరితనమునుండి జారత్వ చోరత్వములు, వానినుండి వంచనము.

భక్తు—అదేమి? కేదారా!

కేదా—ఛీ! ఛీ! కుక్కలారా, నోరు మూసికొనుడు. లేకున్న వంచనమునుండి కోపము, కోపమునుండి చెంప పెట్టులు- నే నేదైన సహింపగలను, కాని దొంగ వేషము చూచిన నా కోపలు మండును. బీదసాదలకు కాలిచ్చిన తల ప్రాణము లోకకు తెచ్చుకొనెడు పిసినిగొట్టు—పరుల దుఃఖమును పాటిసేయని పాషాణము—ఈ బాలిశుడు నోరున్నదని "నే నవతారపురుషుడను, మహాత్ముడ"నని దొంగ వేషము వేసుకొని లోకులను వంచించుచున్నాడు. ఇట్టి పోకిరిని పోలీసు వారి కప్పగింపవలెను. ఇది చైతన్యకూటమా? దొంగల గూడెమా? మీపని పట్టెద నుండుడు.

భక్తు—ఈర్ష్య! అసూయ!

కేదా—ఔనౌను. మీబోటి మహానీయు లీముని

ముచ్చును పొగడుట విన్న నా కీర్ష్య పుట్టవలసినదే! నేను కూడ మీకు కల్లు, గంజాయి, బంగు నిచ్చుచు కడుపుకూటికి కాస్త దున్నిచ్చినచో నా దగ్గర చేరి కుక్కలవలె కాలు నాకుచు తోక లాడించుచుందురు. మీబోటి తులువలతో నా కేల?....ఉపేంద్రప్రభూ! నేను మీకొరకు రాలేదు, యజ్ఞేశ్వరుని వెతకుచు ఆత డిక్కడ చేరియుండునని తలచి వచ్చితిని....ఐన నీతో నొకమాట చెప్ప దలచినాను. మీ తండ్రిగారు తన యావదాస్తియు నీకు చెందవలెనని వీలు వ్రాసి ఋణము మీసోదరుల కిద్దరికి చెరిసగము పంచి యిచ్చిరా? ఇది నమ్మజాలను. ఆలోచించినకొలది ఇది అబద్ధ మని నాకు తట్టుచున్నది.

ఉపే—నీ యభిప్రాయ మేమి? నీ వేమందువు?

కేదా—ఆ వీలసత్యము- నా యూహ నిజమని నిదర్శనము చూపించెదను....మహాత్మా- నాకు సెలవు

(పో బోవును)

ఉపే—కేదారా!....ఒక మాట—

కేదా—వలదు. ఇక సహించలేను. యజ్ఞేశ్వరుడు మీకూటములో నుండునని తలచితి, ఆతడు కనబడలేదు. ఇక్కడి వాతావరణము విషపూరితము, నా కూపిరాడుట లేదు- నేను పోయెదను. (పోవును)

ఉపే—ఒక్క మాట విను.

కేదా—(తెరలో) మిక్కుటమయ్యె! నిర్భరము! మతి పోవుచున్నది !

నవీ—ప్రభూ ! ఆపాషండు నిక పిలువకుడు.

భక్తు—పాలసుడు- పలువ- పాపి !

ఉపే—ఆహా ! పాడయ్యెనే ! వీని గతి ఏమికావలయు?

వినో—ఆహా! హా! ప్రభువువారు దయా సముద్రులు!

శంక—పాపుల నుద్ధరించుటకే పరమపురుషు లవతరింతురు. పనికిమాలినవారిని పరమపదమునకు పంపుదురు.

ఉపే—భక్తులారా ! సృష్టిలో పనికిరాని పదార్థమే లేదు- చూడుడు.

[అందరు పాట పాడుదురు]

అండపిండబ్రహ్మాండము నంతట-
నిండియుండుగద- నీరజనాభుడు-

సకలచరాచర-సర్గము గాంచియు
సర్వేశ్వరుని-చాతురి తెలియుడు ॥అండ॥

గడ్డిపోచయును-ఘనమగు వస్తువు
కనుడది గోవుల-కనువగు మేత

తిని యొసగవె అవి-తీయని పాలను
మనలను పోషిం-పను నాహారము ॥అండ॥

పండున నిండుగ-నుండును రసము
పీల్చిన తేలుచు-పీచును టెంకయు

బీజము నాటిన-పెరుగును వృక్షము
చెట్టు పెరిగెనా-చేకురు ఫలము ॥అండ॥

భక్తు—ఓహో! మహాత్మా! మరొక్క తత్వం—
[ఫలహారము కొని తెత్తురు]

ఉపే—భక్తులారా, గోధుమలు బీజములు, వాటిని చూర్ణము చేసిన పిండి యగును. దానిని నేతితో కలిపిన పూరీ అగును. ఎంత వింతయో కంటిరా?

భక్తు—ఆహాహా! ఏమి వింత!

ఉపే—ఆ పూరీ కోవా (చిక్కని పాలు)తో కలిపినచో కడుపులోనికి సులువుగా పోవును. (తినుచూ) శ్రీహరి! నీవే సత్యస్వరూపుడవు.

భక్తు—శ్రీహరియే సత్యస్వరూపుడు!

నవీ—మహాప్రభూ! మేమును కూడ పోయి హరినామ ప్రభావ మారగింతుము.

ఉపే—మంచి దట్లే చేయుడు. రాధేకృష్ణ!

భక్తు—గురూజీ! మీ చరణదాసులము, మామీద దయయుంచుడు, మేము పాపులము.

ఉపే—హరినామ సంకీర్తనము చేయుడు. సంసార సాగరమున భయముండదు.

భక్తు—చిత్తము, సెలవు,... [పాడుచుపోవుదురు]

ఉపే—భజన సేయువారే భక్తులు, ఆభజన ముక్తికైన నేమి? భుక్తికైన నేమి? భక్తియే ప్రధానము.... కేదారునికి

నాగుట్టు తెలిసినట్లున్నది. వాని కేదేని ఉపదేశించి నాకూటముగా కూర్చవలయు. లేకున్న కొంప మునుచును.... ఎవరో వచ్చుచున్నట్లున్నది, ఇక గొంటుతన మారంభింపవలయు. రాధేకృష్ణ, గోవింద, శ్రీహరీ!

(యజ్ఞేశ్వరుడు వచ్చును)

ఉపే—రమ్ము- యజ్ఞేశ్వరా! నీతో కొంత ప్రసంగింప వలయును.

యజ్ఞే—ఏమి టది?

ఉపే—మా తండ్రిగారు చేసిన అప్పు నాదే వేందు నెద్ద పుచ్చుకొనుము.

యజ్ఞే—అత డెట్లివ్వగలడు?

ఉపే—ఇల్లు వాకిలి అమ్మించుము.

యజ్ఞే—ఏలా గిచ్చినను సరే, నా కభ్యంతరము లేదు. ఒక చిల్లి గవ్వైన వదలను.

ఉపే—నీ దాహము తీరునట్టిదా?

యజ్ఞే—అబ్బో! నీకు ధనాశ లేదు కాబోలు! ఆస్తినంతయు మింగితివి. ఇంకను నీకడుపు నిండదాయె!

ఉపే—నీకేమి పెండ్లమా? పిల్లలా?

యజ్ఞే—అదెంతసేపు?

ఉపే—ఏమీ? తిరుగ పెండ్లి చేసికొందువా? ఏమి?

యజ్ఞే—పిల్లను వెదకుచున్నాను.

ఉపే—అలాగా! నాతో చెప్పనైతివి!

యక్షే— చెప్పుటకే వచ్చితిని.

ఉపే— విశేషము లేమి ?

యక్షే—నీతమ్మునికి అవివాహితయగు పుత్రికకలదట?

ఉపే—ఆః ఉన్నది. [కేదారుడు వచ్చును] కేదారా! తిరుగ వచ్చితివేమి ?

కేదా— దేవర్షిగారి నొకసారి చూచిపోవలయునని.

యక్షే—దేవర్షెవరు ?

కేదా—ఇప్పుడు మాటలాడుచున్నవారే ! హా! చిత్రమైన జోడు కుదిరినది ! ఉపేంద్రుడు, యక్షేశర్వుడు, మహర్షి, దేవర్షి.

ఉపే— కేదారా ! నీవుత్తముడవు.

కేదా— మీశిష్యుడ నైతే అట్లాదునేమో. మహర్షిసత్తమా ! పాపపుణ్యకలితమగు మర్త్యలోకమందలి మానవుడను. అనావృత త్వదీయ దివ్యజ్యోతిని సహించగలనా ?

ఉపే—(ఉమ్మటకని లేచి) కేదారా! ఇప్పుడే వచ్చెద. అన్యథా తలంపకుము....(వెళ్ళును).

కేదా—మీరిద్ద రిక్కడ కూడి ఏదో పైశాచిక కృత్యము చేయదలచి దానిగూర్చి ప్రసంగించుచుంటిరా ?.... ఆగోల నాకేల ? యక్షేశ్వరా ! ఇటు విను- నీవు వడ్డీ వదలకున్న అసలుకూడ ఎగవేయుటకు నిశ్చయించితిమి. దిక్కున్న చోట చెప్పుకొనుము.

యక్షే—అదేమి, కేదారా !

కేదా—నీ వేమన్నను వినను, చిల్లిగవ్వయైన ముట్టదు ; నీకు మాకు నింతటితో సరి.

యక్షే—తుదకు దేవేంద్రుడు నీ సలహానుగొని యిట్లు చేయుటకు నిశ్చయించెనా ?

కేదా—ఇప్పుడు-నీ వేమి చేయగలవు? దావా తెచ్చు కొనుము, నేను బారిష్టరు నడిగినాను. పత్రము కృత్రిమము, శాసనము కల్పితము, ఋణము రుజువుకాదు. సాక్ష్యమురాదు. వెఱ్ఱివాడా! వడ్డీ వదలుకో! అది మేలు. దావా చేసితివా అంతయు అంతరించును.

యక్షే—ఈ బెదరింపుల కేమి లే, దావాలతో నాతల నెరసినది, నాకా భయము లేదు. తప్పక దావా చేయుదును.

కేదా—ఇంకొకసారి చెప్పుచున్నాను. విను వడ్డి విడి చిపెట్టుము, వ్యవహారము మనలో మనము పైసలు జేసుకొందము. లేకున్న అసలు సున్న, వడ్డియు సున్న.

యక్షే—అసలు పోదు, వడ్డీపోదు- పైపెచ్చు దావా ఖర్చులు కూడ ముక్కునులిపి పుచ్చుకొనెద.

కేదా—నా మాటవిని వడ్డీ వదులుకో- నీయాటలు మావద్ద సాగిరావు. పెంకెతనము మాను.

యక్షే—నాది పెంకితనమా ?

కేదా—అసలు విడువవు, వడ్డి వదలవు, పెంకెతనము కాక మరేమి ?

యక్షే—పెంకెతన మెవరిది ? వడ్డీ కొరకే కదా

అప్పుడెప్పుట ? వడ్డిని విడుచు వెంగలి యుండునా ? నాదా పెంకితనము ?

కేదా—[వాచీ చూచి] ఓహో! తొమ్మిదయినది. రెయిలుబండికి వేళ గావచ్చినది. యజ్ఞేశ్వరా ! అయితే విడువవా ?

యజ్ఞే—విడువను.

కేదా—నీకు నరకమే గతి ! [పోవును]

యజ్ఞే—కేదారా ! ఒక మాట.

[కేదా॥ తిరుగవచ్చును]

కేదా—వదలుకొందువా ? శపించినాను, ఇక దానిని కర్మిస్మరింపజాలను ఇంతమాత్రము కరుణించెదను, వడ్డీ విడిచితివో నరకమున నొకసంవత్సరము కన్న నెక్కువకాల ముండనక్కర లేకుండ జేసెదను.

యజ్ఞే—ఈ మాటలకు నేను జంకువాడను కాను, నరకభయము నాకు లేదు. ఒకపని నీవుచేయగల్గినచో వడ్డినే కాక అసలుకూడ విడిచెదను.

కేదా—ఇదేదో అసాధ్యమైన పని.

యజ్ఞే—అసాధ్యము కాదు. తన్మూలమున ఇద్దరకును మేలగును.

కేదా—ఆలాగా ఇదేదో తృణావృతకూపము. (చేతి కర్రినుంచి) వినవలయు. ఏమిటది ?

యజ్ఞే—దేవేంద్రునకు వివాహయోగ్యయగు కూతు

మన్నించలు నా రెండవ భార్యా మున్ననే గతించినది. కావున ఆపిల్లను నాకు పెండ్లి చేసినచో—

కేదా—నీకా? మంచి వికటమే! నీ కామెనిచ్చుటా?

యజ్ఞే—ఏమీ? తప్పా? పిల్ల ఎదిగినది. ఎవనికైన నిచ్చి పెండ్లి చేయవలయునా, లేదా? కావున నాకు—

కేదా—ఆపిల్ల నిమ్మందువా? ఏమి వింత! ఏమి ముచ్చట! (నవ్వి) యజ్ఞేశ్వరా! నీకు మతి చెడినది, మందు తిను- నిజమే.

యజ్ఞే—నీకు నవ్వులాటగా నున్నదా? ఇది కుదిరి నచో దేవేంద్రునకు "ఏకక్రియా ద్వ్యర్థకరీ"అగును.

కేదా—యజ్ఞేశ్వరా! ఇటు విను. నా కొకకూతు రుండి—దానికి గుడ్డి, చెవుడు, కుంటి- ప్రపంచమున ఎన్ని అవ లక్షణము లున్నవో, అన్నియునుండి, దానికి వివాహము చేయకున్న నన్ను శూలమునకు గుచ్చుదుమని కులమువారు వెలపించినను, దానిని కాలుసేతులు గట్టి ఏ నోతినో, నూతినో, పడత్రోసి శూలమును అమితసంతోషమున అందరి యెదుట ఆరోహింతును కాని, మూర్ఖుడా! నీ బోటి పాల సునకు కట్టిపెట్టుదునా? సత్యము, సత్యము, సత్యము....

(పోవును)

యజ్ఞే—నీ కింత పొగరా! ఉండుండు నా మహిమ చూపెదను. (ఉపేంద్రుడు వచ్చును)

ఉపే—యజ్ఞేశ్వరా, ఆ మాట నీవు మనసార అన్న దేనా ?

యజ్ఞే—ఆహా ! అట్టిదే.

ఉపే—కాని, అది వివాహము కాజాలదుసుమా, వ్యభిచార మగును.

యజ్ఞే—ఉపేంద్రా ! నా యెదుట మునిముచ్చుతనము మానుము. మనలో పరస్పర మెరుగనివా రెవరు ? ఒక్క సారి నీగుట్టు—

ఉపే—నీకు పుణ్య ముండును. ఊరకుండుము. మాట వరుస కంటిని.

యజ్ఞే—నా కన్ను కప్పజూచెదవా ? మన మిద్దర మొకమందలోని వారమే, మన మిద్దరమును చెనటులమే, పైపెచ్చు నీవు మునిముచ్చువు. నాకు పెద్దన్నవు.

ఉపే—చాలించు- న న్నేమి సేయుమందువు ?

యజ్ఞే—ఇందు నాకు సాయము చేసెదవా ?

ఉపే—అట్లే చేసెదను.

యజ్ఞే—నిన్ను నమ్ముకొందునా ?

ఉపే—పూర్ణముగా !

యజ్ఞే—సరే- నేను పోయి వచ్చెదను (పోవును)

## మూడవరంగము

---

[దేవేంద్రుని ంటిలో అతడు భార్యయు ప్రవేశింతురు]

దేవే—అప్పు తీర్చక నే నింకొక ఖర్చు తలపెట్టబోను.

మాన—ఈడు వచ్చిన పిల్లను ఇంట నుంచుకొనుటకు వీలా?

దేవే—బయటికి గెంటివేయుము.

మాన—అట్లందురేల?

దేవే—తండ్రిగారి అప్పు తీర్చుకున్న తలవంపులు. అసలు ఫాయిదా కలిసి అయిదువే లయినది.

మాన—పిల్లకు పెండ్లి సేయుట తప్పునా?

దేవే—అదేమో. కుర్రవానికన్న కుర్రది ఎక్కువా?

మాన—ఇద్దఱును సమానులే.

దేవే—ఇద్దఱు కొడుకు లుండిరి, పెద్దవాడు బెంగ పెట్టుకొని సన్యసించెను; చిన్నవానికి చదువు చెప్పించు శక్తి లేకుండుటచే పాఠశాల కంపక పాడుచేసితిని.

మాన—వానికేమి? ఏదో రీతిని వాడు పొట్టపోసు కొనగలడు- పిల్లమాట?

దేవే—దీనితో తీరినదా? మూడవ దున్నది....లోనికి పొమ్ము, పిల్లపెండ్లికై నీ వనుకొనినంత అసడ్డ నాకు లేదు.

[ఆమె పోవును]

ఆహా ! ఈ బాలసూర్యాతపమున ఈ చెట్టుఆకులు ఎంత చక్కగా మిలమిల లాడుచున్నవి ? ఈ చెట్టునై నేను పుట్టిన మేలయి యుండును. హాయిగా ఆతపమును మలయపవనమును అనుభవించు చుండునుకదా...కూతురికి పెండ్లి చేయలే నను విచారమే లేకపోవును. నే నేల పెళ్లియాడితిని ?....దారిద్ర్యము నాకేల దాపరించెను ?....సంతాన మేల కలుగవలయు ? మొదటనే మోసమయ్యె.

[సదానందుడు వచ్చును]

సదా—ఏమి దేవేంద్రా ! చింతామగ్నుడ వైనట్లున్నావు ?

దేవే—లేదు, లేదు- నాకేచింతయు లేదు.

సదా—అట్లనకుము. నీ మోమున మందహాసము లేదు.- నాయెడ దాచెదవా ?

దేవే—దానికేమి గాని...సదానందా ! నీవు చిన్నప్పుడు పాటలుచేసి పాడుచుంటివే ?

సదా—ఇప్పుడు నట్లే చేయుచున్నాను కాని, ఈ పాటలు వేరు.

దేవే—ఎట్లు ?

సదా—ఇప్పుడు ప్రేమగీతములు వ్రాయును, పాడను, శృంగార హాస్య గీతముల రచించు దినములు గతించెను ; నాకు చెల్లినవి, సంఘమునకును చెల్లినవి ఇప్పుడు జావళీలు, పదములు పాడుట మానితిని. ఇప్పటి పాటలు వేరు.

దేవే—వీటి నెవరు విందురు.

సదా—వినక తప్పదు. వాటిని నాటకములలో జొన్పితివి. అన్నట్లు- నే నొక నాటక సమాజమును స్థాపించితిని సుమా, నీవు వినలేదు కాబోలు?

దేవే—అటులనా? వేషము లెవరు వేయుదురు.

సదా—అబ్బో! వారికి మనదేశమున కొదువ లేదు. దేనేంద్రా నేను పోవలయు.

దేవే—ఏమి?

సదా—తొందరపని యున్నది. ఈ త్రోవను పోవుచు నిన్ను చూడవలయునని వచ్చితిని. రేపు మరల వచ్చెదను.

(పోవును)

దేవే—నాకు నిజమైన నేస్తము సదానందుడే.... ఈతని కుమారునకు నా సుశీల నిచ్చి పెండ్లిచేసిన నెంతయు చక్కగా నుండియుండును, కాని అది అసంభవము. ఇతడు సముద్రయానముచేసి సంఘమునకు మహాపరాధము సల్పెను. కావున దానికి వెలియైె నాడు....కన్నము వేయవచ్చును, మోసము చేయవచ్చును, వేశ్య నుంచుకొనవచ్చును. సంఘము వాటిని సహింపగలదు, కాని విదేశయానము విషతుల్యమని యెంచును. ఆ ఘోరపాప మపరిహార్యము! అమార్జనీయము!....కూతురు పెళ్లి చింతచే కొన్ని రోజులనుండి నాకు నిద్ర లేదు. శరీరము....

[లోపల 'దేవేంద్రు డున్నాడా' అని కేక.] ఉన్నాను, రండు.

(హరి, నవీనుడు, శంకరుడు, వినోదుడును వత్తురు)

నవీ—ఇల్లు వసతిగానే ఉన్నది.

శంక—తాతలనాటిది. జమీందా రిల్లులాగున కట్టి నారు. చాల పెద్దది-

హరి—కాని, కొంచెము పాతగిల్లినది.

నవీ—ఐన నేమి ? మంచి వసతు లున్నవి.

హరి—అయినను అట్టే పెద్దది కాదు.

నవీ—దక్షిణమున తెఱపి యున్నది, గాలి చక్కగా వేయును. దొర లిండ్లవలె విశాలమైన జాగా అన్నివైపుల నున్నది....చంద్రకాంతుడు చేసిన పనియెల్ల నిగ్గు.

వినో—ఐదువేల రూపాయి లప్పుచేసి మూడూళ్ళను కొన్నాడు. ఆర్జనమున అతి చతురుడు.

హరి—ఔను కాని పంపకము మాత్రము పాడు చేసెను.

దేవే—అయ్యలారా ! మా తండ్రిగారు చేసినది అనాలోచితము కాదు; ఆచింత నాకు లేశమైన లేదు.

హరి—వస్తుతః నీకు అప్పించ కూడదు.

నవీ—దేవేంద్రా ! అప్పు విషయమున ఏమి చేయ దలచితివి ? యక్షేశ్వరు డింక ఓపిక పట్టునట్లు కనిపించదు.

దేవే—అప్పు తీరు నుపాయము ఇంతవరకును నాకు తోచనే లేదు.

శంక—దావా చేయవలెనని అతనికి లేదు, కాని ఏమి చేయగలడు?

దేవే—నిజమే?

నపీ—ఆ చిక్కు వేగము వదల్చుకొనుట మేలు; దావా పడినచో ఖర్చులు కూడ తగులు కొనును.

దేవే—అదియే ఆలోచించు చున్నాను. కాని సొమ్ము క్కడనుండి తే గలను? నాకేమియు పాలుపోలేదు. ఇల్లు వాకిలి, పాత్రసామాను అమ్ముకోవలయు, సాధనాంతరము తోచకున్నది, మమత పీడకున్నది. పిత్రార్జితము—

హరి—ఇంకొక చిక్కున్నది. అప్పు తీరుటతో సరి పోదు. అమ్మాయి పెండ్లికి సిద్ధముగా నున్నది. దానికి ధనము కావలయు. కావున

దేవే—నిజమే

హరి—'ఏకక్రియా ద్వ్యర్థకరీ' అన్నాడు, కాబట్టి నీ కూతురుని....ఇదిగో-యజ్ఞేశ్వరుడు....(కేదారుడు వచ్చును)

కేదా—గాడిదె కొడుకు మూరువాడీలను మించినాడు. ఒక దమ్మిడియైన వదలడట! పిసినిగొట్టు పీనుగ— అధమాధముడు....ఇంకే మందును? వానికి 'కుష్టురోగముపై గుల్ల గుల్ల పుట్టి' నట్లున్నది. ఇంత పొగరా! లుచ్ఛా! దూబ!

అప్పుడే మెత్తిగా చితుకగొట్టవలసినది ఎందుకు మరచితినా అని యిప్పుడు చింతించుచున్నాను. తులువ! లండి! పలువ!

దేవే—కేదారా! అంత క్రుద్ధుడ వయ్యెదేల?

కేదా—క్రోధమా! దౌర్భాగ్యునికి నూఁడుపా ళ్ళా యువు చెల్లినది, కాటికి కాలుదాచుకొని యున్నాఁడు, ధిక్కారి! కూళ! సుశీలను-తనకిచ్చి-పెళ్ళి చేసినచో, అసలును వడ్డియు వదలుకొనునట తొత్తుకొడుకున కింత పొగరా? నెత్తి పగుల గొట్టనైతికదా అని విచారించుచున్నాను. యజ్ఞేశ్వరుఁ తలచు కొనిన నా కరికాలిమంట నెత్తి కెక్కుచున్నది. దిక్కులేని పీనుగ, పశువు కాని మానవుఁడా?

హరి — కేదారా! తగు మనుష్యుని తూలనాడద వేల?

కేదా—ఏమో నాకే తెలియదు. తిట్టక మానను. నీచుని నీచుడనుట నా స్వభావము. ఏమిచేయుదును?

నవీ—కాని

కేదా—నీవు నోరు మూసుకొనుము తగుదునమ్మా అని చెప్పవచ్చెదవు.... మీరు వందిమాగధులు. చెప్పులుమో యు చెనటులు-పోయి వాని కాళ్ళపై బడి సొమ్ము తలధరిం పుడు. మీ రిక్కడ చేరి రేమి? దేవేంద్రా! వీరి నిటనుండి త్వరలో సాగనంపుము ఈ పాపులు ఏదో దుస్తంత్రము పన్ని నిన్ను మోసగించుటకు వచ్చిరి. శీఘ్రమే వీరిని గెంటి వేయుము.

దేవే—కేదారా! అట్ల నరాదు. తగు మనుష్యులు,

కేదా—వీరా తగు మనుష్యులు? పెద్ద వేషము వేసిన పెద్దమనుష్యు లగుదురా? వీరి నిప్పుడు గెంటివేయకున్న నీకును నాకును సఖ్యము నేటితో సరి.

దేవే—కేదారా!

కేదా—మంచిది. ఇచట నే నుండను (పోవును).

దేవే—కేదారా! కేదారా!...అయ్యలారా!

నవీ—మేము వీని మాటలను పాటిసేయము, తాగిన వానితో తగువా?

హరి—దేవేంద్రా! వాని మాటలకేమి, ఇటువినుము. నే నామాటనే నీతో ప్రస్తావించ వలెనని అనుకొనుచున్నాను.

దేవే—ఏది?

హరి—కేదారు డన్నదే-ఒక కార్యమున రెండు లాభములు రానున్నవి- అప్పు తీరును, అమ్మాయి పెండ్లి అగును.

దేవే—సరే- ఆలోచించి చెప్పెదను.

హరి—అట్లే కానిమ్ము. ఇట్టి సౌకర్య మీజన్మమున నీకు రాదు.

శంక—మేము పోవుదుము. నిశ్చితాభిప్రాయము నెప్పుడు తెల్పెదవు?

దేవే—రేపు.

హరి—మంచిది- ఇక మాకు సెలవు.

దేవే—గొప్ప చిక్కులో తగుల్కొన్నాను.... వాడు మూడుకాళ్ళ ముసలి...కాని...ఏమి చేయుదును ? ఇంతకన్న వేఱుపాయము తోపదు...ఆఁ ! కాదుకాదు... వాఁ డధముడు ...నీచుడు...తెలిసి యుండియు కన్యను గంగలో ద్రోయుదునా ?

(ఉపేంద్రుడు వచ్చును)

ఉపే—దేవేంద్రా ! నీ యోగక్షేమముల నారయ వచ్చితి. అందరికిం గుశలమా ?

దేవే—శరీరమునకు కుశలమే, కాని మనసునకు మాత్రము అలమట తీరలేదు. సంసారమున అనేకములగు వ్యథలు.

ఉపే—తమ్ముడా ! తథ్యము. సంసారము కేవల దుఃఖమయము, సుఖమన్నది కాగడా న్వెదకినం గానరాదు. కావుననే జ్ఞానులు సంసారము మాయయని వక్కాణింతురు. ఈ వ్యామోహజాలమున బడిన మానవుడు రాగరజ్జువుల ద్రెంపగల్గుట దుస్సాధ్యము బుద్ధదేవు డందుననే సంసారము నేవగించి సంపదలను రోసి తురీయాశ్రమమును స్వీకరించెను. ఆ మహాత్ముని మనోబల మపారము. పాపిజీవు లట్లు చేయజాలరు. సాధ్యమగునంతవట్టు నిర్లిప్తులమై యుండవలయు; నీవు నాకు తమ్ముడవు గాన నుపదేశించుచుంటిని. చింతను వీడుము.

దేవే—నేను దానిని విడుతు నన్నను నన్నది విడువ కున్నదే! పిల్లల గొంతుకలు పిసికి చంపలేను కదా? మీాగు మిక్కిలి...

ఉపే—సోదరా! ఈషణత్రితయము నేవగింపుము. శ్రీకృష్ణనామసంకీర్తనము జీవకోటికి పరమాధారము. రా ధేకృష్ణ! హరే! గోవింద మురారే!

దేవే—పెద్దవాడు దిగులొంది సన్యసించె, చిన్నవా డు తుంటరులతో చేరి చెడినాడు. పెండ్లియైన పిల్ల విశంతు వయ్యె, రెండవదాని వివాహమునకు దారి తోచకున్నది.

ఉపే—కర్మానుభవంబు! సంసారకూపంబున ద్రెళ్ళి నవారి కిట్టిచింతలు ప్రాయికముగా ప్రాప్తించుచుండును. ఏమి సేయనగు?

దేవే—దిన వెచ్చము తీర్చుకొను సరికి తలప్రాణము తోకకు వచ్చుచున్నది.

ఉపే—సోదరా, కానిదినములు సమకూరినవి- ధన ములేనివానికి దారి కానరాదు. దేనిని కొందమన్ననూ ద్రవ్య ము కావలయు... అన్నమునకు ద్రవ్యము- వస్త్రమునకు ద్రవ్యము, ద్రవ్యము లేకున్న దైన్య మావహిల్లును. గోవిందా, హరే, మురారే, అనాధరక్షణతత్పరా! ఆశ్రితావనా!

దేవే—అన్నా! తండ్రిగారు చేసిన అప్పు నావంతైదు వేలును నీవు తీర్చెదవా? కాలక్రమమున నేను నీయప్పు తీర్చెదను. అట్లుచేసితివేని ఈచిక్కు లన్నిటిని విప్పుకొన

గల్గుదును. సోదరుడను, నీకన్న చిన్నవాడను, అర్భకుడ- ఈ మేలు నాకు గూర్పుము.

ఉపే—దేవేంద్రా! ఐదువేల రూపాయిలు! అంత సొత్తు గూర్చుట మాటలతో తీరునా?

దేవే—కష్టము కావుననే నిన్నడిగితిని. మొదట కన్నను గన్న ఋణము గడవనిమ్ము.

ఉపే—దేవేంద్రా! నీ కొక సులభమగు నుపాయము నుపదేశింతు....యజ్ఞేశ్వరునకు సుశీలనిచ్చి యుద్వాహ మొ నర్పుము. దాన నాత డసలును వడ్డియు నొకసారియే వద లుకొనును. అట్లొనర్చునటుల నతని నే నొప్పించెద. నా మా ట వినుము. నీకన్న నేను పెద్దవాడను.... లేకున్న...దానవ భంజనా! శ్రీహరే, మురారే!

దేవే—అన్నా, అట్లు చేయుమందువా?

ఉపే—ఉపాయాంతరమున్న నీవే మాపుము....వా ని యొద్ద నమితధనమున్నది.

దేవే—సరే! ఆత డిక నెంతకాలము జీవింపగలడు?

ఉపే—తదనంతరమున తద్ధనమంతయు సుశీలకు సం క్రమించును, నీ కేచింతయు నుండదు. దేవేంద్రా! బాగుగ నాలోచించు కొనుము. నీకన్న జ్యేష్ఠుడ. కావున నీ శ్రేయో భివృద్ధికై యింత దూరము బోధించితిని, అమితధనమున కధీ శ్వరుడ వగుదువు, అన్ని పీడలు నపసారితము లగును. కేశ వా! మధుసూదనా!

దేవే - ఊఁ...(తల యూచును)

ఉపే—చక్కఁగా నాలోచింపుము...ఇంటిచుట్టూ అడవివలె చెట్లు పెరిగియున్నవి, వీని ద్వరలో ఛేదించుము, లేకున్న వ్యాధి ప్రబలును చూవె ! నీ హితముగోరి యిట్లుపదేశించుచున్నాడను...నీ కెప్పు డేది కావలయునో నా కెఱిగించు చుండుము. అప్పుడప్పుడు వచ్చి చూచి పోవుచుండెదను. రాధేకృష్ణ ! రాసవిహారీ !...(పోవును)

దేవే—అన్నా ! అన్నా ! నా మీద నీ కమితదయ. మందహాసములకును మధురభాషణములకును కొదవ యుంచవు. ఇట్లు శుష్కప్రియభాషణములు శూన్యక్రియలు గల వా రెందరేని కలరు.

[మహేంద్రుడు వచ్చును]

మహే—అమ్మ పిల్చుచున్నది.

దేవే—వచ్చెద పొమ్ము (అతడు పోవును)...సుశీల మెడకు ఉరి పోసెదను. దుర్గకు బలి యొసంగెదను...పిదప దాని నుదుటి వ్రాత ఎట్లున్న అట్లుజరుగును. (సుశీల వచ్చును)

సుశీ—అమ్మ మిమ్ము పిలువమన్నది.

దేవే—ఆమె నిట రమ్మను...(అమెపోవును) హిందూ సంఘమా ! నీ నియమముల మూలమున కూతురు గృహస్థునకు అభిశాపరూపమున పరిణమించుచున్నది. దాని నెట్టులైన పతియింటికి పంపగలిగిన వాడు ధన్యుడు. ఇందుచేతనే ఆడది పుట్టినదని వినినంతనే ఆమె తల్లి మోము

ముడుచును, తండ్రి తల వంచును...కానిమ్ము. చింతించిన ఫలమేమి ? ఇంటెంట దూరెడు కుక్కయైన నాకన్నమేలు. కూతురు పెండ్లి కాదాయెగా అను చింత దానికుండదు. అబ్బబ్బ! గుండియ ప్రీలుచున్నది. కన్నులు నీరు గ్రమ్ము చున్నవి.

(మానద వచ్చును.)

ప్రేయసీ ! నేను నిర్ధారణ జేసితిని.

మాన—ఏమని ?

దేవే—గొంతుక కోసెదను.

మాన—ఎవరిది ?

దేవే—సుశీలది.

మాన—అయ్యో ! అట్లనెద రేల ?

దేవే—యజ్ఞేశ్వరునకు దానినిచ్చి పెండ్లి చేసెదను.

మాన—అదేమి ! అతడు కడువృద్ధుడే ! మూడుపాళ్లాయువు గడచినది.

దేవే—ఇంకొక పాలున్నది కదా ? దానికే పెండ్లి చేయునది.

మాన—మొన్న నేదో సంబంధ మున్నదంటిరే ?

దేవే—వా రైదువేల నడిగిరి !

మాన—జాగ్రత్త బెట్టుగు.

దేవే—ఎక్కడనుండి తెమ్మందువు ?

మాన—అప్పు చేసి

దేవే— అబ్బ! ఎంత సులభమైన మార్గమును జూపి తివి! అప్పు నీ విచ్చెదవా?

మాన— నేనా? సరి సరి. ఎవరినైన అడుగుడు.

దేవే— ఎవరి నడుగుమందువో దయచేసి చెప్పుము, నా కట్టి యుపకార మొనర్చిన దాన వగుదువు. నాకు అప్పెవ రిచ్చెదరు?

మాన— ఏమి? మీ అన్నగారి నడుగకూడదా?

దేవే— అన్నగారినా! (నవ్వి) అన్నగారు అప్పిచ్చె దరా! నాకు!

మాన— తమ్ముడు కష్టముల పాల బడుచున్నప్పుడు తగిన సాయ మన్నగారు చేయరా?

దేవే— ఇది కలికాలమని మరచితివా? కాంతామణీ.

మాన— అడిగి చూడుడు.

దేవే— ఆ ముచ్చటయు తీరినది. పరాభవ మయినది

మాన— ఇక నేమి సాధనము?

దేవే— సాధనమా? ఎటుచూచినను సాధనమును చూపు వారు కానరు. అంతట నిశ్శబ్దము- నీరవము- నిబి డాంధకారము!

మాన.— అట్లైన ఈ పెళ్లి నిశ్చితమే?

దేవే— మన మిద్దరమును దానిని కని, లాలన పాల నలు చేసి, విద్యాబుద్ధుల చెప్పించి, ఆ బంగారు బొమ్మను

పెద్దదానిని చేసితిమి ఎందుకో తెలిసినదా? సంఘమును మహాశక్తికి బలి యిచ్చుటకు రా! రమ్ము. నీవు దానికాళ్లను గట్టిగా పట్టుకొనుము, నేను తల పట్టుకొందును యజ్ఞేశ్వరుడు తెగని కత్తితో దానిని నరుకును. ఆ రక్తము సంఘమను బ్రహ్మరాక్షసి నోటిలో పోయుదము అంతట దాని కడుపు నిండును.

---

## నాల్గవ రంగము

(దేవేంద్రుని ఇల్లు - వినయ కుమారుడు, సుశీల)

విన—సుశీలా, నీకు పెండ్లిమాట లయినవా?

సుశీ—[తలవంచి కాలి బొటనవ్రేలు నేల రాయును]

విన—వారు నిన్ను చూచి వెళ్ళిరా?

సుశీ—[తలవంచి] ఆ.

విన—అంతయు నిశ్చితమైనదా ?

సుశీ—అదేమో !

విన—నీవు పెండ్లి యాడెదవా !

సుశీ—నాకు తెలియదు.

విన—నీ పెళ్ళి భోగొట్టా నీ వెరుగవా !

సుశీ — (కన్నీటితో) వినయా!

విన — ఎందుకు?....సుశీలా! ఊరకుందువేల?

సుశీ — నీకు నాపై ప్రేమ కలదా?

విన — ప్రేమ యున్నదా అని యడిగెదవా! ఔను, నీ వడుగ వలసినదే, ఈ విషయము నీతో నే నెప్పుడును ప్రస్తావించ లేదు. దీనిని తలచునప్పు డెల్ల నా శరీరమందలి రక్తము వేడిచెందును. ఉన్మత్తుడగు కైదివలె నామాటలు నిగళమును తెంచుకొని బయటపడ నుద్యమించును. కావున నే నామాట నెత్తలేదు.

సుశీ — నీవు నన్ను ప్రేమింతువా?

విన — నీ వెరుగవా? గ్రహింప జాలవా? నేను నోరు విప్పి చెప్పలేదు, కాని నా కంఠస్వరము, నా వైఖరి, నా జాలును, జూచిన నీకేమియు పొడకట్టుట లేదా?

సుశీ — నోటినిండ ఒక్కసారియైన అనకుంటి వేల?

విన — నీ మేలుకోరకే.... మనకు పెండ్లి కాజాలదు.

సుశీ — ఏల?

విన — నీతండ్రి కిది సమ్మతము కాదు. ఏలయన నేను విదేశయానము చేసితిని.

సుశీ — నా తండ్రి సమ్మతింపకున్నను నేను నిన్ను పెండ్లియాడిన?

విన — ఏ మంటివి! నా కొరకు నీవు కర్తవ్యము నుల్లంఘింతువా? సుశీలా! ఇది నీకు తగదు. అట్లు చేయరాదు.

సుశీ — నా కృత్యములకు పూచీ నాది, నీది కాదు. నేను పసిపిల్లను కాను, నాకూ వ్యక్తిత్వ మున్నది- కావున స్వవిషయమున నాకును కొంత అధికార మున్నది. నా తండ్రిగారు తన కిష్టమైన ఏ ముసలిముద్దనో నా కంఠమునకు ఉరిపోయ నెంచిన నే నూరకుండు కాలము దాటినది. నా మంచిచెడ్డల నిర్ణయింప జాలు వివేకము నాకు ప్రాప్తమినది. కావున ఇప్పు డాతని యూటలు సాగవు

విన — నీ తండ్రియెడ నీకు కర్తవ్యము లేదా ?

సుశీ — నాయెడ నాతనికి కర్తవ్యము లేదా ?

విన — నీతండ్రి చేయునది నీమేలు కోరియే కదా ?

సుశీ — ఈ మాట నీవు ధీరప్రశాంతస్థిరబుద్ధితో నను చుంటివా ? అరుపదేండ్ల తొక్కు, లంపటుడు, వానికి నన్ను కట్టిబెట్ట దలచుచున్నాడు. ఎవరికొరకు ? సంఘభీతిచే, అర్థాశచే.... నా సుఖమునకై కాదు

విన — అట్లే కావచ్చును. పిత్రాజ్ఞాపరిపాలనమునకై నీవు స్వార్థమును త్యజింపవలదా ?

సుశీ — ఏల ?

విన — ఆత్మోత్సర్గము !

సుశీ — ఇట్లన్యాయముగా ఆత్మోత్సర్గము కావింపను. అది నా చేతకాదు. తండ్రి, సంఘము, భగవంతుడును సంత సింతురని అవిచారకృత్య మాచరింపను,-ఆత్మత్యాగ మును

చుంటివి. పరుల హితమునకు బలి యగుట ఆత్మత్యాగ మగును కాని ఈ సమాజమను క్రూరరాక్షసి కడుపు నింపుటకు గొంతుక కోసుకొనుట ఆత్మత్యాగముకాదు, అది ఆత్మహత్య! అందుకు నే నొప్పను. నా తండ్రి కిష్టముకాకున్నను నేను నిన్ను పెండ్లిచేసుకొన దలచిన?

విన — నీతండ్రి యనుమతి లేకున్న మనకు పెళ్ళి కానేరదు. కర్తవ్యప్రతికూలములగు కార్యముల జరుగనిచ్చువాడ గాను.

సుశీ — అయితే నామీద నీకు ప్రేమ లేదన్నమాటే.

విన — ప్రేమబలముననే ఇంతదూరము హిత ముపదేశించితిని. నాప్రేమ యెట్టిదనిన — నిన్నంటినచో నీ గాత్రము మలినమగునేమో అను శంకచే నీదరి జేరవెరతును, నిన్ను తేరిచూచిన నీ రూపమందిరము అపవిత్ర మగునను భీతిచే కన్నులార నిన్ను జూడవెరతును; శుభ్రనిశీథాకాశము జూచునప్పు డెల్ల నీశీలము జ్ఞప్తికివచ్చి దివ్యసుఖ మనుభవించు చుందును ......ఐనను నీజనకుని అనుమతిలేక నిన్ను పెళ్లి చేసకొన నొల్లను.

సుశీ—అట్లైన ఇదే మనకు చరమసమావేశము.

విన— కానిమ్ము- ఈ శిక్ష అతికఠినము నిన్ను గాంచకున్న నా కీప్రపంచమంతయు పాడువడినట్లు తోచును, గుండె వ్రీలును....కాని మనఉభయుల క్షేమమునకై— మనకు

సమావేశము కాకుండుటయే శ్రేయము. నీ తండ్రియాజ్ఞ ననువర్తింపుము. అది విఘ్న మగునను భీతిచే నేడు నీకంట బడను. నీకర్తవ్యపాలనపథమును నిరాటంక మొనర్తును- నాకు సెలవిమ్ము- నీకు మేలగుగాక !

సుశీ——ఓహో! నీవు కూడ ఈ కుట్రలో చేరితివా ! సరే.... నాకు వివాహమే వలదు వివాహము — నిర్మములగు పురుషుల జేరుట న్యాయ్యము కాదు. వీరిని వలచుటా ? వీరి చరణములకు దాస్య మొనర్చుటా ? ఏమి దుష్కృతము! వినయా! నన్ను రక్షించితివి_ నా యారాటమును తొలగించితివి ... నాకు పెళ్ళియే వద్దు.

[వినోదిని వచ్చును]

వినో——సుశీలా, నీ వారయ లేవైతివి.

సుశీ——దేనిని ?

వినో——వినయుని ఉదార హృదయమును.

సుశీ——ఉదార....హృదయమా!

వినో——సందియ మేల? వినయు డెంత మహాత్ముడు ! ఏమి ఆత్మోత్సర్గము ! ఏమి మనోదార్ఢ్యము ! నీ వారయ నేరవు ! అప్రాజ్ఞవు కావు....హా ! దైవమా, పురుషుల చిత్తము లింత ఉదారములా ? వాటిని జూచి విస్మయచకితుల మగుటచే మాకు నోరాడకున్నది. వారి పాదరజము నేని మేము పోలజాలము.

సుశీ—ఏల ?

వినో—వినయుడు నిన్నెంత ప్రేమించునో నీకు తెలియ లేదు. చేత జిక్కిన స్వర్గమును ధూళివలె ఎగురజిమ్మినే-కర్తవ్యనిర్వహణార్థము.... నీ తండ్రియెడ నీ వొనర్పవలసిన దానిని నీచే నాచరింప జేయుటకు.... అది నీకు బోధపడలేదు.

సుశీ—నా తండ్రియెడ నే నెట్లు వర్తింపవలయునో నే నెరుగుదును. ఒకరు నాకు చెప్పనక్కర లేదు.

వినో—నీ వేమియు నెఱుగవు, చెప్పినను నీకు బోధ పడదు. ఇంగ్లీషు చదువువల్ల నీకబ్బినది అహంకారమొక్కటే. ఇంకేమియు అబ్బలేదు.

సుశీ—నీ యుపన్యాసమును ఈపాటి కట్టిపెట్టి దయ చేయుము.

వినో—తండ్రిగారికి నీపై ప్రేమ లేదని తలచు చుంటివా ? కాలుసేతులు కట్టి నిన్ను గంగలో త్రోయుట వారికి ముచ్చట, పరమసుఖదాయక మనుకొంటివా ? సంతానమునకై ఆత డెట్టి సంతాపము, ఎట్టివేదన, ఎట్టివ్యథ నొందుచుండెనో నీవు గుర్తింప గల్గితివా ?

సుశీ—అది నీవే ఎరుగుదువు కాబోలు ?

వినో—ఆహా, నే నెరుగుదు. అహోరాత్రములు మనకై వారెట్లు కుందుచున్నారో నేను గాంచుచున్నాను. వారి కంటికి నిదుర యన్నది లేదు. నేను ప్రక్కనే నిల్చి విసరు చుందును. వారి కాహారము నోటికి పోవుటలేదు. నా చేతు

లతో వారి కన్నము వర్ధించుచుందును. వారిమతి చెడినది. మనగతికి కుందుచూ తెలా త్రోకా లేనిమాట లాడుచుందురు-వారి యారాట మాత్రయు నేను గాంచుచుందును. నీ వెరుగవు.

సుశీ—కుడిచి కూర్చుండి వా రిట్లు కుందనేల?

వినో—నీ కిప్పుడు బోధపడదు, ఇకముందు బోధపడగలదు. నీ మానస మిపుడు స్వార్థాహంకారాంధతమసంబుచే నిబిడముగ నాచ్ఛాదింపబడి యున్నది. త్యాగసూర్యుడు నీ చిత్తాకాశమున నుదయించిన త్రోడనే అహామిక యను పొగమంచు విరియబార, స్వార్థమను ధ్వాంత మంతరింప, అప్పుడు వారి యంతరంగము నీ కవగతమగును.

సుశీ—తండ్రిగారు నన్ను బాగుగ నెరుగుదురు. ఎవరేదిచెప్పినను నా చిత్తానుసారము వర్తించు అబాధ్య పుత్రికనని పలుపురతో పల్కుచుందురు. నా స్వభావమునకు ప్రతికూలముగా సంచరించుట నాకు సాధ్యము కాదు. సంఘమునకు బలినగుటకు సమ్మతింపను. ప్రాణముండిన పోయిన పంతమిదియె.

వినో—నీ కెవరు చెప్పగలరు? (పోవును)

సుశీ—కాంతను భార్యగా పురుషున కర్పించుట దాసత్వమను త్రాటితో దాని మెడ కురిపోయుటే!...బలవంతముగా నాకు పెండ్లిసేయ నెవరు సాహసింతురో చూచెదగాక!

[మానద వచ్చును]

మాన—అమ్మా! సుశీలా! ఒక్కర్తె విక్కడ నేమి చేయుచున్నావు? కాలుసేతులు కడుగుకొని రమ్మా, జడ వేసెదను. పెళ్లికొడుకు వచ్చును.

సుశీ—వచ్చేవాడు వరుడు కాడు, యముడు. అతని కౌఱ కలంకరించుకొన నక్కరిలేదు. ఒడలెంతబురదైన విడు వడే యముడు.

మాన—ఇవేటి మాటలు?

సుశీ—అమ్మా, నావలన మనయింటికి కీడుమూడ నున్నదా?

మాన—అట్లు నుచుంటి వేమి?

సుశీ—లేకున్న, నన్ను వెళ్లగొట్టుటకు విశ్వప్రయత్న మేల? పొమ్మన్న నేనే పోదునే.

మాన—నీకు మతిపోయిన ట్లున్నది.

సుశీ—నా బుద్ధి సుంతయు చెడలేదు. అట్లైనచో నేను దీనిని గ్రహించు టెట్లు? అమ్మా! నీకు వింతగా నున్నదా? (లోన నుండి కత్తిని తెచ్చి) అంత ఆర్భాట మక్కరలేదు. దీనితో నొక్కవేటు చాలును-కానీ!

మాన—ఇదేమి?

సుశీ—ఒక్కదెబ్బతో తెగ నరుకుడు. ముక్కలు ముక్కలుగా చిత్రవధ చేయకుడు. మీకన్న కసాయివాడు మేలు. ఒకదెబ్బతో నరికి చంపును, శరీరము నిండ శూలము

లను గుచ్చి బాధపెట్టి చంపకు. ఇంత వృధాప్రయత్న మేల? నాకు పెళ్లి యేవద్దు.

మాన—అలా గనవద్దు సా?

సుశీ—విను నేను మీయిల్లు గుల్లచేసి, మీ సంసార సుఖమునకు గొప్ప వ్యాఘాతమును కల్పించితి నేని, మీరు కుందవద్దు. రేపురాత్రినుండి మీకంట పడను. భీతి వలదు.... నాకు పెండ్లివద్దని నాన్నగారితో చెప్ప— బలవంతముగా పెళ్ళి చేయ లేరు. ఏలయన లత్పూర్వమే- ఈ కత్తిని చూచితివా? దీనితో గొంతుక కోసుకొందును.

మాన—(చేయి పట్టుకొని) అట్ల నరాదమ్మా!

సుశీ—నేను చేయునది సిగ్గుమాలినపని యని నాకు తెలుసును. కాని ఏమి చేయుదును? నా కెవరును దిక్కు-లేరు, రక్షకుడగు తండ్రి, తొడమీద జేర్చి దుఃఖముల బాపు తల్లి, తోడు నీడయగు తోబుట్టువు-సంతాపము దీర్చు స్వజనము- వీరందరు నా యెడ విముఖులైరి! ఇంత మంది నాపై కత్తిగట్టినారు- కన్నతల్లి కంఠమునకు చమురు పూయ, కన్నతండ్రి కత్తి నూరుచున్నాడు, ఇక నా రక్షణము నేనే సల్పుకొనవలయును, కావున కత్తిని చేత పట్టితిని- అమ్మా, ఇటు విను నేనీ వివాహమున కొప్పుకొనను- తప్పని సరి యంటిరా తల గ్రుంచుకొనెద-

(పోవును)

హరాన—నిజముగా, కాలుచేతులు గట్టి దన్నిని గంగ [illegible] యుతే.... పోయి వద్దని వారించెదను.

(పోవును)

(మహేంద్రుడు, కేదారుడును వత్తురు)

కేదా—మహేంద్రా! మీ తండ్రి ఏడీ?

మహే—ఎక్కడికో వెళ్ళినారు.

కేదా—నే ననుకొనిన ట్లాయినది. క్షణములో సర్వనాశ మైనది. కానిమ్ము. ఎటు వెళ్ళెను?

మహే—అదేమో.

కేదా—ఎప్పుడు వచ్చును?

మహే—నే నెరుగను.

కేదా—తెలిసినను ప్రయోజనము లేదు. ఇక నే నాగను. ఘరుగురు పని, చెప్పక తీరదు. (పైకి చూచి) కార్య ప్రవాహ మిట్లున్న దేమి? అత్యవసరముగా అతని చూడ వచ్చితిని, వెరి) దేనేంద్రుడు వేళకు లేడు. ఇందుచే ఈశ్వరుడు లేడనియే సిద్ధాంతము చేయవలయును. ఉన్నచో నిట్టి సమయమున ఈ పనికి విఘాతము రానెల్లునా? శ్రీరామపురము నుండి ఈమాట చెప్పుటకు ఇంత త్వరలో వచ్చితిని. వ్యవధి లేదు. (వాచి చూచి) ఆలస్యము చేయరాదు. మహేంద్రా మీ నాన్నతో చెప్పు.... కాదు కాదు.... దావా విషయములు నీకు బోధపడవు.... ఆఁ....విను...విని జ్ఞప్తియున్నంత మీ

అయ్యతో చెప్పు. "నే నంతయు సరిజేసినాను. గాడిదె కొడుకు దావా తెచ్చుకోనీ "....

మహే—ఎవరు ? యజ్ఞేశ్వరుడు గారా ?

కేదా—"గార "యినాడేమి ? తొత్తుకొడుకు, పాజి- లుచ్చ నాలిముచ్చు-

మహేం—ఇంక దావా చెయ్యడు.

కేదా—జంకినాడూ ! నేను జాక్సనుగారి నడిగినాను. అందుకే అడలు— భ్రష్టుడు—దావా చేయునట— పత్రిమునకు సాక్ష్యము రాదు. అందుకే పంద జంకినాడు.

మహేం—అది కాదు.... అతనికి మా అక్క నిచ్చి పెండ్లి చేయుదుము.

కేదా—పెళ్లి ! ఏ మంటివి ! సరిగా చెప్పు. పెళ్లే ! విధిపూర్వక వివాహమే ?

మహేం—నేడు ప్రధానము. తాంబూలాలు పుచ్చుకొనుటకు వారు వచ్చెదరు.

కేదా—ప్రధానమే ! తాంబూలములు పుచ్చుకొందురా ? పిల్లను చూచుట— పిల్లవానిని చూచివచ్చుట— ఇచ్చుట— పుచ్చుకొనుట—కట్నము, కానుకలు, అన్నియు తెగినవా ? చూడ వచ్చెదరా ? ఎప్పుడు ?

మహేం—నేడే !

కేదా—సరే.... ఈపెళ్లి కాదు. నేడుండి నేను రేపు పోయెదను. ఇచ్చటనే భోజనము చేసెదనని మీ అమ్మతో

చెప్పుము. నా కొరకై కేమియు ప్రయత్నము చేయవద్దు. సుశీల ఏదీ?

మహేం—కనబడ లేదు.

కేదా—దాని కీపెళ్లి యిష్టముకాదు గదా?

మహే—అదేమో?

కేదా—దాని కిష్టమైన నేమి?

(సుశీల వచ్చును)

అమ్మా, నీకు పెండ్లి యట? (ఆమె ఊరకుండును) సరే. ఈ పెళ్ళి కాజాలదు. నేను కానీయను. నీకిది యిష్టము లేదు కదా? (ఆమె ఊరకుండును) తెలిసినది. మహేంద్రా! ఈ పెళ్లి కాదు. సుశీలా, మీ నాన్నతో 'నాకు కూటికి గుడ్డకూ మీ రీయలేనిచో కేదారుడు నన్ను పోషించున' నుము. నా కాడపిల్లలు లేరు. నీవే నా కూతురవు. మా యింటికి రా! (సుశీల ఏడ్చును) ఏడువకు. ఈ పెళ్లికానీయను; నేను కానీయను. మహేంద్రా! కౌగితము కలమును తీసుకొనిరా! (పోవును. నవ్వి) దేవేంద్రా! బోధపడినది. అంతయు తెలిసినది. నీ యవస్థను నాకిచ్చి నా యవస్థను నీవు కొనుము....ఇట్టియెడ నేమి చేయవలయునో మన సంఘమునకు చక్కగా బోధింతును. దిక్కుమాలిన మన సమాజము కసాయి దుకాణము. పిశాచి! రాక్షసి! (సుశీలతో) అమ్మా! క్షమించు. నీయెదుట తిట్టకూడదు. మన సంఘము చాలా

మంచిది, పరమసాధువు. సనాతనార్యఋషిసంఘటితము. అది పాడువడునా ? అట్లనగూడదు.

(కాగితము కలముతో మహేంద్రుడు వచ్చును).
మహేంద్రా, తెచ్చినావా ? ఇటు తెమ్ము.... కాదు. నీవే వ్రాయుము.

మహే—ఏమి వ్రాయను ?

కేదా—'ఈపెండ్లి కాబోదు' అని వ్రాయుము. పిమ్మట నందరికిని చూపవలయును...సవ్యోద వేమి ? వ్రాయి ! (అతడు వ్రాయును). ఏదీ చూపుము. (చదివి) ఏదీ కలము. ఇదిగో నా సంతకము. 'శ్రీ కేదారనాథ భట్టాచార్యులు' చూడు. దీనిని జాగ్రత్తగా నుంచుము. అందరికి చూపవలయు. సంతకమయినది. ఇక భయము లేదు. అమ్మా, భీతిల్లకు. రమ్ము లోనికి పోవుదము (వెళ్లుదురు).

హే—అసాధ్యుడు లాగున్నాడు. (వెళ్లును).

---

## ఐదవ రంగము.

(దేవేంద్రుడు, ఉపేంద్రుడు, యజ్ఞేశ్వరుడు, సదానందుడు, ఉపేంద్రుని భక్తగణము)

ఉపే—దేవేంద్రా, జాగేల ? ముహూర్త మాసన్నమైనది, ప్రధానము కానిమ్ము, "శుభస్య శీఘ్రమ్".

హరి—ఔ నౌను-శీఘ్రిమ్- ఏమి నవీనా ?

నవీ—ప్రిభువుగారిమాట తప్పునా?

శంక—దేవేంద్రా, ఏ మాలోచించుచున్నావు ?

దేవే—ఏమియు లేదు- ఇంట్లో నేడో రోదనధ్వని యగుచున్నట్లున్నది. మీకు వినబడలేదా ?

ఉపే—ఏమియూ లేదు, కాసింత.

హరి—దేవేంద్రా! ఇట్టి వరుడు లభించుటకు మీకన్య అఖండతపస్సు చేసి యుండవలయును.

శంక—కుబేర సంపత్తి !

నవీ—ఓహో !

వినో—వయసు నెంచవు.

హరి—దానికేమి ? జుట్టుకు నల్లరంగు పూసినచో ఇరువదేండ్ల పెళ్లికుమారుని లాగుండును.

సదా—దంతములు కూడా కట్టించుకొనవలయునేమో?

శంక—దేవేంద్రా, ఎందుకీ ఆలస్యము ?

దేవే—లేదు లేదు- ఏను సదానందా, సంకల్ప మారంభింతునా ?

సదా—నీ చిత్తము.

దేవే—అట్లు కాదు. మనస్ఫూర్తిగా ఈ పనిచేయుమని నీవు చెప్పువరకు నేను చేయజాలను. నీవు చెప్పినవెంటనే చేసెదను.

ఉపే—నేను చెప్పుచుంటినే ?

నపీ — ప్రభువుగారు చెప్పిన చాలదా ?

దేవే — మీరు కాదు - సదానందా, నీవు చెప్పవలయును.

సదా — నీ కూతురు - నీ యల్లుడు - నే నేమనగలను ?

దేవే — అట్లనకుము. శుభకార్యము చేయనున్నాను. సంతుష్టమగు మనసు - ప్రసన్నమగు ముఖముతో నీవు సమ్మతింపకున్న నేను దీని నొనరింపను. మనసార నీవు వచింపుము.... ప్రారంభింపనా ? సదానందా ! నీవు నాకు బాల్యమిత్రుడవు - ఇట్టి సమయమున నూరకుండుట నీకు తగదు. నీముఖమున మందహాస రేఖల గాంచకున్న నే నీ కార్యముప క్రమింపను. ఏ మందువు ?

సదా — సరే.... నా అభిప్రాయ మెరిగింపుమని ఇంతగా అనురోధించు చున్నావు కావున, చెప్పుచున్నాను విను. నీ కూతురికి ఈ పెండ్లి చేయుటకు పూలుగ కాలుసేతులు కలియగట్టి గంగలో బడద్రోయుట మేలు.

హరి — ఏమి, సదానందా, అట్లనుచున్నావు ?

ఉపే — దేవేంద్రా ! నేను చెప్పుచున్నాను, అది చాలదా ? నా మాటకన్న సదానందునిమాట నీ కెక్కుడు శుభదాయకమా ? నేను నీకు సోదరుడ, అగ్రజుడ, నామాట నీకు రుచింపదా ?

నపీ — గురువుగారి వాక్యము —

సదా—ఉపేంద్రా ! నీ విట్టిల సలహా యిచ్చుచున్నా వో నాకు బోధపడుట లేదు. నీస్నేహవాక్యములను తెఱ మఱుగున కౌటిల్య మమరియున్నదని నా నమ్మకము. నీ స్వరము జూడ నీవు తడిగుడ్డతో గొంతుక కోయువాడవని స్ఫురించుచున్నది. ఎవని కొంప మాపదలచితివి ? సుశీల గొంతుక కోయదలచినావా ? అట్టి కృత్యము మాకు కల్పనాతీతము.

హరి—సదానందా, మహర్షిగారి నిట్లుల నిందించెద వేమి ?

సదా—మీకు జవాబు చెప్పనక్కర లేదు. మీరు క్షుద్రోపజీవులు....ఉపేంద్ర బాబా ! నీ హృదయ మింత నీచమని నే నెరుగను. నే నొరుల నిందించువాడను కాను. నీ బోటి తగుమనుష్యుని ఇంతకన్న నేమని దూషింపగలను ? మంచి వేషధారివి ! మోసకాడవు !

నవీ—గురువుగారు...

ఉపే—నవీనా, ఊరకుండుము. సదానందా! పదిమంది నాయెడ భక్తిశ్రద్ధల నగపరచిన అది నాదోషమా ? వృక్ష పరిణతి ఫలమునుబట్టి యుండును. మంచి ఫలమును భుజించిన నరు లావృక్షమును కొనియాడిన, తప్పు దానిదా ?

సదా—అయ్యా, క్షమించుడు. దేవేంద్రునికి సోదరులై, వాని శుభోదర్కము నభిలషింప దగిన మీరే ఇట్టి సలహా నిచ్చినందుకు మిమ్ము నిందింపవలసి వచ్చెను. పొగడ మిమ్మె

ప్పుడైన పల్లెత్తు పాడుమాట అంటినా ? దేవేంద్రా! ఈవివాహము మీా సుశీలకు సమ్మతమా ?

దేవే—నాకు తెలియదు.

ఉపే—కన్యకసమ్మతితో నేమిపని ? ఎద్దునడిగి గంత కట్టుదురా ?

శంక—గురువుగారు చెప్పుచుండిరే !

సదా—(ఉపేంద్రునివైపు చూచి ఘృణ నగపరుచును) దేవేంద్రా ! నీ కొమార్తెకు బాల్యముననే వివాహమొనర్చియుండిన ఆమె సమ్మతి గొన నక్కరయుండదు, కాని పదునారువత్సరములు పైబడినవి, చదువుకొన్నది, కావున ఆమె సుఖదుఃఖములయెడ ఆమె సమ్మతిని గొనక పెండ్లిచేయుట భావ్యముకాదు.

యజ్ఞే— సదానందా ! చూడు, ఈ శుభకార్యమున కంతరాయము కల్పింతువేల ? దేవేంద్రా! యీావద్పృణమును వడ్డీతో వదలెదను.

సదా —ముందు కన్య అభిప్రాయమును కనుగొనిరండు.

ఉపే —ఆమె మాతృని వలదనునా ? మా అభిప్రాయమే ఆమె అభిప్రాయము.

(కేదారుడు మరికొందరును కర్రలతో వత్తురు)

కేదా—ఆఁ, సమయముననే వచ్చినాము.

సదా—కేదారా, వీరంద రెవరు ?

కేదా—అంతయు ఆఖరున చెప్పెదను. ముం దీదురాత్మని- (యజ్ఞేశ్వరునిగూర్చి) పెండ్లి కొడుకా, పో మ్మిటనుండి.

యజ్ఞే—ఏమి యీ దురంతము ! దేవేంద్రా?

కేదా—నేను పొమ్మన్న మూర్ఖా పోవేమి ?

దేవే—కేదారా, ఏమిది ?

కేదా—నీ వూరకుండుము, లేకున్న కలహముతప్పదు. లేవవేమిరా ! కుక్కా ! పందిలాగున బలిసి నావు. పద బయటికి. లేకున్న కిరీటపూజ తప్పదు. ఒక కాలు కాటికి ఇంకొకటి నరకమునకును చాచుకొన్న నీకు పెళ్లి కావలెనా ? పెద్దమ్మా- పద- బాలిశా ! నిర్భాగ్య దామోదరా !

యజ్ఞే—నన్నెందుకు తిట్టెదవు ?

ఉపే—పెద్దమనుష్యులయెడ నీవిట్లు వర్తింప జెల్లునా? కేదారా !

కేదా—ఓహో ! మహర్షిగారా ! మిమ్ము చూడనే లేదు. ఏమిరా ! లేచెదవా ? చెప్పుదెబ్బలు కావలెనా ? ఊఁ. లేవవేమి ?

సదా—కేదారా !

కేదా—మాటాడ వలదని చెప్పితినే. సదానందా ! నాకు రైలువేళ మించుచున్నది. ఈ శాకిమూక నిక్కడ నుండి వెడలనడపిన గాని నేను వెళ్ళను. మంచిమాటలతో వీరు వెళ్లినచో దెబ్బలు పడవు, లేకున్న కర్రలకు పని కల్పిం

చవలసి యుండును. నిజము పల్కితిని. ఏమి కదలుదురా? లేక కత్తి లెత్తమందురా?

హరి—యిది కేవల మన్యాయము. గౌరవనీయుల యెడ కారుకూతలా?

కేదా—నోరుమూసుకొనుము. మీరందరును కుక్కలు పందులు, గాడిదెలు, పరోపజీవి కీటకములు. పోదురా? లేక దుమ్ములువిఱుగ పొడువనా?

శంక—ఏమయ్యా! వరుసపెట్టి అందరిని తిట్టుతున్నావు

కేదా—ఊరుకో. గుడ్లగూబా!

శంకా—నేను గూబనా?

యజ్ఞే—శంకరా, ఊరుకుండుము. కయ్యమునకు కాలు దువ్వకు.

శంక—ఇంకొకసారి అననీ—

కేదా—ఒకసారి కాదు. నూరుసార్లంటాను. గూబా! నా కాలస్యమగుచున్నది. సదానందా! నానేరము లేదు. తాటిటెంక లాగు తేరా నీవు లేవవేమిరా? తన్నులు కావలె నా? (కాలితో యజ్ఞేశ్వరుని పొడుచును)

యజ్ఞే—నన్ను పొడిచెద వేమిరా?

కేదా—తెలియలేదా? ఇదిగో (తిరుగ పొడిచి) ఇప్పుడు తెలిసినదా?.... తే....అన్నలారా! కత్తి లెత్తుడు.

యజే—సరే. పోవుచున్నాను కాని దావా తెచ్చెదను. ఊరుకోను. చూడు నాదెబ్బ!

(వెళ్ళును)

భక్త—(వెళ్ళుచూ) చూడు మాదెబ్బ.

కేదా—చూచెద లెండి. పిచ్చికుక్కల్లారా! ఈపిండారిపంద యజ్ఞేశ్వరుడు నేడో రేపో చావనున్నాడు, వీనికి పెళ్ళి కావలెనట; ఇంకొక క్షణ మాగిన పెద్దపెళ్ళి చేసి పంపుదును. మహర్షిసత్తమా! భక్తగణము పారిపోయినది. చిరిగిన గుడ్డపీలికవలె మీరిచట జీరాడనేల? అనుష్ఠానసమయ మాసన్నమైనది. ఆశ్రమమున కరిగి భగవద్గీతా పారాయణ మొనర్పుడు.

ఉపే—నీ దౌష్ట్యమునకు కారావాసమే శిక్ష!

(పోవును)

కేదా—ఒకసారి కాదు. లక్షసారు లేగుటకు సిద్ధము. కర్తవ్యము నిర్వర్తించితి. తత్ఫలము దైవాధీనము..

సదా—కేదారా! ఎందరో గీతలను చదువుచుందురు— నీవో వాని నాచరణమునకు తెచ్చితివి. ఏదీ, నీ కౌగిలిమ్ము....

కేదా—ఇంక మూడు నిముసముల వ్యవధి యున్నది.

దేవే—కేదారా! ఎంత పనిచేసితివి!

కేదా—నన్నేమియు ననవలదు, జగడము పెరుగును,

ఇదే రైలునకు వేళ సమీపించినది. తిరుగ నీమూర్ఖునకు నీకూతురినిచ్చి పెండ్లి చేసితివా— నేనొప్పను— కీడు మూడక తప్పదు. ఇప్పుడే చెప్పుచున్నాను. ఈమాటకు తిరుగు లేదు. మరునాడే యజ్ఞేశ్వరుని తల పగులగొట్టి, నీకుమార్తె సౌభాగ్యమును హరింతును. దీని మఱువకుము—

(పోవుదురు)

# భారత రమణి

## రెండవ అంకము

### మొదటి రంగము

(దేవేంద్రుని ఇల్లు-దేవేంద్రుడు, సదానందుడు.)

దేవే—కేదారున కొకనెల ఖైదు విధింపబడునా ?

సదా—అంతవరకు రాదు. పది పదిహేను రూపాయిలు జరిమానా పడవచ్చును ఐననేమి ? కేదారు డద్భుత వ్యక్తి సుమా !

దేవే—ఏల ?

సదా—'నీవు కొట్టితివా ?' అని న్యాయాధికారి అడుగ 'గట్టిగా కొట్టితిని' అనెను. 'దానికి నీవుచింతింతువా?' అని యడుగ 'ఎంతమాత్రమూ చింతింపను ; వీలున్నచో ఇంకొకసారి చితగగొట్టెదన' నెను.

దేవే—పాపము! అతనికి నామూలమున ఖైదయ్యెను. నేను నా కూతురుని జంపుటకు కత్తినెత్త ఆవేటును కేదారుడు తన వక్షమున గొనెను. తండ్రికి బలికాకుండ తనయను తప్పించెను.

సదా—నేడు నీవు కచేరికి పోదువా ?

దేవే—పాపము ! నాకై జెయిలులో పడినాడు.

సదా—మీచిన్నపిల్లకు జ్వర మెట్లున్నది ?

దేవే—నా కొలకు నా కూతురికై- నేను తండ్రిని ఓహో !....

సదా—వైద్యుడు వచ్చెనా ?

దేవే—ఆహా ! సంఘమా !

సదా—అట్లు చూచెద వేమి ?

దేవే—మంచి సంఘమే. సదానందా, మనలో నిరుపేదలకు స్త్రీసంతాన మేలకల్గునో ఎరుగుదువా ? పాడువడిన ఈ బజారున పరమపూత లేల అవతరింతురు ? వారి దోష మేమి ?

సదా—దేవేంద్రా ! సమాజమును నిందింతు వేల ? దోషము దానిది కాదు, నీది- చదువు ముగియకుండగనే నీ వేల పెళ్లియాడితివి ?

దేవే—మా తండ్రిగారు చేసిరి.

సదా—సరే- తండ్రి తప్పునకు తనయుడు దండింపబడును. ఇది క్రొత్త కాదు.

దేవే—ఆఁ. ఈ త ప్పాతనిది కాదు. పెళ్లివిషయమున కనుగొమ్మని ఆయన మా అమ్మతో చెప్పెను. మాయమ్మ నన్నడుగ నే నంగీకార సూచకముగ తల యూచితిని. నాకు బాగుగ జ్ఞప్తియున్నది. ఆ దినములలో వివాహమును నందన

వనమున పారిజాతములే పూయుచుండు ననియు, సురభిస్నిగ్ధ మలయపవనము లెప్పుడును వీచుచుండు ననియు, కోకిలలు గానము సేయుచుండు ననియు, ఎంచుచుంటిని, కాని యిట్టి విషఫలముల నాస్వాదింపవలయునని కలనైన తలపలేదు. ఇప్పుడు సంసారమను వలలో చిక్కుకొంటిని; చిక్కులను విప్పినకొలది చిక్కము బిగియుచున్నది, తప్పించుకొను దారి తట్టుటలేదు. దరిదాపు కానరాకున్నవి. సదానందా, ఏది వెరవు ?

సదా—ముందొక నాడు చెప్పితినే.

దేవే—ధైర్యము చిక్కదాయె. ఏల?....ఆఁ! నేను పురుషుడను కానా ?....కాదు....విడిచెద....నిశ్చయించుకొంటిని. తెంచి వైచెదను.

సదా—దేనిని ?

దేవే—చేతికి చిక్కితిని కదా అని చెంపలు వాయించుచున్నది....బాధ ఎక్కుడగుచున్నది. ఇక భరింపలేను.

సదా—ఏమిది దేవేంద్రా, అట్లనుచుంటివి ?

దేవే—సదానందా, నిన్నొకటియాచింతు, ఇచ్చెదవా?

సదా—ఏమి కావలయునో అడుగుము, సంకోచము వలదు. ఇన్నాళ్ళనుండి నాతో మెలగుచున్నను నా నైజ మెరుగలేకుంటివి. నా సంపదలో సగమడిగినను సంతసముతో ఇచ్చెద. ఇదివర కొసగనందుకు హేతువిది. నీవు నన్నడుగ లేదు, ఒకసారి అడిగిచూడు.

దేవే—నీవు నాకు ధన మీయ నక్కర లేదు. దాని కన్న విలువగల పదార్థ మడిగెదను. నీ కుమారుని నాకిచ్చి నాకుమార్తెను నీవు కొనుము.

సదా—నీవు నోరువిడిచి అడిగినది. నా చేతిలోనిది కాదు. నా కుమారుని వివాహము వాని ఇష్టముపై నున్నది.

దేవే—నీ కుమారుని కిది సమ్మతమని నేనెరుగుదు.

సదా—అట్లైన నేటి నుండియు నీకూతురు నాకోడలు.

దేవే—ఇప్పుడు నీ వింటికేగుము. నేను మనసు దిట్టము చేసుకొనెదను.

(సదానందుడు పోవును, ఉపేంద్రుడు వచ్చును).

ఉపే—దేవేంద్రా! ఆ విషయమున నేమి నిశ్చయించితివి?

దేవే—అన్నా! సుశీలను సదానందుని తనయున కిచ్చి పెండ్లి చేసెదను. ఇక ఆ విషయమున చింత లేదు

ఉపే—అయ్యో! అయో! నీకు మతి పోయినదా ఏమి?

దేవే—ఔను కాబోలు.

ఉపే—సంఘము?

దేవే—విడిచెద.

ఉపే—సోదరా! నీ కుమారిక యోగ క్షేమముల నారయు పూచీ నీయందున్నది. నీవు సనాతనధర్మమునునిలువ బెట్టినచో నందఱకును మేలొనగూడును. ఈ పురాతన

దేవే — పురాతనమే కానిమ్ము ఈపాడు సమాజమునకై నా సౌఖ్యమంతయు త్యజించి నేను దానికి దాసుడనగుటకు అది నాకొనర్చిన మేలెద్ది? సంఘము నాకొక కాసైన నొసగదే? పైపెచ్చు నాపై కార్యభారము మోపియే యున్నది. సనాతన ధర్మముల శాసించునాడు ఒకనికి కష్టము ఘటిల్లిన నదియందరియు దాపని పంచుకొనుచుండెడువారు. ఇప్పుడో ఒకడు చచ్చుచున్నను ఇరుగుపొరుగువారు వాని వైపు తొంగి చూడరు. ఇట్టి నిర్మమసమాజ ముండిన నేమి? మండిన నేమి?

ఉత్త — తమ్ముడా, స్వార్థమును త్యజింపవలయును.... స్వార్థత్యాగ మెంత సుందరము! ఎంత మధురము! ఆహా! నేను తద్ధర్మము నాచరించుచుంటినని బడాయి కొట్టను. ఆ ప్రయత్నముననే మగ్నుడనై యున్నాను. నారాయణా! గోవిందా! గోవిందా!

దేవే — (నవ్వి) స్వార్థత్యాగ మొనర్పుమంటివి. దేని కొఱకు? ఈసంఘముకొఱకా? నేనే నాసుఖము నాకొమార్తె సుఖమును సంఘమున కర్పింతు ననుకో. అంతటితో దీని కడుపు నిండునా? తినుచున్నకొలది దీనికి తనివితీరకున్నదే. పొట్ట పెరిగిపోవుచున్నదే కాని దీని ఆకలి అణగుట లేదు. దీని అత్యాచారము ఉచ్ఛృంఖలమై పెచ్చుపెరుగుచున్నది.... నేను దీనిని మన్నింప జాలను.

ఉత్త — తమ్ముడా! తప్పువడితివి. కులధర్మమును కూల

ద్రోయు చున్నావు. "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః". సముద్రయాన మొనర్చిన వానికి నీ సుత నీయజనునా ? సంఘము నిన్ను వెలిబెట్టదా ?

దేవే—వెలి వేయనీ—ఇప్పుడు వెలియన్న అవమానముగా గణింపబడుట లేదు, మీదుమిక్కిలి గౌరవభాజనముగ గన్పట్టుచున్నది. స్వర్గీయులగు విద్యాసాగరుడు, రామమోహనరాయలు, కేశవచంద్రసేనుల బోటి మహాపురుషులతోబాటు సంఘమునుండి బహిష్కరింపబడుట లజ్జావహము కాదు. వెలిబడినవా రెట్టివారు ? అంత్యజుల సోదరభావమున అక్కున జేర్చువారు, బాలవితంతువుల దుస్స్థితికి పాలుపడిన గుండె కలవారు, కూటికిలేక కూతుళ్ళపెండ్లికి కట్నము లీయలేక వారి నవివాహితలుగ నుంచువారు, దారాపుత్రాదుల దేహపరిశ్రమచే ధనము నార్జించి దైన్యములేని జీవిక జరుపువారు, విద్యాభ్యాసమునకు దేశోద్ధారణమునకును విదేశయానము సేయువారు,—ఇట్టి యుత్తమకార్యముల నిర్వహింప బూనువారే కదా *వెలివేయబడినవారు !—కాని వేశ్యాలోలురు, వ్యభిచారులు, నాలిముచ్చులు, దొంగలు, స్త్రీహత్య జేయువారు, పదిసారులు బందిగ్రాహులయినవారు, పంచమహాపాతకులు, కులసతుల కాపురముల మాపి వారికూటమియందు కులుకుచుండెడువారు, కులహీనులచేతికూడు తినువారు, బాహాటముగా కల్లుత్రాగువారు, జూదరులు, వేలకొద్ది నిరీహుల కొంపలకు చిచ్చుపెట్టువారు, సజ్జనుల్ల గొంతు

కలుకోసి, సంగడికాండ్ల పచ్చనికొంపలు మాపి, మెత్తని వారి సొత్తును హత్తుకొనువారు, వంచకులు, వేషధారులు,— ఇట్టివారు సంఘముచే సాదరముగా సమ్మానింపబడుచున్నారు. పతితులగువారు పరమధార్మికులై ప్రజ్వరిల్లుచుండ, విద్యాసాగరునివంటి వివేకులు వెలివేయ బడుచున్నారు. అట్టిచో వెలికి వెనుదీయ నేల ?

ఉపే—నీవు శాస్త్రాధ్యయనము సేయలేదు. నేనూ శాస్త్రములన్నిటిని చదివితినని విఱ్ఱవీగను. ప్రధానమైనవాటిని పఠించితిని.

దేవే—మీరు చదివినందుకు ఫలము ప్రత్యక్షము కాలేదా ? సంఘములో నున్నను సంకటములు తప్పవు, దానిని వీడిననూ సంకటములు తప్పవు. ఈరెండుమార్గములలో నొక దాని నెంచుకొనవలయును. నేను రెండవదాని నెంచుకొంటిని. మీరు నాకేమియు బోధింపనక్కర లేదు. వైష్ణవసంప్రదాయానుసారులగు మీ భక్తబృందమును తరింపజేయుడు. ఇక దయసేయుడు.

ఉపే—సరే. నీ యిష్ట మెట్లో అట్లే ఒనర్పుము. మధుసూదనా! గోవిందా! మురారే! ......(పోవును.)

దేవే—ఈ విషయమున నింతవరకూ నాకించుక సంశయ ముండెను, కాని ఈతని ఆచరణమున అది నివృత్తమయ్యెను. బ్రతికితిని.

(మానద వచ్చును)

ప్రాణేశ్వరీ ! నేఁ డుత్సవదినము, మన మానందింప వలయును.

మాన ___ ఏల ?

దేవే ___ నేను బంధముల ద్రెంచుచున్నాను. సంఘమను త్రాడును సడలించు చున్నాను. పంజరమును భేదించి బయటికి పరుగెత్తు చున్నాను. నావెంట నీవుకూడ వత్తువా ?

మాన ___ ఎటకు ?

దేవే ___ (పైకిచూపి) అటకు. నీలాకాశతలమునకు. అంశుమంతుని అలయమునకు. పరమపవిత్రమగు వాయుమండలమునకు ___ సదానందుని తనయునకు సుశీల నిచ్చి పెళ్ళి చేసెదను.

మాన ___ ఎవరికి ?

దేవే ___ సదానందుని కుమారుఁడు వినయునకు.

మాన ___ నిశ్చితమైనదా ?

దేవే ___ ఆహా, సునిశ్చితము. ఇదివర కించుక సంశయ ముండెను, కాని అన్నగారి సందర్శనమున అదీ తీరినది. ఇక నీవు పెళ్లిపనులు సాగింప వచ్చును.

మాన ___ నాథా ! నేఁడు సుదినమే ! ఇంతకన్న సుఖదాయక మగువార్త నుండఁబోదు. సుశీల కిది సమ్మతమే.

దేవే ___ నీకు ?

మాన—మీకొద్ది సమ్మతమో నాకదే సమ్మతము. నేనుపోయి సుశీలతో చెప్పెదను. (పోవును)

దేవే—ప్రేయసీ! నీ మనసులోని మాట ఇన్నాళ్ళు దాచగల్గితివా? "నీకేది సమ్మతమో నాకదే సమ్మతము" అని నోటినిండ మాటాడి పతిభక్తి బయలుపరిచితివి. యక్షేశ్వరునితో వివాహప్రసంగము సల్పునపుడు కన్నుల నీరుపెట్టితివే కాని పెదవి కదల్పలేదు. వినయున కిచ్చి వివాహ మొనర్తు నన్న ఆనందమును పట్టలేక పోతివా? కాయము స్థూలము కాకున్న నృత్యము చేసియుందువు కాబోలు. (పోవును)

(మానదా వినోదనులు వత్తురు)

మాన—సుశీల ఏదీ?

వినో—కాళ్ళు కడుగుకొను చున్నది.

మాన—మీకొక శుభవార్త తెచ్చితిని.

వినో—ఏదది?

మాన—సుశీలను వినయున కిచ్చుటకు మీ తండ్రి గారు నిశ్చయించిరి.

వినో—నిజముగా?

మాన—ఆహా! నేను సుశీలతో చెప్పివచ్చెదను.

(పోవును)

వినో—ఆహా! సుశీల కిది ఎంత సుఖదాయకమైన వార్త! ......నాకో? ......వద్దు. దాని సుఖమే నా సుఖము.

ఇంతకన్న నాకేమి కావలెను? నేను బ్రహ్మచర్యము పూనెదను. దైవమా! దీనినెట్లు నాచే నిర్వహింప జేసెదవో నీదే భారము. (సుశీల వచ్చును) చెల్లెలా! శుభవార్త వింటివా?

సుశీ—వింటిని, కాని ఇప్పుడట్లు జరుగనేరదు.

వినో—ఏది జరుగనేరదు?

సుశీ—నే నాతని పెండ్లియాడను.

వినో—చిత్రముగా నున్నదే!—ఇంకెవని పెండ్లి యాడుదువు?

సుశీ—నాకు పెళ్లియే వలదు.

వినో—సరి సరి. ఆడది పెళ్లి చేసుకొనకున్న నెట్లు?

సుశీ—ఆకాశము విరిగిపడునా? బ్రహ్మాండము బద్ద లగునా?

వినో—అమ్మో! ఎంత మాటాడితివి! మనదేశమున అనాదినుండియు ఆడది పెండ్లియాడుచునే యున్నది. ఇదే మన ఆచారము.

సుశీ—ఔను. నేనెరుగుదును. మన దేశమున ఆడవారి యెడ అత్యాచారము ప్రబలుట గనుచుంటివా? శ్రీరామచంద్రుని వంటివాడు ప్రజలను సంతసింప జేయుటకు నిరపరాధిని అగు ధర్మపత్నిని ఇంటనుండి తరిమెను. అది ఉత్కృష్టమగు స్వార్థ త్యాగమని అందరూ ఆ మహారాజును ప్రశంసింతురు. ప్రజలు కోరినచో తన తల్లిని కూడ తరిమియుండును శాబాసు! సకల ధర్మవేత్తయగు యుధిష్ఠిరుడు మాయ దురోదరంబున మహా

సాధ్వియగు ద్రౌపది నోర్చెను. ఈ పురుషజాతికి సర్వనాశము సంభవింప వలదా ? కాలానుక్రమణమున కోట్లకొలది హిందూనారీమణుల బాష్పప్రవాహము వారి వేడినిట్టూర్పులచే ఆవిరియై ఆకసము నిండియున్నది. అది నేడభిశాప రూపమున ఈ పురుషజాతిపై విషవృష్టి కురిపింపదా యే. ఇంత స్వార్థపరులగు పురుషులు మనల అబలలజేసి అనాదినుండియు మనయెడ అత్యాచారము సల్పుచున్నారు. ఇట్టి జాతి మట్టిలో కలియవద్దా ?

వినో—సుశీలా ! ఒక్క గుక్క నెన్ని మాటలాడితివే ? నీవు ఒక పక్షముననే పల్కుచున్నావు. మంచియు చెడ్డయు నెంచవలదా ? మనకు సంభవించిన అవిచారమునకు అత్యాచారమునకును పురుషులే కారణభూతు లనుకొన్నను, మనలను సుగుణములచే నలంకరించినవారు వారుకారా ? ప్రపీడితయు పరిత్యక్తయు నైన సీత అవసానకాలమున "జన్మజన్మాంతరములయందు శ్రీరాముడే నాకు పతియగుగాక" అని మొరవెట్టలేదా ? ఇట్టిమాట వేరొక దేశమున వేరొక జాతియందు, వేరొక మహిళాబృందము నోట వెలువడునా ?

సుశీ—ఇంకేదేశమున నైన తండ్రి యాజ్ఞానుసారము తల్లితల నరికిన సుతు డుండునా ? అక్కా, యుక్తుల కేమిలే. క్రోధోద్రేకమున నాబుర్ర సమూలము దహింపబడుచున్నది. మనదేశమందలి మగవారు, సతులకు పతులే ప్రేమ భాజనములు, పరమధ్యేయులు, ఉత్కృష్ట దైవములనియు

ఉన్నతపదవులనుండియు, వారిని త్రోసి ఉత్కృష్ట శాస్త్రములుగాని ఉచ్చ ధర్మముల నిర్మించి యున్నారు. వాటిని పట్టుకొని పదవులం దరున్న వాదులాడుచున్నారు. అభాగినులమగు మనజాతికి ఇట్టి మానసిక కఠోర నియమములచే ఆత్మగౌరవమును అణగ గొట్టుట వారి స్వార్థసిద్ధికే గాని మరొకటి కాదు. పురుషులు శౌర్యాల నుంచుకొందురు. వారికి ఎనుబదియేండ్లు నిండినను ముక్కుపచ్చలారని ముద్దరాండ్రను పెండ్లి చేసుకొని ఆకల్యాణముల కాలితో తన్నుదురు; దీని నంతయు మనసంఘము సహించి యుండుటచే అందుననే నారీజాతి సుఖసాధన సామగ్రియను నియమము కల్పింపబడెను ఇది ఏదేశమునందైన కలదా?

విన—చెల్లెలా! పురుషజాతి చెడ్డదైన మనము సదా ధర్మములనుండి పతితలమగుటకేల? వారిని ఉద్ధారకుల జేయరాదా? వారు మనకొనర్చిన అన్యాయములకు మనము బదులు చేయుటకు వారేమి మనకు శత్రువులా? సుశీలా! సమస్త పీడను, సహనము నభ్యసింపుము. సహించియుండుటకే పత్నులు జన్మించిరి. మన జీవనముల నర్పించుటయే మనకు విధి. భగవంతుడు మనలను పురుషులతో సమానముగా సృజింపడయ్యె. ఎట్టి దుర్దినములందైన హిందూజాతి తలయెత్తి తిరుగగల్గుటకు వారి నారీచరితమే మూలహేతువు, వారి స్త్రీధర్మమే ప్రబల కారణము. అట్టి చారిత్రము అట్టి నారీధర్మము మనము కోల్పోవలెనా?

సుశీ—సరే. నీవు నాకు చెప్పనక్కరలేదు. ఇట్టి నీ

వాచరింప గలవు, నాచేత గాదు; నీ కందు విశ్వాసమున్నది. నాకు లేదు. తగవు తీరినది. ఇక చాలించు.... (పోవును)

(మహేంద్రుడు వచ్చును.)

మహే—ఇదే నోటుల కట్ట. ఇప్పుడు నా సముడెవడు? దీనితో కొన్నాళ్లు కాలక్షేపము కును.

వినో—మహేంద్రా! నీ చేతిలోని దేమి?

మహే—ఆ? యేమియు లేదు....కాగితములు.

వినో—ఏ కాగితములు?

మహేం....కాదు_ప-త్రి-ము_లు.

వినో—నేను నమ్మను. ఏవీ చూపుము.

మహే—ఇవి నోట్లు.

వినో—నీ కెక్కడివి? నిజము చెప్పు.

మహే—ఆటలో గెలుపు.

వినో—అయ్యో! తమ్ముడా! జూదమాడుట మానవా? నీవు బొత్తిగా పాడైనావు. ఎన్నిసారులు చెప్పినను వినవు. మన దారిద్ర్యము నీ మనసున నాటుట లేదా? ఇట్టి చెడు దినములయందు తండ్రిగారికి తగినంత సాయము చేయుట మాని, ఉన్నదంతయు నూడ్చి జూదమున పెట్టుచుంటివి! ధన మెచ్చటనుండి తేగల్గుదువు? దొంగిలింతువు కాబోలు! అయ్యో! తమ్ముడా, పండువంటి కులగౌరవమును పల్చన చేయుచుంటివా? తుదకు దొంగతనము కూడ అబ్బెనా?

మహే—లేదు లేదు. నేను దొంగలాడ లేదు.

వినో—పోసీ! వంచన చేసితివా? ఊరక నీకిధనము లభించి యుండదు.

మహే—అక్కా' జూదమాడుటకు చేతిలో ధనము లేకపోవుటచే మోసము చేసి చేజిక్కించు కొంటిని.

వినో—ఛీ! ఛీ! అట్టి ద్రవ్యమంటకూడునా? ఇదెవరినో వారికిచ్చి క్షమించుమని వారిని బతిమాలుకొనుము. గతమున నీవొనర్చిన పాపమును పశ్చాత్తాపబాష్పరాశితో కడిగివేయుము. అంతవర కింటికి రాకు; నేను నిన్ను రానీయను.

(పోవును.)

మహే—బుద్ధి వచ్చినది. అక్కయ్య చెప్పినట్లు చేసెదను. ఎవరి సొత్తు వారి కందజేసి వారి కాళ్లంటి మొరవెట్టు కొనెదను. తల్లిదండ్రుల మనములు తల్లడిల్లు చున్నది. నాకిది తగదు. (పోవును)

---

## రెండవ రంగము

(చెఱసాలలో కేదారుడు)

కేదా—ఇది బొత్తిగా చెడ్డది కాదు.... ఇందును కొన్ని విచిత్రములు పొడగట్టుచున్నవి. గానుగ ఆడుచున్నది, నూనె దిగుచున్నది. ఇట్లే తల తిరుగునప్పుడు బుద్ధి పుట్టుచుండును. బుద్ధిలేని బుఱ్ఱ బరువువకు చేటు. ఆ కూళను కొట్టుటచే కొంత

సంతస మాయెను. తలలు పగులగొట్టు వానికి గోడపగులగొట్టు టెంత ?—ఆహా ! ఆ ఖైది కన్నులు మూసుకొని ఎంత హాయి గా గానుగ త్రిప్పుచు పాడుచున్నాడు.

(జేలర్ పాట.)

తిరుగు తిరుగు గానుగ-మరి
తిరుగుమీ త్రప్పు గానుగా
కనులుమూసి నిన్నులాగి
కొనుచు నసయు మేను జనగ
కడువడి వగుడాకుచెత్తి
సుడిగాలిని సుడివడి నటు॥ తిరుగు॥

శీతాతపవర్ష వసంతాదుల ఋతువలయమందు
చేతనధాత్రీతలంబు చెన్నుదరిగి తిరుగునటుల॥ తి॥
చంద్రసూర్యతారకాగ్రహేంద్రగణము భ్రమణ మొంద
వల్పజీవి వీవు లెక్కయా తిరుగక వశమె నీకు॥ తిరు॥
జననమరణచక్రమందు నసయుము తిరుగాడుచుందు
ఎందుకీవు తిరిగెదవో ఎందు జేర నరిగెదవో
ఎవరికెఱుక ఈశ్వరుడే ఎరుగు నీరహస్యమెల్ల॥ తిరు॥

అయ్యా ! నీ వెవ్వడవు ?

ఖైది—నేనా ? ఖైదీని.

జేలా—నీ జాడ జూడ తగుమనుష్యునివలె తట్టుచున్నావు. నీ విక్కడికేల రావలసివచ్చె ? నా వలెనే ఏదో మంచిపని చేసి వచ్చియుండవలయు.

ఖైది— లేదు నాయనా, చెడుపని చేయనందున చెఱలో త్రోసిరి.

కేదా—ఎట్లు ?

ఖైది—అట్లైన వినుము. ఉపేంద్రుడను నొకవకీలు తాను సృజించిన ఉయిలులో నన్ను సంతకము చేయుమని నిర్బంధించెను నిజమైన ఉయిలులో నేను సంతకము చేసితిని, కావున కల్పితమగుదానిపై నెట్లు వ్రాలుచేయుదును? అందుకు నాపై పగబట్టి ఒక అబద్ధపు దావాలో నన్నుదూర్చి చెఱలో త్రోయించెను. అతడు ప్లీడరు- కావున ఎట్టిదుండగమైన నొన ర్పగలడు....నో రెండుచున్నది....నీళ్ళున్నవా ?

కేదా—గొప్ప హేతువే ! నిజమైన విల్లె ట్లున్నది, కల్పిత మెట్లు వ్రాయబడెను ?

ఖైది—ఉపేంద్రుని తండ్రి వ్రాసినదానిలో యావదా స్తిలో మూడు వంతులు చిన్నకొడుకగు దేవేంద్రునకు ఒక వంతు ఉపేంద్రునకును పంచి యుండెను. దేవేంద్రుని కు-తు ళ్లిరువురకు ప్రామిసరీనోటులపై వడ్డీ ప్రతినెల యిచ్చుచుండ వలయునని ఉన్నది. దానికి నేనూ మరిముగ్గురూ—గదాధ రుడు, కిశోరుడు, హరిపదుడును సాక్షులము. కల్పితమున ఈ పంపకము తారుమారు చేయబడెను. అయ్యో ! నో రెండు చున్నది, కొంచెము నీరిమ్ము.

కేదా— తెలిసినది. ఇపు డొక చిత్రము జరుగనున్నది. నా కీచెఱ వీడనిమ్ము....అయ్యో ! ఆ ముగ్గురు సాక్షులు

నెవరు ? యజ్ఞేశ్వరుడు, హరిపదుడు—ఇంకొక రెవరు ?

కైది— యజ్ఞేశ్వరుడు కాడు—గదాధరుడు-హరిపదుడు-కిశోరుడు.

కేదా—ఓహో ! కిశోరుడా ! సరే. వా రిప్పుడెక్కడ నున్నారు ?

కైది—గదాధరుడు-హరిపదుడును కాశీవాసము చేయుచున్నారు. కిశోరుడు ప్రయాగలో నున్నాడు కాబోలు. నే నిక్కడికి రాకపూర్వ మతఁ డక్కడ వకీలుగా నుండెను....నో రెండుచున్నది. కొంచెము నీరిమ్ము.

కేదా—నీరా ? నీదప్పి తీరునట్లు పంచదార పానకము రేపు నాయింట పోసెదను....ఇంత చర్య జరిగినదా ? అయ్యో ! ఇప్పుడు నాకంటె ధన్యుడెవడు ? తా, ధీంతా, తత్తత్త కిటతతా ధీంతా ....

కైది—నీకు మతిపోయినదా ఏమి !

కేదా—సాక్షు లెవరు? గదాధరుడు—శ్యామపదుడు....

కైది—శ్యామపదుడు కాడు హరిపదుడు.

కేదా—ఏ రెవరు ?

కైది—హరిపదుడు పనిచాలించుకొన్న సబ్ జడ్జ్, గదాధరుడు జమీందారు, కిశోరుడు వకీలు. నీరిమ్ము-మాటాడ జాలను.

కేదా—(పేరులు తబ్బిబ్బుగా పల్కును, కైది వాటిని దిద్దలేక విసుగుకొనును) వట్టి నీరే కావలెనా ? లేక పాన

కమా ? ఔను పానక మెల్లు వచ్చును ?

కైది—నీరు చాలును- కొంచె మిమ్ము- రక్షింతువు.

కేదా—లోనికి రమ్ము, కావలసినంత యిచ్చెద.

---

## మూడవ రంగము

(దేవేందు నిల్లు- భార్యా భర్తలు కూర్చుందురు.)

మాన—అది పెళ్లాడకున్న నేనేమి చేతును ?

దేవే—పెండ్లియే వలదనెనా ?

మాన—వలదట !

దేవే—సరే !

మాన—ఏమి సాధనము ?

దేవే—దేనికి ? మంచిదే- సొమ్ము మిగులును.

మాన— ఎట్లు ?

దేవే—సదానందుడు కట్న మడుగకున్నను పెళ్లిఖర్చులకు సొమ్ము కావలెను కదా ? అది మిగులదా ?

మాన—బాగు బాగు !

దేవే—ఇందు తప్పేమి ?

మాన—పిల్లకు పెళ్లి సేయరా ?

దేవే—అదే వలదన్న నేనేమి చేయుదును ?

మాన—మీరొకసారి చెప్పిచూడుడు.

దేవే—నేను చెప్పను.

మాన—కన్నె చెఱ విడిపించ వద్దా ?

దేవే—వివాహము కాకున్న అది వీపు కట్టా ?

మాన—కులములోనుండి వెలివేయరా ?

దేవే—అందుకు మొదటనుండియు సిద్ధమే !

(తెఱలో దేవేంద్రా ! అని కేక)

ఆc. రమ్ము. నీవు లోనికి పొమ్ము. (ఆమె పోవును) తంటా తీరినది. (సదానందుడు వచ్చును)

సదా—మిత్రమా, నీ దేహస్థితి బాగులేదని వింటిని.

దేవే—వెతేమియు లేదు. మనోవ్యాధిచే అప్పుడప్పుడు దేహస్వస్థత తగ్గుచుండును.

సదా.—మనోవ్యాధి నేల తెచ్చిపెట్టుకుందువు ?

దేవే—వలదన్నను నన్ను వదలకున్నది. సంతానముపై కూర్మి ఎక్కుడయి మమత పెఱుగుటచేత నేమో ?

సదా—సుశీల గూర్చి బెంగగొంటివా ?

దేవే—లేదు లేదు. అది మంచిపని చేసినది, పెళ్లి కొప్పుకొనుటయే లేదు.... ఈకుటుంబము మట్టిలో కలిసిన మేలగును. సకలపాపసంకులము- ఆపదలకు పదము. సర్వనాశహేతుభూతము. పిల్లలను తాచుపాములకు పాలుపోసి పెంచుచున్నాము.... అబ్బబ్బ ! ఎంత అవివేకము

సదా—నీ అభిప్రాయ మిదేనా?

దేవే—వేఱేముండును ?

సదా—మిత్రమా, నీవు వ్యత్యస్తముగా తలచుచుంటివి.

దేవే—స్వానుభవ మది. నీరు చొరక లోతు నిజముగా తెలియదు.

సదా—నీయెడ నాకు భక్తిశ్రద్ధలు మెండు. ఇట్టి సామాన్యవిషయమున నీమది సంచలించుచున్న దేల ?

దేవే—లేదు లేదు. ఆ విషయమున చర్చింప పని లేదు. అది అనావశ్యకము.

సదా—ఏది ?

దేవే—పిల్ల పెళ్లి.

సదా—కాదు. అది అత్యంతావశ్యకము.

దేవే—ఏల ?

సదా—జన్మాంతరవాదము, ఆధ్యాత్మికచర్చయు అటుంచుము. సంతానము వాయుభక్షణమున జీవించు ననుకొంటివా ? యావజ్జీవమును వారి అన్నవస్త్రములకు అనువు కల్పించుట తలిదండ్రులకు విధి కాదా ?

దేవే—వారి తప్పేమి ?

సదా—సంతానము కల్గుటకు తలిదండ్రులు కారణభూతులు కారా ? వారి సంరక్షణ వీరికి విధికాదా ? పిల్లలు పెద్దవారైరె దుఃఖాక్రాంతులైన ఆ తప్పు తలిదండ్రులదికాదా? సంతానము కడుపుమాడి కటకటబడిన కన్నవారు నింద్యులు కారా ?

దేవే—తరువాత, తరువాత.

సదా—కుమారునికి విద్యాబుద్ధులు కరపి వాని అన్న వస్త్రముల కాధారము కల్పించుచున్నారు. అట్లే కుమారికి కూడ కల్పింప వలదా? పిల్లకు పెళ్లిచేయుట వలన దానికి జీవనాధారముకల్గును. కావున నీకూతురికి నీవు పెండ్లిచేయుట తప్పదు.... కాని

దేవే—ఊరకుంటి వేమి?

సదా—స్త్రీలయెడ భగవంతుడే నిష్ఠురుడు, దానికి మనమేమి చేయగలము? వారి యోగక్షేమములకై సాధ్యమైనంత యత్నము చేయుట పురుషులకు విధి- స్త్రీలకు కానున్న క్లేశముల తొలగింప జూచుట పురుషుల కావశ్యకము.

దేవే—నాకు బోధ పడలేదు.

సదా—స్త్రీలు దుర్బలులు, అబలలైనను వారు మానవులే కదా? వారి హృదయములకు అవమానము ఉపేక్షయు పురుషుల హృదయముతోపాటు నొవ్వ జేయును. స్త్రీలు పురుషులకంటె బుద్ధితక్కువ వారైనను, వారికిని ఇష్టానిష్టము లుండును. వారిమతము కేవలము గర్హ్యమనరాదు. పసితనమున వారికి వివేకముండదు, కావున తలిదండ్రులు తమకు నచ్చిన వారికి వారిని కట్టిపెట్టవచ్చును. బాలికకు పదిహేను పదహారు వత్సరములవరకు పెళ్లిచేయకున్న, అప్పటికి వారు ప్రాజ్ఞలై వరుల నెంచుకొనుటయందు మతామతములు కల్గియుందురు. వాటిని సరకుచేయకుండుట భావ్యము కాదు, సుశీల అభిరుచికి

ప్రతికూలముగ మా వినయమున కామెను నీవు కట్టతలచినచో నేను సమ్మతింపను.

దేవే—హిందూకులమున పుట్టిన ఆడది హిందువుల కులాచారముల మన్నించుట యుక్తముకాదా ?

సదా—సావిత్రి హిందువులలో పుట్టలేదా ? ఎదిగిన పిల్లకు ఇష్టానిష్టము లుండితీరును. మన శాస్త్రకారులు మూర్ఖులనుకొంటివా ?

(మహేంద్రుడు వచ్చును)

మహే—నాన్నా! కుముదిని ఏమేమో పలవరింత లాడుచున్నదని అమ్మ చెప్పుమన్నది.

దేవే—ఈమాట నాతో కూడ చెప్పినది. పలవరింత లాడక పాటలు పాడునా ఏమి ?

మహే—అమ్మ మిమ్ము పిల్చుచున్నది.

దేవే—ఇప్పుడు వచ్చుటకు వీలు లేదు. పొమ్ము.

సదా—అట్లుకాదు. ఒకసారి వెళ్లిరమ్ము.

దేవే—నేనేమి వీరి నౌఖరినా?

సదా—వైద్యుని పిలువనంపనా !

దేవే—వలదు. నీతో నెన్నిసారులు చెప్పుదును ?.... ఇక నీవింటి కరుగుము.

సదా—సరే....నీవు పోయి ఆడవారి దిగులు తీర్పుము

(పోవును)

(వినోదిని వచ్చును)

దేవే—నాకొఱకే కాబోలు- నాకు ప్రాణాంతముగా నున్నది....ప్రాణ మున్నదా? (పోవును)

వినో—తండ్రిగారి మతి తల్లడిల్లినది. లేకున్న ఇంత కోపము, చిటచిటలాడుట పూర్వముండెనా ?

---

## నాల్గవ రంగము

[దేవేంద్రు నిల్లు-గాలివాన, వడగండ్లు, ఉఱుములు
కుముదిని మంచముపై పడుకొన్నను, ప్రక్కను
తల్లి కునుకుచుండును. దేవేంద్రుడు నిలుచును]

దేవే—రాత్రి యెంత భయావహమై యున్నది! ముసలధారలు కట్టి వర్షము కురియుచున్నది. వడగండ్లు పడుచుండుటచే తలుపులు చిల్లులుపడుచున్నవి, మేఘములు-వలలో బడిన వ్యాఘ్రముల భాతి కోపోద్రేకమున గంభీరముగా గర్జించుచున్నవి. సృష్టియంతయు లోపించినటుల చిమ్మచీకటి కమ్ముచున్నది. పాడువడిన యీకొంపయు నేను మాత్రమే నిల్చియున్నాము. దౌర్భాగ్యుడను నాచుట్టు వేరెవ్వరును. లేరు కాబోలు. ఈతుపా నడగి, ఈయంధకార మంతరించిన వెన్క సూర్యకిరణప్రసారమున పూవులు పూచి, పక్షులు కలస్వనములతో నాకసమున నెగురుచుండ, వసంతవాయువీచికలు శ్యామలలతలపై మెల్లమెల్లగ వీచుచుండ, కమ్మనితెమ్మె

రలు లతాగృహముల సుగంధముల నెలకొల్పుచుండు నప్పుడు నాచుట్టు నుండువా రెవరు ? ప్రపంచమా ? నావైపు వంగి వాలదే ! అన్నగారు— మేమిద్దరము ఏకగర్భ జనితులమని వాడుక. ఇక నీ ప్రపంచమున నా కిద్దరు సుతులు. ఒకడు సన్యసించె. రెండవవాడు తగిన శిక్ష లేకుం డుటచే ఉచ్ఛృంఖలు డయ్యె. ఇద్దరు కూతుళ్ళలో ఒక తె అనాథ. రెండవదానికి పెండ్లి కాలేదు. నా భార్య అహో రాత్రములు దాసివలె పాటుపడుచుండుటచే నిద్రాదేవి ఆమెపై అనుకంపజూపి అక్కున చేర్చెను. రుగ్ణయగు ఈకన్యకు మరణ మాసన్న మగుచున్నది. దీనినంతయు నేను కన్నులార గాం చుచుంటిని.

కుము — అమ్మా ! అమ్మా !

మాన —- ఏ మమ్మా ?

కుము — దాహము.

దేవే — ఇదుగో నమ్మా.

కుము — నాన్నగారూ !

దేవే — ఇదిగో మంచినీరు.

కుము — వలను. బాధ భరించ జాలను. అమ్మా !

మాన — ఏమమ్మా, ఇక్కడనే ఉన్నాను.

కుము — అక్కేది ?

దేవే — నిద్రపోవుచున్నది. లేపనా ?

కుము—వలదు. లేచిన పిమ్మట వాళ్లతో చెప్పుడు. అబ్బా !

దేవే—బాధ హెచ్చుగా నున్నదా అమ్మా ?

కుము—లేదు. అంతయు అణుగు చున్నది.

మాన—అదేమమ్మా, అలా గంటున్నావు. హా ! దైవమా- ఎట్టిగతి తెచ్చిపెట్టితివి.

కుము—అమ్మా (లేచి మెడపట్టుకొనును.) అబ్బా !

మాన—ఇదేమి. పిల్ల యిట్లున్నది.

కుమా—అబ్బా !

మాన—వైద్యుని పిలువుడు. (కుముదిని పడును)

కుము—అబ్బా ! బాధ తిరుగ వచ్చుచున్నది.

మాన—వైద్యుని పిలువరేమి ?

దేవే—వైద్యుడా ? బైట యెట్లున్నదో నీ కగపడుట లేదా ? అర్ధరాత్రమున తుపాను పట్టియున్నది. ఇప్పుడు వైద్యుడా ? నూరు రూపాయీ లిచ్చినను ఎవ్వరును రారు. అంత సొమ్మిచ్చుటకు శక్తియు లేదు.

కుము—ఇకను వైద్యుడేల ? నాన్నా— కిటికీ తీయుడు (అత డట్లుచేయ ఓరుగాలికి దీపమారును కుముదిని ప్రాణము పోవును.)

దేవే—అమ్మా, కుముదినీ !

మాన—కుముదినీ ! కుముదినీ ! (పైనిపడును)

దేవే—గట్టిగా పట్టుకొనుము. ఈ చీకటిలో మన కన్నులుమూసి ఎటకైన పారిపోవును సుమా! జాగ్రత్త!

మానస—అయ్యో! పోయినది. నాతల్లి ఎగిరిపోయినది.

దేవే—విడిచితివా! పట్టిఉంచలేక పోతివా? పలుగాకీ! అట్లైన నడువుము. మనముకూడ పోవుదము. చీకటిలో ఒక్కర్తె ఎక్కడికి పోయెనో చూతము. కుముదినీ! కుముదినీ!

(పోవును)

# భారత రమణి

## మూడవ అంకము

### మొదటి రంగము

(దేవేంద్రు) నింటిలో నొక్కడే పచారు చేయును.)

దేవే—ఒక ఆపద గడవకముందే వేరొకటి దాపురించినది. ఒక కెరటము మీద మరి యొకటి. కాలుజారి కొట్టుకొనిపోవుచున్నప్పు డెవ రాపగలరు? ఒకదానిమీద నొకటి- విరామమే లేదు' నిర్భర మగుచున్నది.... అదిగో నా భార్య వచ్చుచున్నది. రానీ- మనసు రాయి చేసికొంటి. ఇక నేమి చేయగలను?

(మానద వచ్చును)

మాన—కన్నుల యెదుట కన్నకుమారుని పోలీసువారు కొనిపోయిరి.

దేవే—ఔను- కొని పోయిరి.

మాన—మీ రేమియు చేయలేదే?

దేవే—లేదు.

మాన—చూచుచు నిలువబడితిరా?

దేవే—ఔను వింతను చూచుచుంటిని.

మాన— అడ్డుపెట్ట లేదేమి ?

దేవే—లేదు.

మాన—ఎందుచేత ?

దేవే—పోలీసువారు పిల్లవానిని విడుతురనే భయముచేత.

మాన—ఆ భయము చేతనా ?

దేవే—పోలీసువారు నాకు మేనత్త కొడుకులు.

మాన—మీకు మతి చలించినట్లున్నది.

దేవే—నిజము కావచ్చును.

మాన—వాని చెఱ తప్పించుడు.

దేవే—ఎవనిది ? (నవ్వును)

మాన—అబ్బాయిది ; నవ్వుటా కేమి ?

దేవే—బాగు బాగు. నీ కే చింతయు లేదు, లోకమర్యాద తెలియదు. దైవము నన్నాడ దానినిచేయక మగవాని నెందుకు చేసెనో ? ఇప్పుడు నూరు పాసవ వేదన లనుభవించుచున్నాను.

మాన—కుర్రవాని కేమగును ?

దేవే—జైలునకు వెళ్ళును. పట్టుబడకున్న దొంగతనము గొప్ప విద్య. పట్టుబడినచో చెఱసాల తప్పదు. ఆహా! గవర్నమెంటువా రెట్టి నియమము చేసిరి ? బలే !

మాన—బాలుడు జెయిలులోపడిన నేను బ్రతుకను.

దేవే—సరే, ఉరిపోసుకొమ్ము— చావుము. ఒకకొడుకు సన్యసించెను ; ఇంకొకడు చెలఁగోపడెను ; ఒకకూతురు తగిన మొగుడు లేక తనువు బాసెను ; ఇంకొకతె తగిన వరుడు లేక తలచెడెను. ఇంకొకతె ఉన్నది. దానికేమి ! మిగిలినదానవు నీవు ఉరిపోసికొనుము. నేను మిగిలియుందును... ఆహా ! నయూమయూ ! ఏమి నీరచనాకౌశలము ! 'మ్రింగుటకు మెతుకులు లేవు, మీసములకు సంపెగి నూనె' అన్నట్లు పెళ్లిచేసుకొంటిని- ఫల మనుభవించు చుంటిని. కర్మఫలము కట్టికుడుపదా ? ఎవరిని నిందింపను ?

మాన—బాలునకు చెఱ తప్పదా ?

దేవే.—తప్పునని తోచదు.

మాన—తగిన ప్లీడరును పెట్టిన తప్పించగలడా ?

దేవే—తప్ప వచ్చును.

మాన—అయితే ఏల పెట్టరాదు ?

దేవే—(నవ్వి) నీ కసాధ్యమన్నది లేదు. నీ కేదియు తోచదు. తగిన ప్లీడరునకు తగిన ఫీజు. ధనమెట్లు దాపరించు? నీ విత్తువా ?

మాన—అప్పు తెందుము.

దేవే—హాయి హాయి ! కర్తవ్యము నీయుక్కునకు సూటిగా కనబడుచున్నది. అన్నియు సులభముగనే తోచుచున్నవి. (నవ్వును)

మాన—ఇంకే మున్నది! పిల్లవాడు జెయిలులో పడ్డాడు. మీా రెక్కడ నవ్వ ప్రారంభించినారు.

దేవే—లేదు లేదు. నాది తప్పే. ఇక నవ్వను. తండ్రి గారి అప్పు తీర్ప తాతలనాటి యిల్లు సగ మమ్మితిని- నీవు చూచుచుంటివి. అప్పా? అప్పు- ఇదివర కెన్నడును చేయ లేదు-. ఇక చేయను. పిల్లవాడు జెయిలులో పడనీ....

మాన—ఇంకేమి సాధనము? (ఏడ్చును)

దేవే—పొమ్ము, నా ప్రాణములు తీయకు.

(ఆమె పోవును)

పెళ్లాడినందుకు ఫల మనుభవించు చున్నాను.. ఎవరినందును? పెళ్లి కొప్పుకొంటిని- భార్యాధరసుధారసము గ్రోలుచుండిన కుక్షి నిండు ననుకొంటిని. ఆమె మోమునెల కాయు వెన్నె లలో విహరించిన చాలు ననుకొంటిని. ఇంకే మేమో భావిం చు చుంటిని. అదంతయు స్వప్నగతవృత్తాంత మాయె. ఇట్ల గునని ఎన్నడు ననుకొన లేదు. కర్మ మెట్టిదో ఫల మట్టిది. విత్తొకటి వేసిన చెట్టు వేఱొకటి మొలుచునా? ఓహో! పరమేశ్వరా! ఏమి నీ సృష్టిచాతురి!

(వినోదిని వచ్చును)

వినో—నాన్నగారూ!

దేవే—ఏమి కావలె? ఓహో, తెలిసినది, కాని నీవు కోరినది కాజాలదు.

వినో—మహేంద్రుని....

దేవే—ఊరకుండుము- మాటాడితివా, నే నాత్మ హత్య కావించుకొనెదను.

(సుశీల వచ్చును)

ఏమి కావలయు ?

సుశీ —నా కేమియు వలదు....మహేంద్రు....

దేవే—ఇక చాలించి పొమ్ము.

సుశీ—నన్నేమి చేసినను వలదనను, మహేంద్రుని రక్షించిన చాలును. మీ పదము లంటెదను.

దేవే—న న్నంటవలదు. దూరమున నుండు—

సుశీ—జనకా ! ఇటు తగునా ? (కాళ్లపై బడును)

దేవే—ఇక నుండ జాలను....ఎంతని మిగ్రింగను ! ఈ బాధచే గుండె వ్రీలుచున్నది.... ఇదెట్లు చూడగలను ? వినోదినీ....సుశీలా.... అబ్బా ! మీరే మెఱుగ గలరు ? అయ్యో ! అయ్యో ? నిర్భరము....నిర్భరము...

(త్వరగా పోవును)

(నగలపెట్టెతో మానద వచ్చును)

మాన—వినోదినీ ! ఈ నగలు పట్టుకొని సదానం దుని వద్దకు వెళ్లి వీటినమ్మి సొమ్ము యిమ్మను.

వినో—ఇదే మనుష్మా !

మాన—కొడుకు చెఱలో బడిన పిమ్మట కొఱగాని యీ నగలు నాకేల ? తీసుకొని పొమ్ము.

వినో—ఇవి నీ పుట్టింటివారు పెట్టినవనియు ప్రాణము లుండ వీటిని బాయగూడదనియు చెప్పియుంటివే ?

మాన—ఔను, కాని కుఱ్ఱవాని కెట్టి యవస్థ తటస్థించునని అప్పు డెరుగను. ప్రాణములకన్న ప్రియతరమై, అంధకారావృతమగు ఇంటికి దీపమై, కుల ముద్ధరింపదగు కొడుకు చీకటికోణములో నుండ నే నీ యాభరణములతో నింట నుండగలనా ? కాని పొమ్ము.

వినో—నాన్నగారి నడిగితివా ?

మాన—లేదు. వారి నడుగ నక్కర లేదు. ఆయనకు మతి చెడినది. మా అమ్మ నా కిచ్చిన నగలు—నా హృదయము, నా శరీరార్ధభాగహారియగు నాపుత్రునకై అర్పించుచున్నాను. నీవు సంకోచింప వలదు. ఇతరులకు నే నిచ్చుటలేదే ! ఆపదుద్ధారకా ! ఆర్తరక్షకా ! నా మొఱాలించి మమ్మీవిపదబ్ధినుండి ఉద్ధరింపుము.

(పోవుదురు)

---

## రెండవ రంగము

[ దేవేంద్రు నిల్లు—దేవేంద్రుడు నిద్రలో ]

దేవే—డబ్బు ! డబ్బు ! డబ్బు ! ప్రపంచమున నింకెద్దియు లేదు. డబ్బే ! పిల్లలకు డబ్బు, పెద్దలకు డబ్బు ; కొడుకులకు డబ్బు, కూతుళ్ళకు డబ్బు, పెండ్లానికి డబ్బు, మగనికి

డబ్బు; దొంగకు డబ్బు, దొరకు డబ్బు; భాగ్యవంతునకు, బీదవానికి; గొప్పవానికి, కొద్దివానికి; భక్తునకు తుదకు భగవంతునికి కూడ డబ్బే (ధనము దాపరించుటకే ధాత్రి) మహాదేవిని దహించి, త్రవ్వి, ఆమె గర్భమును చీల్చుచున్నారు. సముద్రమునందలి అగాధజలమున మునిగి రత్నములను సేకరించుచున్నారు. చేతగాను గాని ఆకాశమందలి సూర్యాది గ్రహతారామండలముల చీల్చి కరుగబోసి టంకసాలయందు నాణెములుగా దింపియుందురు. బాపురే! ప్రపంచమా, నీబిడ్డల నందర ధనచింతాంబుధిని ముంచి తేల్చుచున్నావు. నీక్రోడమునుండి రత్నగర్భమా, వారు వెడలునప్పుడు ఒక కాసైన వారి నంటి బోవునా?...హా! శంకరా, నా ఐదువేల రూపాయలపై ఇంటిలో నందరును కన్నువేసి యున్నారు. పిల్లవానిచేతిలో బెల్లముముక్కను కాకి తన్నుకొని పోవునట్లు వీరు నాచేతినుండి దీనిని గ్రహింప దలచుచున్నారు. దీనిపని చక్కచేయవలయును. (ఇనుపపెట్టెతీసి) ఇక్కడదీని నుంతునా? రేపు కచేరిలో కట్టివేయుదును.....తండ్రిచేసిన అప్పు తాతలనాటి యిల్లమ్మితీర్చెదను. నాకొఱ కమ్మలేదే! ఆస్తి తండ్రిగారిచ్చినదే, అప్పు తండ్రిగా రిచ్చినదే...ఇక్కడ నుంతునా?....వలదు. గొయ్యితీసిపాతుదునా? అది మేలు. (గునపము తెచ్చి త్రవ్వి) అబ్బో చప్పుడగుచున్నది. ఎవరైన వత్తురు. ఇదివలదు, అలమరలో నుంచెద. ఇదెవ్వరును చూడజాలరు. ఇనుపపెట్టెయుండ ఇంతసొమ్ము అలమరలో నుండుననుకొందురా? సరే

ఇచ్చుటనే దాచెదను. (తాళము తీసి అరలాగి లోనచూచి) ఓహో! దీనిలో దొంగఅర కూడ యున్నది; బలే! ఇది చాలమేలు. ఇందులో నుంచెద. (తడిమి చూచి) ఇందేవో కాగితము లున్నటులున్నవి. ఇవి చూచినవారి కిందు సొమ్ముండు నను అపోహము పుట్టదు. వాహ్వా! ఇది మేలైన చోటు. ఎవరును చూడలేదు కదా. లేదు. అర్ధరాత్రమున నిట నెవ్వరుందురు? ఈసారి పీటిని తీయుట సాధ్యము కాదు. (అందులో పెట్టి తాళము వేసి) హాయి హాయి. (పోయి నిద్రించును).

(వినోదిని వచ్చును.)

వినో—మా తండ్రిగారేవో మాటలాడు చున్నటులున్నది. (అంతట చూచి) ఇందెవ్వరును లేరే!...ఓహో! నిద్రలో లేచి తిరుగుచుండుటయు మాటలాడుటయు వీరికి అలవాటు. అదిగో నిద్రించి నట్లున్నది. (పోవును.)

---

## మూడవరంగము

(ఉపేంద్రు) నిల్లు. ఉపేంద్రుడు భక్తులు.)

ఉపే—వత్సలారా, ఆహారము గొనుట కూడ ఆధ్యాత్మిక వ్యాపార మని నేను సిద్ధాంతము చేసినాను. ఇదిగో నవనీతము ఇది శ్రీకృష్ణుడే! దేవకీనందనుడే!

భక్తు—ఓహోహో!

ఉపే—పీతాంబరధర- శిఖిపింఛభూషణ వంశీధర-గోపాలా !

భక్తు—(పాడుదురు.)

ఉపే—మక్షన్ చోర-మధుసూదన- శ్యామల- నవనీరదసమదేహ ॥విశాలా॥

భక్తు—(పాడుదురు)

ఉపే—శ్రీకృష్ణుడు వెన్నవలె కోమలుడు, కావుననే వెన్నదొంగ అనిపించుకొనెను.

భక్తు—ఓహో హో హో !

ఉపే—భక్తులారా ! చూడుడు. (లడ్డుచూపి) ఈపదార్థము అండాకారము గలది. చక్కెరతో చేసినది కావున రసవంతము, మధురము. కారణము యొక్క గుణములు కార్యమందుండును. కావుననే దీనిని "రసగోళ" మందురు. ఆర్యఋషిగణము దీనిని జూచియే, భూమి గోళాకారముగా నుండు నని సిద్ధాంతము చేసిరి. ఇది నోటిలో వేసుకొనిన-చో కరిగి కడుపులో కలియునట్లు జీవాత్మ భక్తియోగముచేత పరమాత్మలో లీనమగును. చూడుడు. (నోటిలో వేసుకొనును.)

భక్తు—సత్యం సత్యం ఓహోహో !

ఉపే—(సీసాను చూపి) చూచితిరా ? ఇది పానీయద్రవ్యము — దీనిని దేశభాషలో "షర్బతు" అందురు. ఇదే భగవంతుని ఆదిసృష్టి— ఇందే సర్వభూతములు ఉత్పన్నములయినవి. "సర్వభూతేషు శ్రీకృష్ణః" ఇందెట్టి అపూర్వరహస్య

మున్నదో కనుకనే "సర్వభూత" శబ్దము "షర్బతు" గా మారినది. ఇందు చేతనే సర్వభూతములును పరమేశ్వరునియందు ఇట్లే లీనమగును.

భక్తు—ఏమి ఆధ్యాత్మిక తత్వం.

ఉపే—ఇంకొకటి మిగిలి యున్నది. (గుడిగుడి చూపి) ఇది పొగను సృజించును. ఇట్లే అనేక యంత్రములు చేయగలవు. ధూమయంత్రములను చేయుట దీనినుండియే మానవుడు గ్రహించెను. ఇందు విష్ణుతేజ మున్నది. ఇందు జ్ఞానపత్రి యుంచి పీల్చినచో సర్వలోకములును సాక్షాత్కరించును. (పీల్చును)

(యజ్ఞేశ్వరుడు వచ్చును)

ఓహో! యజ్ఞేశ్వరా! రమ్ము........వత్సలారా! నేను కొంతసేపు ఆత్మసాక్షాత్కార మాచరింపవలయు. మీరిండ్లకు పొండు. ఆహా! గోపీజనమనోరంజనా, జీవులకు పరమావధి నీవే కదా? సర్వోద్ధారకుడవు సర్వనియంతవు శ్రీహరీ నీ చరణములే నమ్మియుంటిని.

భక్తులు—(పాడుదురు)

పాట

నీదు చరణములే—గతియని—ఎదను నమ్మిన వారమయ్యా॥ శ్రీకృష్ణా॥

వేదవేదాంతవిదితుడవని— వెలయు శ్రీసర్వేశ కృష్ణా॥

సీ॥　　(పోవుదురు)

యజ్ఞే—పీడ వదలినది... ఉపేంద్రా!, నీతో నొక మాట చెప్పవచ్చితిని.

ఉపే — నేను కూడ నీకొకమాట చెప్పవలెను.

యజ్ఞే—నీవు విశ్వాసఘాత ఒనర్చితివి. నన్ను నమ్మించి మోసపుచ్చితివి.

ఉపే—నేనా? నిన్నా?

యజ్ఞే—అవును నీవే, నన్నే—మాతండ్రి అప్పు తమ్మని తలపై రుద్దితివి. ఇల్లమ్మి ఋణము ఆతడు దీర్చునని నమ్మించితివి. ఇల్లమ్ముడైనది—అప్పు రకాసైన నా కందలేదు.

ఉపే—ఇందు నాదోషమేమి?

యజ్ఞే—దోషము నీది కాదా? ఉండుండు. నీచెవులు నులిమి సొమ్మంతయు రాబట్టెదను.

ఉపే —కానిమ్ము నేను వకీలును, లా ఎరుగుదును.

యజ్ఞే—అబ్బో! అటులనా? నేను షరాబును; బీదలను పీల్చి పిప్పిచేయుట మనకిద్దరకు సహజధర్మము. నీవు మునిముచ్చువైతివి. నేనట్లు కాలేదు. ఇదే భేదము. చూడు సొమ్మంతయు నీనుండి వసూలుచేసెదను.

ఉపే—నే నీయవలసిన పైకము నంతయు నీకిచ్చినట్లు రసీదు నాకిచ్చితివి. ఎక్కువెట్లు రాబట్టెదవో చూచెదను.

యజ్ఞే—అటులనా? నీతండ్రి వ్రాసిన "విల్లు"లో నేను సాక్షిసంతకము చేసితిని, జ్ఞప్తి యున్నదా ?

ఉపే—ఆ"విల్లు" ఇప్పు డెక్కడ నున్నది?

యజ్ఞే—లేకేమి? చేన అలమరలో నున్నది పోలేదు.

ఉపే—సరిసరి,

యజ్ఞే—సరి లేదు, బేసి లేదు, అదేయున్నచో దేవేంద్రుని కగపడదా అని సంశయించుచుంటివి కాబోలు! చెప్పెద విను అందులో దొంగ అరయున్నది. ఆసంగతి నాకు తప్ప వేరెవ్వరికిని తెలియదు. అలమర యిప్పుడు దేవేంద్రుని యొద్దనే ఉన్నది, నే నిప్పుడే పోయి వానితో చెప్పెదను, సొమ్ము రాబట్టు నుపాయము నా చేతిలో నున్నది. ఆ "విల్లు" ప్రకారము యవదాస్తిలో మూడుపాళ్లు దేవేంద్రునకు ఒక పాలు, నీకునువచ్చును, సొమ్మిచ్చెదవా ? లేదా ? చెప్పు.

ఉపే—రెండవ "విల్లు"నందు నీవు సంతకము చేయ లేదా?

యజ్ఞే—నేను చేయలేదనియు నీవే నాసంతకము చేసితి వనియెద

ఉపే—నీమాట నమ్మువారెవరు ?

యజ్ఞే—తండ్రివ్రాలు చేయగలవాడు సాక్షివ్రాలు చేయలే డనుకొందురా? చెప్పు, సొమ్మిచ్చెదవా? లేదా?

ఉపే—నాకు మిత్రుడవయ్యు ఇంత ఘోరమునకు ఒడిగట్టెదవా?

యజ్ఞే—ఒక సంసారిని పాడుచేయుటకు కుట్ర పన్ను టయుందే కదా మనకు మైత్రి అలవడెను అది ఘోరము కాదా? ఇం కొకటి, ఇద్దరు సాధుజనులు మిత్రులగుదురు. కాని ఇద్దరు వంచకు లట్లు కానేరరు వారినొక గదిలో పది వత్సరము లుంచినను వారికి మైత్రి అలవడ నేరదు బయటికి వెడలివత్తో డనే వా రన్యోన్యవంచనమునకు గడంగుదురు.

ఉపే—యజ్ఞేశ్వరా (కన్నుల నీరు నించును)

యజ్ఞే—ఆడదాని బుడిబుడి దుఃఖములటుంచి సొమ్మి చ్చెదవో, ఇయ్యవో చెప్పు

ఉపే—ఒక్కమాట వినవా ?

యజ్ఞే—వినను నీవు వకీలువో? సొమ్మిచ్చెదవా లేదా?

ఉపే—ఒక మాట

యజ్ఞే—నేను చెప్పినంతయు చేసె తీరుదును తుది మాట తెల్పుము

ఉపే—ఇచ్చెద

యజ్ఞే—ఇప్పుడిమ్ము

ఉపే—ఇప్పుడే ?

యజ్ఞే—ఆహా, ఇప్పుడే. నిన్నెవరు నమ్ముదురు ?

ఉపే—ఇప్పుడు నావద్ద సొమ్ములేదు.

యజ్ఞే—మంచిది...(వెళ్ళబోవును.)

ఉపే—ఉండుండు. ఇచ్చెద.

యజ్ఞే—తే.

ఉపే—ఇదిగో! ఇట్లు నిర్బంధించుట న్యాయమా? వసలో మన మెట్టయిన తగవు తీర్చుకొందము.

యజ్ఞే—ఆలాగు దాచికిరమ్ము. తగవుదిద్దుకొందమా?

ఉపే—ఆలాగే కానిమ్ము.

యజ్ఞే—ఎట్లు?

ఉపే—నీవు చెప్పినట్లు చేసెదను.

యజ్ఞే—నేను చెప్పినపని చేసినచో అప్పె కాక వడ్డీ కూడ వదలెదను.

ఉపే—ఏమి చేయుమందువు?

యజ్ఞే—నానోటనే పల్కింతువా? నేను చెప్పజాలను ఆమాట వెలువడిన తోడనే ధరణీచక్రము తల్లడిల్లదా? అమావాస్యనాటి చీకటి ఆకాశమంతట నాచ్ఛాదింపదా?.... ధర్మమేమైన ఈధాత్రియందున్న, అది వాడి, వత్తియై, చచ్చి, కుళ్ళి, దుర్గంధము కుప్పవడదా?

ఉపే—అబ్బా! అంతఘోరకృత్యమును తలపెట్టితివా ఏదో చెప్పుము.

యజ్ఞే—ఇంకను తెలియలేదా? నీవు పాపివి, నేను పాపిని; ఐనను ఆమాట చెప్పుట నాకు నోరాడకున్నది. నా వివాహము........ఇప్పుడైన గ్రహించితివా?

ఉపే—చెప్పిన చెప్పరాదా?

యజ్ఞే—విను. (చెవిలో చెప్పున్నాడు)...బ్రాహ్మణుడవ వేళ!

ఉపే—నా తమ్ముని కూతురినా ?...................
(యజ్ఞేశ్వరుని పెడబట్టి) ఓరి బాలిశా. ఓరీ చండాల ! కూళా !

యజ్ఞే—నన్ను వదలుము... తెలివి తెచ్చుకొనుము విడుతువా ? లేదా ?

ఉపే—విడిచెద. మఱచితిని.

యజ్ఞే—ఇప్పు డిష్టపడుదువా ?

ఉపే—ఇష్టమే. ఇష్టమే...ఎవఱది ?

యజ్ఞే—ఎవరును లేరు. వణకుచుంటివేమి?

ఉపే—పోదము, రా....		(పోవుదురు)

---

## నాల్గవ రంగము

(దేవేంద్రు నిల్లు—మానదా వినోదినులు)

మాన—ఏ మయినది ?

వినో—"వస్తువుల నమ్మనక్కఱ లేదు, తాకట్టుపెట్టి తగినంత దస్తు తేవచ్చున"ని ఆత డనెను

మాన—దానితో చెఱపీడునా ? ఆత డేమనెను ?

వినో—శక్తివంచన లేక సాధించెద ననెను

మాన—భగవంతు డాతనికి మేలు చేయుగాక ! చూడు ఈసంగతి మీతండ్రిగారికి తెలిసెనా, మన యత్న మంతయు మట్టిలో కలుపును తెలియనీయకుము

వినో—అభయము నీకు వలదు తెలియనీయను

(పోవును)

మాన—అనాథరక్షకా! ఆపదుద్ధారకా! రక్షింపుము

(దేవేంద్రుడు వచ్చును)

దేవే— వంట యింక కాలేదా ?

మాన—అయ్యో ! మఱచితిని

దేవే—మీరు నన్ను ఇంట నుండనీయరా ?

మాన—క్షణములో వంట చేసెదను బాలని సమాచార మేమైన తెలిసినదా ?

దేవే—నా ప్రాణము తీయక పొమ్ము... (ఆమె పోవును) చిన్నవాడు చెఱలో పడినాడు పోనీ తండ్రిగారి అప్పుతీర్చి కౌపీనము కట్టి వాడవాడల తిరిగెదను భార్యయు, ఇద్దరు కూతుళ్ళును మిగిలెదరు వారికిని ఇదే గతి కొడుకు కూటికై బెంగగొన నక్కరలేదు అదియు మేలే.

(సుశీల వచ్చును)

నీవేల వచ్చితివి ? పొమ్ము.

సుశీ—సదానందుడుగారు మీతో మాటలాడ వలెనని వచ్చియున్నారు.

దేవే—ఇతడు నన్ను బ్రతుకనీయడు, ఇప్పుడు వీలులేదని చెప్పుము. నా ఒంట్లో బాగుగలేదని చెప్పుము...ఊ పోనీ, రమ్మనుము....(ఆమెపోవును) దేవేంద్రునికొడుకు చెఱలో పడెనని దేశమంతటను వ్యాపించినది. నాగుండె నీరగు

చున్నది. (సదానందుని ప్రవేశము) సదానందా! ఏమి నాతలలు ? నేను నా శరీరమునకు స్వస్థత తగ్గినది.

సదా—వైద్యుని పిలిపించనా ?

దేవే—వైద్యశాస్త్రమున ఈవ్యాధికి మందు లేదు.

సదా—చింతేమో ! చింతింపకుము, అపీలు చేయుదము, బాలుని చెఱనుండి తప్పించవచ్చును

దేవే— వలదు, అపీలు చేయవలదు. వాడు చెఱలో నుండుటయే శ్రేయము. కూర్చుండబెట్టి కూడు పెట్టలేను. కొంతభారమైన తగ్గిన మేలే. నా భార్యను కూతుళ్ళను కూడ అచ్చట చేర్చు ఉపాయము నాలోచింతువేని నన్ను రక్షించినవాడవగుదువు.

సదా—అదేమి అట్లనుచుంటివి ?

దేవే—ఇంతవఱకు జరిపిన చర్యకే వకీలునకు చాల ధన మొసంగితిని, నీకును నావలె మతిపోయి నట్లున్నది. అన్నట్లు ఇప్పటి కైదు వేలు వ్యయపడెనట !

సదా—దాదాపు అయియుండును.

దేవే—ఇంత సొత్తు నీ కెక్కడిది? ఇది అడుగవలెనని ఎన్నియో సారు లనుకొంటిని, ఇంతలో నాకు మతి చెడినది. ఇప్పుడు సావధానుడనై యున్నాను. ఇంత సొమ్మెక్కడిది ? చెప్పుము.

సదా—అదేల అడిగెదవు ? ఎట్లో జరుగుపడినది, ఇప్పడామాట యేల ?

దేవే—నీ విచ్చితివా ఏమి ? నా కొరకై నీ వొక శాసైన వ్యయపరిచితివా? యావజ్జీవము నిన్ను శత్రువుని వలె భావింతును. నీవు నన్ను బాగుగ నెరుగుదువు కదా? నా పూర్వు లెవరును దానముల పట్టలేదు, నేను కూడ, ప్రతిగ్రహించు వాడను కాను.

సదా—నీ కీఆందోళన మేల? ఇదే ప్రమాణము చేసి చెప్పుచున్నాను. ఇందు నాసొమ్ము ఒక గవ్వయైన లేదు

దేవే—అట్లైన నీ కీసొమ్మెక్కడిది ?

సదా—నీ భార్య పంపినది.

దేవే—నా భార్యయా ? ఆమె కైదువేల రూపాయ లెట్లువచ్చెను ?

సదా—నాకు తెలియదు. నా కుమారుడు నాకీ సొమ్మిచ్చెను. ఆత డిట్లు చెప్పెను.

సదా—ఇది ఆమె కెట్లు లభించెనో అడిగితివా ?

సదా—ఆవిషయ మెవరికిని చెప్పవలదని ఆమె నిషేధించె నట.

దేవే—సరే, నే నామె నడిగెదను సదానందా, నాపై తీర్పుచెప్పబడిన డిక్రీసొమ్ము జాగ్రత చేసితిని, కోర్టులో దాఖలు చేయుదువా? నీకు వీలున్నదా ?

సదా—తెమ్ము, నేడే చెల్లించెదను. తీరుబడి కావలసినంత ఉన్నది.

దేవే—ఇది నేనే చెల్లించియుందును, కాని నాకు సుస్తీగా నున్నది, జ్వరము తగులునేమో, జతపడిన పిదప జాగేల ? శేషించిన ఆస్తినమ్మి దీనిని జరిపెట్టితి.

సదా—ఇల్లమ్మితినా ఏమి ?

దేవే—అమ్మకున్న అప్పెట్లు తీరును ?

సదా—అమ్ముటకు ముందు నాతో చెప్పలేదేమి?

దేవే—చెప్పినచో నీ వట్లు చేయనిత్తువా ?

సదా—చేయనీయను నిజమే. కాని దేవేంద్రా ! ఎంతపని చేసితివి ! తాతలనాటి యిల్లు, ఎంత పవిత్రము ! పితార్జితమగు సొత్తు ఎంత ప్రీతిదాయకము !

దేవే—పితార్జితమగు సంపదకన్న పితృఋణము పవిత్రతరమని నాయూహ....

(ఇనుపపెట్టి తీయును)

సదా—దేవేంద్రా ! నీవెంత మహాత్ముడవు ! ఎంత ఉదారుడవు ! ఐనను ఆపన్మేఘ మన్ని వైపుల నిన్నేల ఆవరించియున్నదో ఆపరమాత్మునకే తెలియును ఏమి వెతకుచున్నావు ?

దేవే—ఏమిది ! నోట్లకట్ట యేదీ ?

సదా—పెట్టెలో లేదా ?

దేవే—లేదే ?.... అనుకొన్నట్లే అయినది.

సదా—నోట్లా ? రూపాయలా ?

దేవే—నూరురూపాయిల నోట్లు.

సదా—ఎవరికైన నిచ్చితి వేమో?

దేవే—లేదు అపహరించినారు. ఆహా! దొంగతనమే?

సదా—ఇనుపపెట్టె తీసి ఎవ రపహరింతురు ?

దేవే—ఇంకెవరు ? హుం ! హుం !

సదా—దేవేంద్రా ! తొందరపడకు. ఎవరును దొంగిలియుండరు ఎక్కడనో నీవే దాచి యుందువు. జ్ఞప్తికి తెచ్చుకొనుము స్నానమాడి భుజించి నిమ్మళముగా వెతకుము. కలవరపడకు నేను సాయంత్రము వచ్చి తీసికొని పోయెదను.

(పోవును)

దేవే—మానదా ! బోధపడినది. నీ కైదు వేల రూపాయ లెట్లు వచ్చెనో నేడు తెలిసినది. ఆసొమ్ము స్వార్జితమో, పితార్జితమో, అనునట్లు మా రందరును కన్ను వేసియుండిరి..... .....నీకుమారుని రక్షించుటకు నాఅయిదు వేల రూపాయిల దొంగిలించితివా ? తుద కబ్బెనా దొంగతనము ? దారిద్ర్యదశ ఎంతకు తెచ్చినది ! ఛీ ! ఛీ !

(మానద వచ్చును)

మాన—వంటయైనది—స్నానము చేసివచ్చుడు.

దేవే—(కోపముతో) మానదా ?

మాన—అమ్మయ్యో ! అట్లుచూచెద రేమి?

దేవే—తుదకు నీకు దొంగతన మబ్బెనా ?

మాన—దొంగతన మేమిటి ?

దేవే—ఏమి ధైర్యము! నా ఇనుపపెట్టెనుండియే దొంగలించితివా ?

మాన—దొంగతన మెవరు చేసిరి ?

దేవే—నీవు.

మాన—నేనా ? బాగున్నది.

దేవే—నేను కనిపెట్టినాను. ఆసొమ్ము చూచినప్పుడే నీకన్ను కుట్టినది. అది నాహృదయమందలి రక్తమాంసములను ధారపోసి కూర్చితిని. మా తాతలనాటి యిల్లు నమ్మి—ఆహా ఎట్టి యిల్లు—జతపెట్టితిని. నీవు దానిని హరింతువా ?

మాన—బాగుబాగు. నేనుదొంగతనము చేయుదునా?

దేవే—దాని కేమిలే. నారూపాయి లిమ్ము.

మాన—ఏమి మాటలివి! మీ ఇనుపపెట్టెతీసి మీ సొమ్ము నే నపహరింతునా ?

దేవే—అంతేకాదు. ఏమియు నెరుగనిదానివలె నటించుచున్నావు! పాపము. ఎంత ముద్దరాలవు ? ఎంత కపటపు దుర్జాతి బిడ్డవు! ఎంతకైన తగుదురు. ఏమి సాహసము! ఇదివరకే నాకు విషముపెట్టి యుండవలయు. అట్లేల చేయవైతివి? ఆశ్చర్యముగా నున్నది. అవకాశము కావలసినంత కల్గెనే ?

మాన—మీసొత్తుతో నా కేమిపని ?

దేవే—ఏమిచేసితివో నీ వెరుగవా ? మొన్న నీసుతు

నిక్కై జరిపిన చర్యకేం సొమ్ము సదానందునకు నీవు పంపలేదా? తెమ్ము నా సొమ్ము.

మాన — ఎంత అపకీర్తి ముచ్చట! నేను చేసితినే అనుకొనుము, వాడు మీ సుతుడు కాడా?

దేవే — ఏమో? ఆచర్చ యిపుడేల? వాని రక్షించుటకు నా సొత్తేల వ్యయముచేసితివి? తాతలనాటి యిల్లు — నా ఇహము, నా పరము. నా ఆత్మ — అప్పు కూడబెట్టిన ధనము నా సొమ్మిమ్ము.

మాన — అట్లయిన ఇది వినుము. కుర్రవాని చెర బాపుటకు సదానందునకు నే నంపినసొమ్ము నా పుట్టింటి వారు నాకు పెట్టిన నగలను తాకట్టుబెట్టి తెచ్చినది, కాని అందు ఒకకాసైన మీ సొత్తుకాదు. ఇది సత్యము. మీరు నాపై నారోపించిన దొంగతనమను అపదూరును నేను పాటిసేయను. మీకు చిత్తవిభ్రమము కలిగియుండుటచే మీమాట మీకే తెలియదు, (ఏడ్చును)

దేవే — నన్ను కన్నుమొరగ చేయజాలవు. ఏడ్పు మీ కభీష్టితముగా అలవడును. కావలయునన్నప్పుడు కన్నులనుండి కన్నీరు పారజేయుదురు. నాకడ నీజిత్తులు చెల్లవు, సొమ్ము నిమ్ము. లేనిచో —

మాన — లేనిచో —

దేవే — నిన్నేమియు ననను. ఇంటినుండి వెడల నడిపెదను. ఇంటిదొంగ నుంచుకొనుట యెట్లు?

మాన—మంచి మాటయే.

దేవే—అటులనా? ఇప్పుడే లేచిపొమ్ము.

మాన—ఎటు పోవుదు?

దేవే—నీచిత్తము. నా యింటనుండవలదు.

(పోవును.)

---

## ఐదవరంగము

(చెరసాలలో కేదారుడు మహేంద్రుడు)

కేదా—నీవు చెరలో నేల పడితివి?

మహే—మోసము చేసి.

కేదా—ఇంత ఆలస్య మైనదేమి?

మహే—ముందు వచ్చినచో సదుపాయము లుండి యుండునా?

కేదా—ఇద్దరము కలిసి మాటలాడుటకు వీలుండి యుండును. నా కీనాడే విడుదల.

మహే—చెరలో నుండవలసిన కాలము జరిగి పోయినదా?

కేదా—ఐన నేమి? తిరిగి రావలెనన్న తెన్ను లేక పోలేదు. యజ్ఞేశ్వరుని కొట్టినందున ఆరునెలలు శిక్ష అయినది. ఇప్పుడు కావలివానిని కొట్టిన ఇంకొక వత్సరము శిక్షపడును.

కాని ఆలాగు చేయను. ఇప్పుడు ఇంటికిపోవుట అత్యావసరము. ఇంకొకసారి వచ్చెదను, భయపడకు.

మహే — ఆపాటిదానికి ఇంటికి వెళ్ళనేల ?

కేదా — ఆవశ్యకమైన పనియున్నది.

గదాధరుడు, హరిపదుడు, కిశోరుడు. (ఇట్లు రెండుమూడు సారు లనును)

మహే — అ దేమిటి ?

కేదా — నిత్యము ప్రాతఃకాలమున ఇదే నా జపము.

మహే — ఏల ?

కేదా — నీ కేమి తెలియును ? గదాధరుడు, హరిపదుడు, కిశోరుడు.... మీ తండ్రిగారికి సేమమా ?

మహే — అతనికి శిరోవాతము చేసి మతి భ్రమించినది.

కేదా — అటులనా ? నిద్రలో లేచి తిరుగు రోగము నుండి శిరోరోగమున కొకమెట్టు. దానికిమందు నేనెరుగుదును.

మహే — ఏమి టది ?

కేదా — గదాధరుడు, హరిపదుడు, కిశోరుడు.

మహే — నీకు కూడ మతి పోయినట్లున్నది.

కేదా — ఔను-పోవుచున్నదా ? గదాధరుడు-హరిపదుడు—కిశోరుడు .... నీ విక్కడ నుండగానే నేమతిరుగ త్వరలో వచ్చెదను. బెంగపడకుము. ఈ శరీరము దేనినైన సహించ గలదు. పుత్రశోకమునే భరించును. దీనికై [illegible] కృంగిపడవలదు. ఇది మాయముల్లే అనుకొనుము.

మహే—నీవు తమాషా మనిషిలా గున్నావు.

కేదా—మఱచినాను యజ్ఞేశ్వరునకు సుశీలనిచ్చి పెళ్లి చేసినారా? చేయలేదు కదా?

మహే—లేదు లేదు.

కేదా—బతికితిని-ఇంతవరకు నాకిదే బెంగ, ఇక చింత లేదు, మహారాజుకొడుకున కిచ్చి దానికి పెండ్లి చేయుదును,

మహే—ఎట్లు?

కేదా—ఇప్పుడు చెప్పను. గదాధరుడు, హరిపదుడు-కిశోరుడు-బాబూ! నీవు చింతింపకు ఇచ్చటనుంటివా నీదేహము గట్టిపడును, ప్రతిదినము నియమితాహారము, నియమిత పరిశ్రమ, గాఢనిద్ర, అనుదినమును రెండుసారులు వైద్యుడు చూచిపోవుచుండును-ఇచ్చటి అధికారులగపరచు ఆదరము అత్తవారింట కూడ జరుగదు. భూలోకస్వర్గ మన చెఱసాలయే కాని హేతువు మాత్రము ధర్మానుసారి కావలయును, లేకున్న ఇది నరకమే.

మహే—అదెట్లు?

కేదా—నన్ను కర్తా అని పిలువుము.

మహే—అలాగే. చెఱసాల భూమిలో స్వర్గమంటివి. కర్తా, అదెట్లో చెప్పుము?

కేదా—స్వర్గమే-కాకేమి? వేళకు భోజనము, ఇంటి వద్ద అది దొరకదు-రెండుసారులు వైద్యుడు సొమ్ముపుచ్చు కొనకయే చూచిపోవుచుండును. నేను మాయింటనున్నప్పుడు

నాకొకసారి జ్వరము వచ్చినది. మూడురోజు లొకతీరున హెచ్చినది. నాల్గవనాడు కాని వైద్యుడు రాలేదు. నాయదృష్టము వలన నాడి ఆడుచుండబట్టి బ్రతికితిని గాని, లేకున్న ఇంతకాలము జీవించి యుండకపోవుదును, నీ విక్కడ కన్యా అని పిలిచియుందువు.

మహే—గానుగ మాట?

కేదా—వెరి వాడా! దానివలన దేహముగట్టిపడును. పెక్కుమంది ప్రొద్దుటనే అటు ఇటు తిరుగుచుందురు, దేహారోగ్యమునకే కదా? వారు నాల్గువారు లీగానుగను త్రిప్పినచో శరీరము గట్టిపడుటయే కాక చమురు దిగును. నీవు దీనికి చింతింపకు, నీకండరములు పొంగి శరీరము దృఢమగును. రోగము నీ చెంత రాదు.

మహే— బాగు బాగు.

కేదా— ఇచటినుండి పోయినవెన్క ఎముకలు బైటపడును. ఓపిక పట్టుము. నిజమని నీవే అందువు. చెఱసాల స్వర్గమే!

(చెఱ కాపరి వచ్చును)

చె॥ కా—కేదారా! వెలపల రమ్ము.

కేదా—గదాధరుడు, కిశోరుడు, హరిపదుడు.

(వెళ్లును)

—

## ఆరవ రంగము.

(రాజమార్గమున మానద)

మాన—దారిపొడుగున అడుగుచు ఇంతవరకు వచ్చితిని. జైలు ఇచటయున్నదట, కాని నన్ను అందులోనికి పోనిత్తురా? మనసు విరిగి యిలు వెడలి వచ్చితిని, ఇప్పుడేమి చేయుదును. భగవంతునిపై భారమువేసి కాలు సాగించెదను. దేవా! పరమేశ్వరా!

(కేదారు ఎదురుగా వచ్చును.)

కేదా—ఇదేమి వదినా! ఒక్కర్తెవు ఎటు పోవుచున్నావు?

మాన—నా బిడ్డను చూచుటకు. చెఱసాల ఈవైపుననే కదా? నా కొడుకు కష్టపడుచున్నాడు, వాని జూచుటకు పోవుచున్నాను.

కేదా—ఆశదానవు. అక్కడికెట్లు పోగలవు? నిన్ను వెళ్ళనిత్తురా? నేనిప్పుడే వానిని జూచివచ్చితిని. సుఖముగా నున్నాడు.

మాన—నీవు చూచితివా? నా తండ్రి సుఖముగా నున్నాడా?

కేదా—ఆహా! సుఖముగా నున్నాడు, నీవింక మరలుము. నిన్ను మాయింటికి తీసుకొనిపోయెద.

మాన—నేనిక నక్కడికే పోను.

కేదా—అదేమి ?.... ఊరకుంటివి. అక్కడి కెందుకు పోవు ?

మాన—నేను వెళ్లను.

కేదా—ఇంకెక్కడికి వెళ్ళెదువు ?

మాన—కనబడు చోటికి.

కేదా—ఎన్నియో చోటులు కనబడును, అన్నిచోటులకును పోగలవా ? నిజము చెప్పుము. ఎక్కడికి పోయెదవు ?

మాన—కాశికి.

కేదా—కాశికి పో నీకేటికి ? ఇంటికి పద, సుఖము కలుగ గలదు.

మాన—నేను పోను. గుక్కెడు ప్రాణము విడువక మునుపు కొడుకు నొకసారి చూడవచ్చితిని.

కేదా—నీమతి చెడినది. దానికి మందు నే నెరుగుదును, గదాధరుడు, హరిపదుడు, కిశోరుడు.

మాన—వీ రెవరు ?

కేదా—ఇక్కడ నేను చెప్పను, ఇంటికి పద. జైలు నుండి నా కిప్పుడే విడుదల ఐనది.

మాన—నీవు పొమ్ము, నేను రాను

కేదా—నీకు రాక తీరదు.

మాన—ఊహు ! నేను రాను.

కేదా—ఎందుకు రావు ? నాతో చెప్పరాదా ? నేను నీకు మఱదిని కానా? మీయింటికి పోనందు వేల ?

మాన—న న్నింటినుండి గెంటినారు.

కేదా—ఎవరు? అన్నగారే? వదినా, ఇది కలయా, నిజమా? ఏదో జగడ మాడియుందురు. సంసార మున్నచోట జగడము లుండవా? అట్లుండుటయే మేలు. లేకున్న లోక యాత్ర పాతగిల్లి సుఖమునీయదు. అమ్మా! ఇంటికి పద. నీవు గృహలక్ష్మివి.

మాన—నే నక్కడికి పోను.

కేదా—పోనీ! ఎచ్చటికి పోవ నెంచితివి.

మాన—పుట్టింటికి.

కేదా—సరే. నా పెండ్లము కూడ అప్పుడప్పుడిట్లే చేయుచుండును. సరే. కోపము తగ్గినతోడనే రావచ్చును.... స్త్రీచిత్త మతి విచిత్రము. గడియలో అగ్నివలె మండును, గడియలో మంచువలె చల్లారును. నీకు తోడెవరు?

మాన—ఎవరును లేరు.

కేదా—నేను నీ వెంటవచ్చి నిన్నక్కడ విడిచెదను. లేదా, నీ కిష్టమున్నచో మాయింటికి పద. నాయిల్లు నీయిల్లుగ భావించుము. (పోవుదురు)

## ఏడవరంగము

(ఉపేంద్రుని ఇంటిలో అతడు, వినోదిని)

వినో — బాబయ్యగారూ, నన్నింటికి పోనిండు, నా పల్లకిబోయీల పిలువనంపుడు; నేను పోయెదను.

ఉపే — కలవర పడెద వేల? నీకు భయములేదు.

వినో — మీరు భయములే దనుటచేతనే నాకు దిగులు కలుగుచున్నది. మీ స్వరము గద్గద మాచున్నది, దృష్టి మారినది, ముఖము వెలవెలబారు చున్నది. మీ చంద మెప్పటివలె నుండక మారిపోయినది.

ఉపే — నీకు భయము వలదు, నామాట నమ్ము.

వినో — అదిగో మీ నాలుక తడబడుచున్నది. నాకు భీతి కలుగుచున్నది...నన్ను కొట్టినను, తిట్టినను, ఇంటనుండి తరిమినను, ఇంకేమి చేసినను, అతడు నన్నుకన్న తండ్రి కదా? పుట్టినిల్లుపాటి భువినుండబోదు! పల్లకిబోయీల పిలిపించుము లేకున్న నడచి పోవుదును. (బైటకి పోఁబోవును.)

ఉపే — నీవిట నుండుము, నేను పోయి వారిని పిలుచుకొని వచ్చెదను.

వినో — నేనుకూడ మీ వెంట వచ్చెదను.

ఉపే — ఏల?

వినో — ఇక్కడ నే నొంటిగా నెట్లుందును? మీరెట్టి వారైనను నాకు పితృవ్యులు కదా? నేను మీబిడ్డను.

ఉపే—కేశవా! మధుసూదనా!

వినో—అమ్మో! హరినామస్మరణ చేసెద వేల? అట్లు మీకొనర్చునపుడెల్ల మీమనమున నెద్దియో పైశాచిక సంకల్పము పుట్టుచుండును. అందుచే నాకు దిగులు.

ఉపే—బోయీలను పిలిచెద. నీవిట నుండుము.

వినో—నేనుకూడ వచ్చెదను.

ఉపే—వలదు (బైటనుండి తలుపు వేయును)

వినో—బాబయ్యగారూ! ఏమిది? తలుపేల వేసితిరి? తలుపు తీయుడు.

(తలుపు తీసుకొని యజ్ఞేశ్వరుడు వచ్చును)

వినో—(అదరిపడి) ఇతడెవడు?

యజ్ఞే—(వింతపడి) ఈమె ఎవతె?

వినో—మీరెవరు?

యజ్ఞే—నేను యజ్ఞేశ్వరుడను....ఆమెకన్న అందకత్తె-మేలయ్యె

వినో—మీరిటేల వచ్చితిరి?

యజ్ఞే—ఇప్పుడే తెలియగలదు నీచెల్లె లేది? ఆమె యిటనున్న దనుకొంటిని

వినో—అనుకొంటిరా ఆమె యిటనున్నదని!

యజ్ఞే—లోపమ్ము లేదు నీ వామెకన్న నందకత్తెవు, అనా భళ్రే—రమ్మ!

వినో—ఎక్కడికి?

యక్షే—భయమేల ?........రమ్ము....బండి సిద్ధము గానున్నది. నిన్ను సుఖపెట్టెదను-ఏమది ? రెప్పవాల్చక తదేకధ్యానమునచూచుచు నిలుచుండెదేల ? రమ్ము పోవుదము (చేయి పట్టుకొనును)

వినో—ఇంత ధార్ష్ట్యమా ? చేయువదలు (విడిపించుకొని తలుపుతట్టి) బాబయ్యా ! బాబయ్యా !

యక్షే—(నవ్వి) ఎవరిని పిలుచుచున్నావు ! బెబ్బులి బారినుండి తప్పించుమని వరడును వేడుకొను మేకపిల్లవలె అరచెదవేల ? అడవినుండి పరుగెత్తివచ్చి పసరిక కప్పిన పాడు నూతిలో పడితివి....అతని కిదంతయు తెలియును.

వినో—ఆఁ ! తెలియునా ! అతని కిది తెలియు నందువా

యక్షే—చేలా ! తెలియకున్నచో అతనియింట అతని తమ్మునికూతురినంట సాహసించువెంగలి నగుదునా! తెలియుటే కాదు. ఈ సదుపాయము నాకు చేసిపెట్టినవాడు అతడే. నీ అధరసుధారసము నానుటకు నాకదను కల్పించినవాడాతడే. ఈ విషఘుటికను నాకొసంగినవాడాతడే.

వినో—నేనిది నమ్మజాలను. నాతండ్రి ఇట్లు కావింపునా ?

యక్షే—ఇది అసంభవ మనుకొనుచుంటివా ? గోలా, ధనాశాప్రేరితుడైనచో పురుషు డెట్టి పాపమునకైన ఒడిగట్టును. ధనమునకై ప్రాణముల తీయును; విషయసుఖములకై విరాగులవలె జడల ధరించును; తగినంత ధనమిచ్చినచో

ఎట్టిదారుణకృత్య మొనర్చుటకైన వెనుదీయుడు....ఏల నావై పెఱవారి చూచెదవు ?

వినో——అయ్యో ! నరకము ! నరకము !

యజ్ఞే—జాగుసేయక రమ్ము

వినో—అబ్బా ! హా దైవమా, నా కేదిదారి ?

యజ్ఞే— నేను చూపెద రమ్ము....(చేయిపట్టుకొనిన తోడనే అమె మూర్ఛిల్లును)

యజ్ఞే—ఏమిది ! ఆఁ. తెలిసెను. పితృవ్యుడు పెద్దవాడు...ఇట్లొనర్ప నోచునా ? పాప మీముగ్ధ యీమాత్రము భావింప లేకపోయె. ధనమాహాత్మ్య మిది. ధాత్రినంతటిని తారుమారు చేయగలదు. రక్తమాంస సంబంధములో దానికి పనిలేదు....కాంచనము కన్న కాంత ఘోరతరము. (వినోదినిని చూచి) స్త్రీలు కమనీయగాత్రలు, మనోహారిణులు, కావున లోకమోహినులు....రిపుగణమున కామము మిక్కిలి బలిష్ఠము. తుపానుకన్న దుర్దమము, అనలముకన్న అవార్యము పిశాచుకన్న దృఢము; మహామారికన్న మమతాశూన్యము; హింసకన్నఅంధతరము, లోభముకన్న అతృప్తతరము; క్రోధము కన్న రక్తతరము, మదముకన్న విశృంఖలతరము—ఈసంగతుల నెల్ల జనులు వినుచుందురు, కనుచుందురు- దీనిమూలమున ఎన్ని రాష్ట్రములు నశించెను. సురతిశయబలశాలురగు సుందోపసుందులు దీని మూలమున నేకదా నసుపిరి. అసామాన్య మహిమోపేతుడు, అపరబ్రహ్మయు నగు విశ్వామిత్రుడు దీని

మూలముననే కదా తపోభంగ మొనర్చుకొనెను. పరమపావని యగు అహల్య దీనిమూలముననే కదా పతిత యయ్యెను. అనుపమధీవిశాలురగువా రెందరో అధఃపతితులైరి. దీని కటాక్షవీక్షణమున లోకవిద్రావణుండగు రావణుడు దీనివలననే సమూలము నశించెను...ఈవృత్తాంతములెల్ల నందరు ఎరుగుదురు కాని జ్ఞప్తియం దుంచుకొనరు. ఇదియే ఇందలి రహస్యము.... కామినులు విశ్వమోహినులు. " వెలదివేగుచుక్క తిలకించి నంతనే తెలివి తెల్లవారును "....కోమలమగు ఈమాంసపిండము నకు ఐదువేలరూపాయి లర్పించితిని. అయినను నష్టము తోచ దయ్యె....నిండిన కడుపు, మాసిన సిగ్గు, కమనీయ కాంత — ఈమూడును ఒక్కచోట జతపడనేని హృదయమను నరక కూపమునుండి పైశాచిక భావగణము పెల్లుబుకును.... ఈమెకు తెలివి వచ్చుచున్నట్లున్నది.... ఆఁ! నలువైపుల తిలకించు చున్నది.... ఏమి రూపవతి! అయ్యారే! భువనమోహిని!

వినో— ఎట నున్నాను? నీ వెవడవు...అమ్మో! నీవేనా? ఇది కలగాదా ఏమి భయావహదృశ్యము!

యక్షే— సుందరీ!

వినో— (చెవులు మూసికొని) అబ్బా! అబ్బా! నీవని మానవా? ఎంత ఘోరము!

యక్షే— యువతీమణీ! (చేయిపట్టుకొనును.)

వినో— మాం రక్ష! మాం రక్ష!

యక్షే—ఎవరికై మొరవెట్టుచుంటివి? ఇంట నెవ్వరును లేరు. నేను నీవే సంకోచింపకుము.

వినో—అయ్యో, అయ్యో, ఘోరము!

యక్షే—నవలామణీ, నిన్ను బలాత్కరింపను...నేను నిన్ను వలచితిని.

వినో—ఏమంటివి! పులి మేకను, పాము కప్పను వలె నీవు నన్ను వలచితివా? వలదు. వలపుమాని నన్నేవగింపుము, నిరసింపుము, నిన్ను వేడుకొనెద—ఇదే మొక్కుచుంటిని.

యక్షే—బండి వేచియున్నది, పోవుదమ్ము రమ్ము.

వినో—అయ్యో! నన్ను విడువుము.

యక్షే—సంకోచింపకు, నిన్ను కష్టపెట్టను.

వినో—వలదు-నాకేమియు వలదు-విడిచిన చాలును. ఇదే నీపాదములపై బడెదను.

యక్షే—మోహినీ, మన మీదేశమున నుండక నీచిత్తమువచ్చిన చోటునకు పోవుదము, పద.

వినో—అయ్యో! నన్ను విడవవా?

యక్షే—విడువను, ఇది నాప్రతిన.

వినో—ఓహో! ఏమి మహాత్ప్రతిజ్ఞ? నాప్రతిన వినుము. ప్రాణము విడెద గాని మానము విడను.

యక్షే—పాడిన పాటయే పాడుచుంటివి, ఆప్రశంస మాని రమ్ము పోవుదము.

వినో—అయ్యో! రక్షింపుడు, రక్షింపుడు.

యజ్ఞే—ఇందెవరును లేరు. ఇక నీసంకేతనము మాని నావెంట రమ్ము (మెడపై చేయివేయును.)

వినో—ధూర్తా! దూరమున నుండుము. (త్రోయును)

యజ్ఞే—అబ్బో! ఇక దాపనేల? (కత్తిచూపును)

వినో—నన్ను పొడిచి చంపుము. చూచెదవేల?

యజ్ఞే—అట్లుచేయుటకు నేను రాలేదు. నాకు నీపాటి బలము లేకపోలేదు-రమ్ము-(పట్టుకొనును)

(కత్తిదాచును)

వినో—అయ్యో! అయ్యో! నన్ను రక్షించువారు లేరా? విపత్సముద్రమున మున్గిన అనాథల మానసరక్షణము నకై దివ్యు లవతరింతురని వింటిని - ఎవరును రారేమి? శాస్త్రములు, పురాణములు, స్మృతులును అసత్యము పల్కునా? నాకెవరును దిక్కులేరా? శరణాగతత్రాసహారులు దీనమానరక్షకులు - నన్నుగాచు భద్రాత్ములులేరా - నేను దిక్కులేనిదాన నైతినా?

యజ్ఞే—ఆఁ! దిక్కు లేకేమి?—నే నున్నాను.

వినో—మీరా? ఇక నాకు భయమేల? ఆర్యా! నీవే నా రక్షకుడవు, నీ పాశవప్రకృతికి ప్రతికూలముగా నీ మహాత్ప్రవృత్తి నాశ్రయింతును. నాప్రాణమును గాని మానము నాకుంచుము. నీ అత్యాచారమునకు విరుద్ధముగా నీమానవధర్మము నాశ్రయించి ఈభిక్ష యాచించుచుంటి

ప్రాణమును నీ యధీనము చేసితిని, మానమును నా అధీన మున నుంచుము. ఈ విపత్సమున నీవే నిల్చి నాకు మానభిక్ష పెట్టుము-నన్ను రక్షించు, మహాత్మా, నీ దాసురాల, నీ కూతురను—నీ పాదములపై బడుచున్నాను-మాంరక్ష!

యక్షే—నేనా?

వినో—ఆహా! నీవే-నీ మహత్వదుర్గమున నాకాశ్రయ మిమ్మని వేడుచున్నాను. ఎట్లొసంగవో చూచెదగాక! . . . ఆశ్రయించిన అబల నావలకు ద్రోయుదువా? పరాజితనై, అనదనగు నేను నా పరమశత్రువగు నీ పాషాణదుర్గమున తల దాచుకొన తావిమ్మనుచున్నాను. ఆదుర్గము మొదట జీర్ణము శీర్ణమునై నన్ను రక్షింపలేకుండుటచే నట్టడవికి పరుగెత్తితిని. అట నా మొర అరణ్యరోదన మయ్యె. ఆపన మవన మొనర్ప లేక పోయె. మాతృగర్భమునుండి నన్ను చీల్చి, బయటికీడ్చి, నాశత్రువగు నీవు ప్రతిహింసాప్రేరితుడవై, నామానము హరింప కృతప్రతిజ్ఞుడవై, నావక్షమున కత్తితో పొడువసిద్ధము కట్టినచో-నాకు చరమాశ్రయము-అంతిమరక్ష-నీమానవత్వమే. పాదములపై బడి, కన్నీరుమున్నీరుగా నేడ్చుచు, శిరమువంచి కరములు జోడించి, పరాభూతయు, ప్రపీడితయు నగు అనా థయునతి క్షమాభిక్ష యాచింప, ఎట్టిముష్కరహస్తము నలంకరించిన ఖడ్గమును తానుగ జారి క్రిందపడదా? కోప పరితాపఘూర్ణితములగు కన్నులు శోకానుతాపబాష్పపూరి తములు కావా? మానసమున కనకనలాడు నరకాగ్ని నీటు

కాదా? నిరాశ్రయను, అనాథ నగు బాలికను నన్ను నీవు సోదరీభావమున జూడకుందువా? భూతదయార్ద్రమై, దివ్య తేజోమయమగు నీ ఉదారహృదయదుర్గమున నా కిరవుకల్పిం పనేరవా? దైవాంశసంభూతంబగు దయ నిలుసిల్లుటంజేసి అది లోహముకంటె దృఢతరము, పుణ్యతీర్థములకంటె పవిత్రతరము ఇహమందలి స్వర్గము—అట్టి నీ మానుషత్వదుర్గరాజమే నాకే కాశ్రయము, అందే నేను తలదాచుకొన నెంచితిని. వయసుమీరిన వాడవు-ధనాఢ్యుడవు-ఇద్దరుభార్యల గూడి ముద్దుముచ్చటల నీగినవాడవు—బ్రాహ్మణుడవు — విచక్షణుడవు .. నేను చెప్పగల్గినది చెప్పితిని. ఆపైని నీవూహించుకొనుము-పిదప నీ చిత్తము, నాభాగ్యము.

యజ్ఞే — వలదు-భీతి వలదు-కుమారీ! నీ కెట్టిహానియు చేయను. నేనెంత నీమదన్వైనను మానవుడను-నాకన్నులు విష యస్నేహాసిక్తములగుటచే కనబడకయుండెను. నిన్ను చూచుటచేతను, నీమాటలను వినుటచేతను, నాహృదయమున సద్భావ ప్రబోధప్రత్యూష మగుటచే అజ్ఞానాంధతమస మంతరించెను. నీ స్వచ్ఛశీలకాంతి నన్ను పవిత్ర మొనర్చెను. అమ్మా! నా తప్పు సైరింపుము. నా దుండగమును క్షమింపుము. నాకు సెలవొసంగుము. . . పోవును.

# భారత రమణి

## నాల్గవ అంకము

### మొదటి రంగము

(సదానందు నిల్లు సదానంద వినయకుమారులు)

సదా—ఇంటినుండి తరిమెనా?

విన—ఔను.

సదా—తన భార్యను? స్వాంగతనము చేసెననియా? నిద్రాపరిచలనరోగమునుండి పిచ్చి కొక మెట్టు. సుశీలయు పోయెనా?

విన—పోయెను. తల్లి ఆమెతో చెప్పకయే ఇల్లు వెడలెను. తండ్రి ఆమెను తరిమెనని వినినతోడనే సుశీలకు పట్టరాని కోపము వచ్చుటచేత ఆమె తండ్రియొద్దకు పోయి, "తండ్రీ! నేనుకూడ తరలెద నని" చెప్పి పోయెనట.

సదా—ఆత డేమనెను?

విన—మాటాడలేదు.

సదా—వింతగొల్పు బాల ఈ సుశీల! ఎంత విపరీతము! క్రిందు మీదైనది! ఇది ఆంగ్లవిద్యా మహిమ.

విన — విద్యాభ్యాసమున విపర్యాసము సంభవించునా? విద్యావతులందరును స్వాతంత్ర్యము బూన నెంతురా?

సదా — ఇప్పుడు ప్రత్యక్షము కాలేదా?

విన — ఆంగ్లవనితలు — — —

సదా — నాయనా! వారిమాట యెత్తకు. ఐదువంద లేండ్లనుండియు వారు విద్యాభ్యాస మొనర్చుచున్నారు. కావున వారికది స్వాభావికాచార మైనది. వారిలో నందరును చదువుకొన్నవారే. అందుచే విద్యాగర్వమునకు వీలులేదు. విద్యావతు లౌట వారు వినయసంపన్నులగుదురు. మన దేశమున విద్యనేర్చిన వనిత నూటికొక్కతె. అందును పట్టపరీక్ష యిచ్చిన పడతిని పట్ట పగ్గముండదు, అమి తాహంకారము! స్త్రీసామాన్యమగు, అశక్తతకు విద్య యొసగు దుస్సర్వజ్ఞత్వము తోడగును, కన్నులు నెత్తికెక్కును, భూమిపై అడుగు పడదు, క్రిందనున్న పంటలుండవు, మీదనున్న వర్షము లుండవు.

వినో — సుశీల చేసిన పని నింద్యమనియా మీ యభిప్రాయము?

సదా — కొంతవరకు నింద్యమే. పెద్దలయందు భయభక్తి శ్రద్ధలతో మెలఁగుట స్వతస్సిద్ధమగు సుగుణము. తలిదండ్రుల చెప్పుచేతలకు లొంగని వారి భావి శుభావహము కానేరదు.

విన — పెద్దల మాటలు పెడచెవిని బెట్టిన పడతులు మన దేశమున లేరా?

సదా—ఏరీ? వేలు మడిచి చూపుము.

విన—సావిత్రి! ఆ సతీశిరోమణి పేర నొకవ్రతము నేడు ఆచరింప బడుట లేదా?

సదా—ఆమె అహమికకును, అనర్గళతకును తగిన ఫలము లభించినది. అచిరకాలమున వైధవ్య మనుభవింప లేదా? సచ్చారిత్ర ప్రభావసాహాయ్యము సమగ్రముగా నుండెను కావున ఆకష్టము నామె కాలదన్నెను. నేటి బాలికలు సావిత్రియందలి హానము అవినయమును మాత్రము అనుకరింప గల్గిరి కాని, తదితర గుణగణము లందును సచ్చరితాప్రభావమును సంపాదింప గల్గిరా?

విన—అల్లనుకొనుటకు ప్రమాణమో?

సదా—సుశీల ఎట్టిదని నీ యభిప్రాయము?

విన—ఆమె సార్థక నామ. సచ్చరితాప్రభావమును సంగ్రహించె ననియే నా నమ్మకము.

సదా—(నవ్వి) ఈ కన్నులకే గొప్పలు దూరము కావుగదా?......ఆమె యెట్లుగనో తెలిసినదా?

విన—సరిగా తెలియదు.

సదా—ఎద్దియు స్ఫురింపకున్నది. ఇప్పుడు దేవేంద్రుడే విషయమునను నాతో నాలోచించుట మానినాడు-నన్ను చూచుటయన్న ఆతనికి తలనొప్పి—ఐనను ఒకసారి చూచి వచ్చెదను..... ......పోవుదురు.

---

## —రెండవ రంగము—

—(నడుత్రోవలో భక్తగణము)—

హరి—ఓరీ, ప్రభువుగారి భోగట్టా తెలియనే లేదు.

వినో—ఔను. ఏదో విశేష ముండవలయు.

శంక—ప్రభువువారి పంథ మారిన ట్లున్నది,

నవీ—మహాప్రభూ! మమ్మువీడి ఎట బోయితిరి?

హరి—అయ్యో! వీఁడు కంట నీరు వెట్టు చున్నాఁడు!

నవీ—గురువుగారు నాకేదైన పని నిప్పించెదనని పల్కిరి. అయ్యో! గురువరా, ఇప్పు డెందుంటిరి?

హరి—అయ్యో! పాపము-ఎంత దురదృష్టవంతుడవు?

వినో—బెంగ పెట్టుకొనకు, నవీనా.

నవీ—ఊరంతయు వెదకి ప్రభువుగారి [illegible]త్తా గంటినా

శంక—ఏమి చేయుదువు?

నవీ—నా తృప్తితీర రెం డిచ్చుకొందును.

హరి—ఏమిరా? అదేమి?

నవీ—ఎంత చాకిరీ చేసినాను! అంతయు నిష్ఫలము.

వినో—విసిగి నేసారి నిరాశ జెందకుము. భక్తుల వాంఛితముల ప్రభువువారు న: వేర్పకపోరు.

శంక—వారిలీలలు అగమ్యగోచరములు!

(నవ్వుచు కేదారుడు వచ్చును)

కేదా—అహ్హాహ్హాహ్హాహ్హా!

వినో—ఏమి కేదారా, ఎందు కా నవ్వు?

కేదా—నోరు మూసుకో! నన్ను నవ్వనీ.

శంక—సంగ తేమో చెప్పుము.

కేదా—ఓరీ! న న్నడ్డకు. సర్కారువారి రోడ్డిది. నా చిత్తము. నేను నవ్వ కొనెదను. నీ వెవ్వడవు నన్నడుగుటకు? హిహ్హిహ్హిహీ! అహ్హహ్హహా!

నవీ—సరే కాని, కేదారా, ఇది.........

కేదా—నోరు మూసుకొనుము-గాడిదెగుడ్డు లాగు, తొత్తుకొడకా! పింజారీ! మీ దారిని మీరు పోక నాచేత తిట్లేల తిందురు? నేనెవ్వరిని తిట్టకూడదని తీర్మానము చేసుకొంటిని, కాని మీతుంటరిమూకను చూచినతోడనే నా నోరు ఊరకుండదు.

నవీ—మా మతము మారినది, మాకు బుద్ధి వచ్చినది.

కేదా—నిజమే? మీ మాట కేమిలే-మీది కుక్కబుద్ధి! అతని బుద్ధి మారునా?...ఓరీ, నన్ను రేపకుడు. అహ్హహ్హ ఇప్పుడు జెయిలులోనికి పంపెదను. పద్దన్నా! జైలునకు నడువుము-తా ధీం తానా కిటకిటతక తా ధీం తానా (ఆడును)

వినో—అదేమి? కేదారా! ఆడుచుంటివి!

కేదా—కిటకిటతక తా ధీం తానా...ప్రభువు గారికి కారాగృహ ప్రవేశము.

శంక—కారా గృహమే?

కేదా—ఎవడురా వాడు ? ఓరీకంచరగాడి దే ! నరాధమా ! పశువా !...ఆఁ ! అదేమి ? కేదారా ! ఇక తిట్ట నంటివే ? పరనింద పాప హేతువు...మరియాదగా మాటలాడుము...అన్నలారా ! శ్రీయుత ఉపేంద్రమహాశయులు గారికి కారాగృహప్రవేశ మహోత్సవము కానున్నది.

నవీ—కారాగృహమే!!

కేదా—ఆహో-కారాగృహమే-జెయిలే-చెరసాలయే-బందిఖానా-అచ్చటికి పోయి అవతారపురుషులు కావున దానిని పవిత్రము చేయవలదా ? అహ్హాహ్హాహ్హా-అన్ని ముచ్చటలును తీరవలయునా లేదా ?

నవీ—ఏ మంటివి ? ఏల ?

కేదా—ఇక చెప్పను. కాని కారాగృహప్రవేశ మహోత్సవమునకు ముందు రెండుమూ డర్ధచంద్రప్రయోగములను అలవడజేయ నైతిని. ఈకొరతుకు నా మానసమును బాధించుచున్నది. అది కుదుట పడ లేదు......మంచి చిత్రము జరుగనున్నది (నవ్వును)

నవీ—ఏమి టాచిత్రము ?

కేదా—చెప్పనా?...చెప్పవలదని నిషేధించెనే !

వినో—ఎవరు ?

కేదా—చెప్పుదునా?... చెప్పను...ఇదిగో వినుడు...ప్రమాణము చేత జిక్కినది......ఇంకొక అక్షరము చెప్పినచో అంతయు బట్టబయలగును.

శంక—వినవేమి? ప్రమాదమా?

కేదా—సందేహమా? అయ్యగారి పని అయినది... తుదకు యజ్ఞేశ్వరుడు! ఓహో! చెప్పివేసితినే!...ఆఁ!...మరి చెప్పను. ఇక చెప్పను.

శంక—ఎందుచేత?

కేదా—ఆమాట దాచుటకూడ అసాధ్యముగా నున్నదే!

వినో—అట్లైన చెప్పకూడదా?

కేదా—ఓహో! ఏమి చిత్ర మేమి చిత్రము! అహ్హా హ్హాహ్హా...యజ్ఞేశ్వరుడు! ఓహో! ఏమి వింత!...అల మరలో... ఓహో బాబో! ఏమి మజా!

నవీ—ఏమిటది? చంపక చెప్పుము.

కేదా—అయ్యో బాబో! చెప్పివేసితిని. ఇంకేమున్నది? దాచలేక పోయితిని. కడుపు పగిలిపోవుచున్నది. ఏమి చిత్రము!

అందరు—చెప్పు! చెప్పు! చిత్రమేదో.

కేదా—అహ్హాహ్హాహా! గట్టిచిక్కు వచ్చినది. సంగ తేమిటో తెలియునా?...సాక్ష్యము సిద్ధముగా నున్నది... అలమరలో...హాఃహాః...ఇక నా తరము కాదు!

హరి—సంగతేమో చెప్పనే లేదే?

కేదా—చెప్పెదను. గ్రంథము చాలయున్నది. చెప్ప వద్దన్నారు.

శంక—దానికేమి లే.

కేదా—మీ ప్రభువుగారికి కారాగృహప్రవేశము తప్పదు. ముడిమాట చెప్పితిని. మీది సంగతులు మీకేల?

హరి—సాంతము చెప్పుము.

కేదా—ఇంకిట నుండను. ఉండినచో దాచలేను పెదవి దాటునేమో?...నాలుక చివర నున్నది....

(పారి పోవును)

నవీ—వీనికి పిచ్చి ఎత్తినదా ఏమి?

హరి—లేదులేదు. మతిచెడినట్టు లేదు.

వినో—జైలునుండి వచ్చెను కదా?

శంక—అట్లైన పిచ్చియెత్తి యుండును.

నవీ—కాని ప్రభువు—

హరి—ప్రభువు లేదు గిభువు లేదు-ఆ మాట నెత్తక నడువుము.

వినో—కిరీటపూజ కాకుండగనే?

శంక—ఆ సత్కారము సాగింపకయే మనము పోవుట భావ్యము కాదు. గురుదక్షిణ ఈయవలదా!

హరి—కంట పడినచో కానుక లిత్తుము. వెదకుదము రండు....(పోవుదురు)

---

—! మూడవరంగము !—

(పడవల రేవులో సుశీలా వినోదినులు)

వినో—ఇల్లు విడిచి ఇక్కడి కేల వచ్చితివి?

సుశీ——నా కిల్లు లేదు, వాకిలి లేదు. నిరాశ్రయను.

వినో——ఎక్కడికి పోవ నెంచితివి?

సుశీ——ఏమో?

వినో——ఇక మరలుము.

సుశీ——ఎక్కడకి?

వినో——మన యింటికి.

సుశీ——అట నా కనువుపడదు.

వినో——ఏమీ? ఆతడు తండ్రి కాడా?

సుశీ——అతడు మన అమ్మను ఇంటినుండి తరిమెను, తల్లిలేని పుట్టిల్లు తలపనేల? నేను——ఆమె తనయనయ్యు ఆయింటికి పోవుదునా? ఇంతకును ఆయన ననేల? అనాది నుండియు మనకు పురుషులచే అవమానము ప్రబలుచునే యున్నది. తండ్రిగారిది తప్పు కాదు, ఇది లోకమర్యాద!

వినో——అ వేల మాటలు? మన కన్న వస్త్రములను వారే కదా యిచ్చుచున్నారు.

సుశీ——అబ్బా! ఏమి వారి దయాహిల్లోలము! పట్టెడు కూడు పెట్టుచున్నారని ఇంత అహంకృతి యేల? పరుల పాదములపై బడి పిడికె డన్నమునకై బిచ్చకత్తెలవలె పెనగులాడుట మన కేమిగౌరవము? అది లజ్జావహము కాదా?

వినో——నీ మాట లెంత వింతగా నున్నవి! చాల్చాలు. ఇక నింటికి పద-నిన్ను వెదకుటకు నలుదెసల మనుష్యులు వెళ్ళిరి. నేనుకూడ నిన్ను వెదకి వేసారి తుద కిట గాంచితిని!

సుశీ—ఇంత శ్రమపడి యేల వచ్చితివి?

వినో—నీకు బుద్ధి చెప్పుటకు-నీ విట నుందువని విన యుడు చెప్పగా వాని తోడున వచ్చితిని. నేను నీ సోదరిని-పెద్దదానను, కావున నామాట వినుము. ఇంటికి నడువుము. ఆడదాని కింత యుద్ధత శోభస్కరము కాదు. మనము దుర్బ లులము, అజ్ఞానులము.

సుశీ—అట్లని పురుషులు మనల కాలితో తన్నవల యునా? వారి కంత పొగరా! ఆడది మానవ జాతిలోనిది కాదా?...... రెండు పూటలు రెండు పిడికెళ్ళ కూటకై మనము వారిని యాచింప నక్కరలేదు. ఈపాటి గడించుకొన గలము.

వినో—చిన్నప్పుడు నీతీ రిట్లుండలేదు. తండ్రి యన్న ఎట్టి వాడని ఎంచితివి? అతడు దైవసమానుడు, "పితరి ప్రీతి మాపన్నే ప్రీయంతే సర్వదేవతాః" అని శాస్త్రములు ఘోషించుచున్నవి.

సుశీ—శాస్త్రవచనములను నేను మన్నింపను- ఈవిష యము వేయిసారులు చెప్పియుంటిని......తండ్రిగారియెడ నాకు భక్తి లేకపోలేదు. అది అందరికిని స్వాభావికమే. కాని అతడు నన్ను కాలితో తన్ని, మా అమ్మను ఇంటనుండి తరిమి చంపిన- నాకాత్మగౌరవ ముండదా? నేను మానవ జాతికి చెందనా?

వినో—ఇదంతయు పాశ్చాత్య విద్యా ప్రభావము

ఎంత చేసినను ఆతడు తండ్రి కదా, శ్రద్ధాపాత్రుడు కాడా?

సుశీ—నా కాతనియెడ భక్తిశ్రద్ధలు లేకపోలేదు. అందుచేతనే అతడు నన్నెంత నిరసించినను సహించితిని- మన తల్లి మరణమునకు మాత్ర మతని నేను క్షమింపను. ఆతని కభిశాపయూపిన్నె యెడ కురిన్నెతిని కావున, ఆతని యింట నుం డనొల్లను.

వినో—పోనీ, ఆయింట నుండ నక్కరలేదు. వినయుని పెండ్లి యాడుము-మాకదియే చాలును.

సుశీ—ఊఁహుఁ. (తలయూచును)

వినో—ఏల?

సుశీ—ఆ చర్చ నీకేల?

వినో—పెండ్లియే చేసుకొనవా?

సుశీ—చేసుకొనను.

వినో—ఏమి చేయదలచితివి?

సుశీ—బ్రహ్మచర్యము.

వినో—అమ్మయ్యో! పాలన చేయగలవా?

సుశీ—నీకు చేతనగును కాని నాకు చేతకాదా?

వినో—నా ప్రారబ్ధమది-నీ కేమే?

సుశీ—నా వరలబ్ధ మది-కోరక నీకు వచ్చినది. కోరుటచే నాకు వచ్చినది.

వినో—మన సంఘము—

సుశీ—ఘాతుకమృగము వంటిది. దాని విధానము

లను నేను పాటిసేయను.

వినో—పాటించినను, పాటింప కున్నను, పెండ్లియాడి నను, ఆడకున్నను......ఇంటికి నడువుము.

సుశీ—నేను రాను. అక్కా! నా స్వభావము నీకు చక్కగా తెలియును. ప్రతికార్యమును, నాకు నచ్చినట్లు, నా బుద్ధికి దోచినట్లు, నాప్రవృత్త్యనుసారము చేయుచుందును, కాని ఒకరి మాట వినను. నామేలు నే నెరుగుదు.

వినో—ఇంటికి రావా?

సుశీ—ఎన్నిసారులు చెప్పుమందువు! నేను రాను. నాతల్లి కట చోటు లేకుండిన నాకు మాత్ర ముందునా? నీవు పోయి హాయిగా కడుపునిండ తినుచు కంటినిండ నిద్రించుచు జీవములను భరించి యుండుము. అది నా చేత కాదు. అట్టి బ్రదుకు నాకేహ్యము.

వినో—ఇంతకన్న నెక్కువ నేనేమి చెప్పగలను?... ఒకవేళ వినయుడు బోధించిన విందువేమో? (సుశీల వెడవెడ నవ్వును) కాని అతడు నీయెదుట పనుటకు కూడ సమ్మతింపక నన్నిట విడిచి నదీకూలమునకు నడిచెను. నీ నోటివడిచేతనే అతని మనసు నొవ్వ జేసితివి.

సుశీ—ఔ నక్కా, తప్పంతయు నాదే. అట్లే చాటుచుందును.

వినో—అయితే, ఇంటికి రావా?

సుశీ—రాను.

వినో — ఎక్కడికి పోయెదవు?

సుశీ — వల్లకాటికి.

వినో — అబ్బా! ఎంత మాటాడితివే! చెల్లెలా, నాతో చెప్పిననేమినష్టము? నీకునేడు కోపమువచ్చినది. లేకున్న, నాతో నింత పరుషములు పల్కుదువా? ఆత్మహత్య కావించుకొనిన ఆమె నాకు మాత్రము తల్లి కాదా? కాని చెల్లెలా, తండ్రి గారి మతి తల్లడిల్లినది. క్షమయే స్త్రీలకు పరమావధి-భరించి యుండుటకే మనము పుట్టితిమి. ఇది ఈశ్వరవిధానము కావున మనము దానిని మారుమాటాడక మన్నింప వలయును.

సుశీ — మన్నింప వలసినదే. స్త్రీజాతిని అబలలచేసిన ఆ విధి తదనుకూలముగ పురుషుల మనసులయందు దయయు సానుభూతియు సృజించెను. పశువులకువలె కాలుసేతులు మాత్రమే కాక, మానవులకు వివేకము మానుషత్వమును ప్రసాదించెను. పురుషుల మనికికిని మన్నికకును మూలకారణము స్త్రీలే కదా? అట్టిస్త్రీలు అబలలైనంత మాత్రమున పురుషులు వారిని కేవల విలాససామగ్రిగ భావించి, అక్కర తీరుటకు మాత్రి ముపయోగించుకొనుచు, వారు జాత్యుద్ధరణమునకు దేశాభివృద్ధికిని వేరుపుకగులని భావించుట న్యాయమా? ఇట్టి పురుషజాతి ఎన్నటికేని తలయెత్తుకొని తిరుగ గలదా? పురోవృద్ధి గాంచ గలదా?

వినో — కాని —

సుశీ — పలుమాట లేల? నాకై నీవు చింతింప పని

లేదు. హాయిగా యింటికి పొమ్ము-నన్ను నేను పోషించుకొన గలను, రక్షించుకొన గలను-ఇటు చూడు. (రివాల్వరు చూప వినోదిని నివ్వెరపడును.) ఇక పొమ్ము. తండ్రిగారిని ధిక్కరించితి నని మీరు నాపై కినియకుడు. నాతప్పు సైరింపుడని నాన్నగారిని వేడుకొనుచున్నానని చెప్పుము. నా కాంగ్లభాష నేర్పి మిల్టన్, షెల్లీ, మిల్, కార్లైల్ మొదలగు మహాకవుల గ్రంథములను నాచే పఠింపించినందుకు ఇంతకన్న నెక్కుడు ఫలము సమకూరునని తలంచుట భ్రమ అని యెంచుమనుము.

వినో—నేను పోయివచ్చెదను. నీ చందము నాకు నచ్చలేదు. కాని ఏమి చేయుదును? నీకు శుభమగుగాక!... (పోవును)

సుశీ—ఇంటికి పోను. పురుషుల పెత్తనము నాకు పరమాసహ్యము. ఏమైన కానీ—(పోవును)

(దొంగలు వచ్చెదరు)

మొదటి వాడు—మరీ-జరుగుబా టెలాగా?

రెండవ వాడు—ఈపని మానుకోవాలి-అంతే.

మూడవ వాడు—మునుపు ఆయిగా డంకామీా దెబ్బకొట్టి దోచుకొనే వోళ్ళు. అడ్డూ లేదు, గిడ్డూ లేదు-

నాల్గవ వాడు—ఇప్పు డెటుసూశినా పోలీసోళ్లే!-ఆళ్ళకొంపలు గూల-అడ్డవొ(తారు- మనాటలు సాగలేదు.

నాయకుడు—అందుకే-ఈపని మానేద్దాం రా.

రెండవవాడు—నెత్తిమీద కత్తి, గొంతు కు్కరి-దాని శిగ్గొయ్యా! ఏవిఁ సాధనం? కాలూ సెయ్యా ఆడదయ్యా!

మూడవ వాడు—మనపని శితికింది-ఏందారీ?

నాయకుడు—ఇప్పుడు దారిపొయ్యేవోళ్ళు మునపటి నాగ లేనే లేర్రా! అందుకే మనం దీన్ని మానుకోవటం.

మొదటి—ఎంత తిరిగినా, నెల్లాళ్ళాయి పాశిక పారం దే-సచ్చేవాం తొచ్చింది రా!

రెండ—కాని, ఇది మానేస్తే కడుపు జరగడ వెఁలాగా?

నాయ—సేద్దెం సేసుకుందాం.

మూడ—సివరికి సేద్దెవాఁ? సీ, సీ!

రెండ—లాభసాటి యవ్వారం యిది మానేశి నాగలి పట్టి యిప్పుడు దున్నమంటావ్రా?

నాయ—మనం వొద్దన్నా పోలీసోళ్ళు మనశాత దున్నించరట్రా? ఎట్టిమొగవాఁ!

మొద—ఎవరో వొస్తున్నార్రా-సద్దు సద్దు!

మూడ—ఆడది నాగున్నాది రా, ఏం?

రెండ—గొప్పోళ్ళ పడుసేనా?

మూడ—ఒకత్తేరా, యెనక పిట్టైనా లేదు.

నాల్గ—వొంటి న్నగలున్నాయి రోయి! వావ్వా!

అందరు—దోసుకుందాం రా.

నాయ—నాను పోతా.

మొద — ఆడదాన్ని సూస్తేనే అడలా? ఎంత పిరికోడవు!

నాయ — అదేవోఁకాని ఆడదాని మొగం సూస్తే నా సేతిలో కత్తి జారుతుంది, కర్ర కింద బడుతుందిరా - నే నుండలేను బాబో, నావొల్ల కాదు.

రెండ — నువ్వు నేకుంటే మరీప నేలాగా?

నాయ — మీరు నలుగురు - ఒక్కాడది - కానీండి.

మూడ — రాత్రి - శేతిక శిక్కింది శెడగొట్టకా.

నాయ — ఆడోళ్ళ మీద నే న్నేయి శేసుకోనా?).

నాల్గ — నువ్వు శూస్తావుండూ! మేం దోస్కుంటాం.

నాయ — కానీండి మరి - నాకళ్ళ గ్గంతలు కట్టుకొని, శెవుల్లో ఏళ్లెడ్తా - దాని వొంటిమీద శెయ్యేయ్యను.

నాల్గ — అబ్బా' ఏవిఁ ధైర్యం! ఆడదానికన్నా అదవుఁడవా?

నాయ — నీ మొగం - ఐదుపుంజీల మొగోళ్ళని అమాంతంగా నరికి, ఆళ్ళ పేగులు గుట్టబెట్టి, ఆళ్ళు గిలగిల కొట్టుకుంటా వుంటే దగ్గిర్నుండి సూశా - ఆడోళ్ళంటే మాత్రం నాగుండె టుఁ ఇఁమంటుందిరా! యేం కర్మవోఁ ఆళ్ళ బాద సూళ్లేను - కాలాడదు, శెయ్యాడదు.

మూడ — మరి యాడవ లేకపొయ్యావూ?

నాయ — యేడవ్వాల నుందిగాని యేడుపు రాందే. ఏం శెయ్యనూ? వొకపాలి నాయింటిదాన్ని కర్రతో వొక

తేశా, దెబ్బతిన్నాది, మాటాలేదు మంతీ లేదు. సల్లగా నాకేసి చూస్తానే దబ్బున పడి గిలగిలకొట్టుకొని పానం వొది లేశింది-తల్చుకుంటే యిప్పుడు నావొళ్ళు గరిపొడుస్తాది-అప్ప టాల్నుండి ఆడోళ్ళ నంటడం మానేశాను.

రెండ__జొన్రా! అంతకు ముందు యీాడి మనసు రాయే! ఎంత తెగవ్రా? ఎంత బలవ్రాః? మనిపే. మారిపో యాడు రా.

మొద__కతలకేం ముందు పని కానీండిరా-పెట్టి గిరి పోగల్దు-కాలు సాగనీండి- - (పోవుదురు)

(దొంగలు సుశీలయు వత్తురు)

సుశీ__మీా రెవరు?

నాయ__అత్తెలిశి నీకేం లాభం?

సుశీ__దొంగలా?

నాయ__సక్కగా పోల్చావు.

సుభి__నా సొత్తంతయు కొనుడు. (తీయ బోవును)

నాయ__నగలు మా కొద్దు- నగ దిచ్చీ!

సుశీ__ఇదిగో-(నోటుల నిచ్చును)

నాయ__ఇం కొదిలేండిరా.

మొద__ఇంకే వుందో?

సుశీ__దైవము తోడు-ఇంక లేదు-నన్ను పోనీయుడు.

రెండ__అబ్బా! వొదిలేడవేః?

పా ట

శిల్కానా గున్నాది-శిత్తరువు బొమ్మా
సక్కగా సుశాను-శానిగా శేస్తాను ॥శిల్క॥
మూడవ—ఓర్నువ్వుండురా!
వొదిలిపెట్ట నోరి దీన్ని
వొళ్ళు గుజగు ల్లాడేని ॥శిల్క॥
నాలవ—
మొగము సూశి-మురిశి నాను
సొగసులాడి ముద్దుబెట్టు ॥శిల్క॥

నాయ—ఒరే-మీకు మతో యుందిరా? సొత్తు దోసు క్షోపోక కారుకూతలు కూస్తారేం? ఒక్క సెద్దమా టొస్తే, ముక్కలు ముక్కలు శేస్తాను.

సుశీ—అయ్యా! రక్షించు, రక్షించు.

(అతని ప్రక్క చేరును)

(వినయుడు పిస్తోలుతో వచ్చును)

విన—ఓరీ ధూర్తులారా, జాగ్రత్త!

నాయ—మొగాడోయి-ఇఖ మనవంతా వొకటి, రండి-ఏంట్రా పేల్తావు బాపడా! (వినయుని మీాది కురికి గాయము చేయ అతడు పిస్తోలు కాల్చును, వెంటనే నాయకుడు కూలును, మిగిలినవారు పారిపోవుదురు.) సాటి మొగాడ్తో పోరాను, సచ్చాను- నా కంతే సాలు- (మృతి)

విన—(గాయముతగిలినచోటపట్టుకొని) సుశీలా, ఇం టికి పొమ్ము.

సుశీ—వినయా! దెబ్బ ఎచట తగిలినదో చూపుము. (దగ్గర బోవును)

విన—నా దెబ్బ కేమి? నీ వింటికి నడువుము.

సుశీ—ఒంటరిగా నిన్నువీడి ఇంటికి నేను పోవుదునా? స్త్రీ నైనను నాకు మానుషత్వము లేకపోలేదు-ఏదీ గాయము? (గుడ్డ చించి కట్టును)

విన—ఇక నీవింటికి పొమ్ము.

(కేదారుడు వచ్చును)

కేదా—ఇదేమి?

విన—సుశీల నింటికి కొనిపొమ్ము, కేదారా!

కేదా—నీవేల పడియుంటివి? సుశీలా! ఇచటి కెట్లు వచ్చితివి?

విన—ఇచట నొక హత్యజరిగెను, పోలీసువారు వచ్చెదరు-ఈమె నింటికి చేర్పుము, కేదారా!

కేదా—హత్య చేసిన దెవరు?

విన—నేను.

సుశీ—కాదు-నేను హత్య చేసితిని- ఇదుగో రివాల్వరు.

కేదా—అసంభవము! హత్యచేసిన దెవరో నేనెరుగను, కాని మీలో నొకరు చేసిరినిన నేను నమ్మను.

విన—నిజముగా హత్యచేసినది నేను. తెరవాటు కాంద్రనుండి సుశీలను తప్పించుటకై హత్య కావింపవలసి వచ్చెను. దీనికై నా కురిశిక్ష తప్పదు.

కేదా—ఉరి తప్పనిచో ఈహత్య చేసినది నేను. ఉరికి పోవుట నాకు పరిచితమే. మీకు చేతకాదు-కావున హత్య చేసినది నేను.

విన—నీమటలు వింతగా నున్నవి. ఈమె నింటికి చేర్పుము, కేదారా!

సుశీ—నేను వెళ్ళను.

విన—నిన్నుకూడ ఈహత్యలో చేర్తురు.

సుశీ—కానిమ్ము.

కేదా—అట్లు కాదు. నిన్నింట విడిచి నే నురికి పోయెదను. వినయూ! హత్యచేసినది నేను సుమా! మరువ వలదు.

సుశీ—నారక్షకుని వీడి అన్యత్రైన కదలను.

విన—చెరసాలకు పోవుదువా?

సుశీ—సందియ మేల?

కేదా—మీరు పోనేల? నేను సిద్ధముగా నున్నాను.

విన—నామాట విని మీరింటికి పొండు.

సుశీ—నేను పోను.

(సదానందుడు వచ్చును)

సదా—అమ్మా! సుశీలా! వినయునిగూర్చి నీకు బెంగవలదు, నీవింటికి బొమ్ము; ధర్మమే జయము పొందెడుచో

వినయున కెట్టి ఆపదయు మూడదు. దూరమున నుండి నేనంతయు చూచుచుంటిని.

సుశీ—నే నింటికి పోను.

సదా—ఇటనుండి నీవేమి సేయగలవు?

సుశీ—నాకును తెలియదు.

సదా—వినయుడు నా కుమారుడు, వాని రక్షించు భారము నాది-దైవము తోడు-ఇక నీ వింటికిపొమ్ము, ఇచ్చట నుండజనదు.

కేదా—వింటివా? సుశీలా! సదానందుడు ప్రమాణము చేసి చెప్పుచున్నాడు, వినయు డాతని కొడుకు-అతని కెట్టి అపాయమును చేకూరదు. నేను ప్రమాణము చేసి చెప్పు చున్నాను, నీవు నాకూతురవు, లేకున్న నీపై నా కనురాగ మేల జనించె? నీకెట్టి భీతియు వలదు. నాయింటికి రమ్ము-

(పోవుదురు.)

సదా—నాయనా! దెబ్బ మోపుగా తగిలెనా?

విన—లేదు, లేదు. ఎవరో వచ్చుచున్నారు.

(పోలీసువారు వత్తురు.)

పోలీ—శవమేదీ?

సదా—అక్కడ నున్నది.

పోలీ—హత్యచేసినవా రెవరు?

విన—నేను.

పోలీ—పట్టుడు. (జవానులు చుట్టవేయుదురు.)

సదా—అయ్యా! స్టేషను వరకు నేను వచ్చి జామీ నిచ్చెదను.

పోలీ—మీ రెవరు ?

సదా—వీని తండ్రిని.

పోలీ—పాపము-ఈతడు హత్య చేసెనే ?

సదా—నే నెరుగుదు-జామీ నిచ్చెదను.

పోలీ—ఏపాటి ఈయగలరు ?

సదా—ఒక లక్షరూపాయీ లిచ్చెదను. మీయొద్ద నుండి వీని నిప్పుడు గొంపోవలెనన్న మీకు వేయిరూపాయీలు కూడ ఇవ్వనక్కరలేదు, అట్లైన "నేరముచేసినవాడు పరారి" అని మీరు వ్రాయుదురు, కాని అట్లు జరుగవలదు. ఈనేరమున న్యాయము జరిగి, తీరవలయు. అందు నాకుమారున కురినిశ్చితమైనచో నేను స్వయముగా వీని కంఠమున కురిపోసి ప్రాణముల తీసెదను.

పోలీ—అట్లనుచుంటి రేల ? ఇతడు మీ సుతుడో ;

సదా—మీకిది వింత గొల్పుచున్నదా ? ఇతడు నా కేకపుత్రుడు. ఇట్టివారు నూర్గురుండి వారికందర కిరీతిని ఉరి తటస్థించెనా, వారికి వేరుమృత్యువును విధిరాప్రమని విధాతను వేడుకొనను. ఓహో! నేడు నాకోటి ధన్యుడెవడు ? ఇట్టి పుత్రుని కంటినని గర్వముతో వాడవాడల చాటుచు పోవుదును. వినయా! నిన్ను కన్న ఋణము తీర్చితివి. ఉత్స

నము పెంపున నాకన్నులు మోదాశ్రువులచే నిండినవి. గౌరవదాయకుడగు పుత్రుడు కల్గెనను ఔత్సుక్యము నేడు తీరెను. నిన్నుపెంచి పెద్దవాని జేసి విద్యాబుద్ధుల కఱపిన ప్రయాసము నేడు సఫలమయ్యె...బలే ! తనయా! తరించితిని...అయ్యో! మన మిక పోవుదము

# భారత రమణి

## ఐదవ అంకము

—౧ మొదటి రంగము ౧—

(దేవేంద్రు నింటిలో దేవేంద్ర సదానందులు.)

దేవే—తాతలనాటి యిల్లు తెరలిపోయెను, ఇక కర్ర కంప మిగిలినవి. అవికూడ అమ్మి అప్పుతీర్చి, కౌపీనధారినై ఊరూర "భవతి, భిక్షాం దేహి" అని సంచరించెదను. సీతా రామాభ్యాం నమః.

సదా—దేవేంద్రా, కుశలమా? ఏమి చేయుచుంటివి?

దేవే—కుశలమే—కూర్చుంటిని.

(కొనువారు వచ్చెదరు.)

ఓహో, వచ్చితిరా! రండు. ఇదిగో మంచము, కుర్చి-పీటి కేమిచ్చెదరు?

సదా—ఏమి దేవేంద్రా! పిత్రార్జితమగు సామగ్రి నమ్ముచుంటివా? ఇదెంత శ్రేష్ఠము!

దేవే—దాని నుంచుకొనుటకన్న పితౄణవిముక్తుడ నగుట శ్రేష్ఠమని నా యూహ. సదానందా, అడ్డు రాకు. అయ్యలారా! పలుకరేమి?

(వేలాముపాట—1-2-3-4-5 రూపాయిలు.)

సదా—యాభై రూపాయీలు !

దేవే—సదానందా, నాప్రాణములు తీయక పాట సాగనిమ్ము.

సదా—నేను పాడకూడదా ? నాపాట యాభైరూపాయిలు. అయ్యలారా, మీరెంత పాడదలచుకొన్నను దానిపై నేను పాడుదును. పూచికపుల్లనైన పోనీయను.

(ఉపేంద్రుడు వచ్చును)

ఉపే—తమ్ముడా ! ప్రత్యేకమగు సామగ్రి సంతటిని ఏలాము వేయుచుంటివా ? రాధేకృష్ణ ! దీనబంధూ !

దేవే—ఔను. నీ కెద్దియేని కావలసిన పాడవచ్చును.

ఉపే—దేనిని విడిచి పుచ్చుటకును చిత్తము జొత్తిల్లకున్నది. ఐన నా కా అలమర ఒక్కటియు కావలయు.

దేవే—సరే. అన్నియు నొకసారియే అమ్మెద-పోనీ.

ఉపే—వలదు. అలమర నమ్మి తక్కిన వుంచుకొనుము.

దేవే—అవి మాత్రము నాకేల? అన్నియు నమ్మెదను. జే ! పరమేశ్వరా !

ఉపే—పూర్వులనాటి వస్తుసంచయము పోనీయరాదు: రాధేకృష్ణ ! కృపాళూ ! భక్తవత్సలా !

దేవే—పాడండి-అలమర...ఒకరూపాయి.

ఉపే—విధిలేక పాడుచున్నాను. పది రూపాయీలు.

సదా—యాభై రూపాయిలు.

ఉపే—నూరు రూపాయిలు-కృష్ణా! గోవిందా!

సదా—రెండు నూర్లు—

ఉపే—నాల్గు నూర్లు.

సదా—వేయి రూపాయిలు.

దేవే—అలమర వేయిరూపాయిలు-ఒకటి-రెండు—

ఉపే—రెండు వేలు, నాపాట.

(కేదారుడు కళ్లు త్రిప్పుచు వచ్చును.)

కేదా—పది వేలు. దేవేంద్రా! తాళముచెవి తెమ్ము. ఉపేంద్రా! ఊరకుంటి వేమి? ఇదే అలమర!

ఉపే—ఇది నీకెందుకు కేదారా?

కేదా—నిన్ను జెయిలులోనికి పంపుటకు-నేను వెళ్ళి వచ్చితిని! నీ విక పోవలయు.

సదా—కేదారా! ఎట్లు?

(యజ్ఞేశ్వరుడు వచ్చును.)

కేదా—అలమర యిదేనా? యజ్ఞేశ్వరా!

యజ్ఞే—ఇదే! ఇదే! తా మేదీ? (దేవేంద్రు డిచ్చును.)

కేదా—యజ్ఞేశ్వరా! బయటికి తీయుము.

యజ్ఞే—(తీసి) ఇదిగో వీలు!

దేవే—వీ లేమిటి?

యజ్ఞే—మీ తండ్రిగారు వ్రాసిన వీలు!

ఉపే—(తెల్లబోయి యజ్ఞేశ్వరుని చేతినుండి దాని

లాగుకొన జూచును.)

కేదా—ఆం! ఉపేంద్రా! కాగితము లాగెదవా? (క్రరచూపి) నెత్తి బద్దలు కాగలదు, జాగ్రత్త!

దేవే—మా అన్న దగ్గర నున్న వీలో?

యజ్ఞే—అది కల్పితము. మీ అన్న మిమ్మందరిని! మోసగించెను. నిజము నే నెఱుగుదు.

దేవే—అన్నా!

కేదా—బెల్లము కొట్టిన రాయినలె పల్కవేమి?

ఉపే—యజ్ఞేశ్వరా! నా కొంప గూల్చితివి! ఇక నీకు తగునా?

యజ్ఞే—నీకిది వింతగా నున్నదా?...ఔను వింతయే ఇన్నాళ్ళు నీచుడు వంచకుడుగా నున్నవాడు ఇంతలో ధార్మికుడగుట వింతయే!

కేదా—సిరా, కలము, కాగితము కావలయు. వేగము! వేగము!

సదా—ఎందుకు?

కేదా—చల్లారి పోవును. దేవేంద్రా! కాగితము, కలమును లేవా?

దేవే—లేకేమి? ...ఇదిగో!

కేదా—ఉండు ముండుము. వ్రాసి యుంచుట మంచిది. కోపోద్రేకమున మఱతు నేమో?...ఇదిగో...ఈ...శ్వ...రో...స్మి (అనివ్రాసి గోడకంటించును) సరిగా నున్నదా

ఇక భయము లేదు....(మోకరించి) ప్రభూ! క్రోధావేశమున నీవు లేవంటిని. నాతప్పు సైరింపుము.

సదా—విచిత్రమైన వ్యక్తి!

కేదా—ఇక నేను గెంతుదునా?

సదా—గెంతెదవా? కేదారా?

కేదా—కేదారా! గెంతెదవా? చిన్నతన మింకను పోలేదా? ఛీ, ఛీ.

సదా—ఇది చిన్నతనము కాదు. నీ చరిత మతి విశుద్ధము- పూర్వకాలమున మనదేశమున నీబోటి సరళ స్వభావులు, జానపదులు నగుబ్రాహ్మణు లింటింట నుండిరి. ఈనాడు విదేశవిద్యాసంఘట్టనమున వారు చూర్ణీకృతులై లుప్తప్రాయు లైరి, కాని అట్టి వారొకరిద్దరు అక్కడక్కడ పొడచూపు చుందురు. పరమపవిత్రమగు ఆ బ్రాహ్మణప్రధను పాడు సేయ జనదు. అది మనదేశమునకు స్వాస్థ్యము. పాదరక్షలు- దండడిగల్గి జిలుగులేనిస్వదేశవస్త్రములు బలిష్ఠమగు కాయము, స్ఫూర్తిగల మనస్సు, సరళతాప్రదీప్తమగు ముఖము- అన్యదేశములం దివి కానరావు. కేదారా! ధన్యోసి.

కేదా—అలమరా! నీ వెంత ధన్యవు- తాతలనాటి దానవు-నీలో నింకే మున్నదో చూచెదను...(చూచి) ఓరి బాబూ! అరలో అర- దొంగ అర!-ఇందులో నేమున్నదో- కాగితముల కట్ట!...కాదు-నోటులు...నూరు రూపాయీల నోటులు-ఇదేమిటి? యజ్ఞేశ్వరా! (చూపును)

యజ్ఞే—నే నెరుగను.

దేవే—ఏదీ-ఇటు తెమ్ము...అయ్యో! ఇవి పోలేదా. ఆమాట నిజమేనా? ఆహా! అర్ధాంగీ! మానదా! (జార విడిచి మోము వంచును)

సదా—ఏమి దేవేంద్రా! అట్లు న్నావు!

దేవే—అయిదు వేల రూపాయిలు చోరీ అంటినే, అవే యివి ! సదానందా ! ఎంతమూర్ఖుడ!...నాతల తిరుగు చున్నది. కన్నులు చీకట్లు కమ్ముచున్నవి.

ఉపే—యజ్ఞేశ్వరా! నాకొంప ముంచితివి.

దేవే—సదానందా! నన్ను లోనికి గొనిపొమ్ము.

(పోవుదురు)

యజ్ఞే—ఉపేంద్రా! నీ కొంప తీసినది నేనే, నీ గొంతుక కోసినది నేనే. నీకిది వింతగా తోపవచ్చును; నిజమే. చిరంతన పాషండుడ, పాపి నగునేను సన్మార్గవర్తిగా నుద్ధరింప బడుట సంభవించదు. కాని ఉపేంద్రా ! ఇది మాతృదేవతా ప్రసాద ఫలము...ఆ నాడు...జ్ఞప్తి యున్నదా? ఏనాడు జగదంబ దీనమలిన ధూసరితముఖమున- నాకు ప్రత్యక్షమై, స్వర్గద్వారముల భేదించి, మోకరించి, చేతులు జోడించి, కన్నుల నీరు గ్రమ్మ, పీడిత సతీత్వ రక్షాభిక్ష నన్ను యాచించెనో, ఆనాడే నాచిత్తము పరివర్తనము చెందెను. అత్యంత పాపినయ్యు ఆ నాడు నేను తరించితిని. నాకిక పాపభీతి లేదు. నీ కట్టియాశ లేదు.

కేదా—బొత్తిగా లేదు.

యజ్ఞే—నేను కేవలము పాపిని. నీవో అందుకుతోడు వంచకుడవు మునిముచ్చువు. నీ పాపపుంజమును కప్పిపుచ్చుటకు పరమేశ్వరుని పవిత్రనామమును ఆహా! ఏనామము ఆకలి కన్నము, దప్పికి నీరు, పీడకు మందు, పరదేశమున బంధువు, చచ్చువేళ సైదోడు—అట్టి నామమును వీథివీథిని అమ్ముచు, తన్మూలమున ప్రజల కికురించు చుంటివి. . . ఇంతే కాక— నీ తమ్మునికూతురు—నీ కూతురు కదా ?—ఆనాడు అమ్మా ! అని నోరార పిలిచితివే !—అట్టి అనాథ బాలికను ఇంధనముగా నొనర్చి నా వ్యభిచారాగ్నిని రగుల్ప సిద్ధపడితివి!-

కేదా—ఎవడు ? వీడా ?. . .ఎవతెను ?

యజ్ఞే—నీచమగు స్వార్థమునకు—తుచ్ఛమగు ధనమునకు—అనాథను, నిన్ను విశ్వసించి—తండ్రిని గాకున్న తక్కినవారిని నమ్మకుందురా ?—నీ యింట తలదాచుకొన వచ్చిన తన్విని—కాంచనమున కాసించి, కామపాశమున నురిబోసి—నా మోహాగ్ని కాహుతిగా చేయనెంచితివి !

కేదా— (ఉపేంద్రుని మెడబట్టి) ఓరీ ! పాజీ ! పాషండా ! అధమాధమా ! నిన్నిక విడువను. ఒక్కవ్రేల్లే అయినచో విడువవలె ననుకొంటిని. నీవు కుటుంబ ద్రోహివి ధర్మద్రోహివి ! సచ్ఛీలమును సమయింప జూచిన చండాలుడవు. నీధనాశ దగ్ధముకాను! నీబోటి పరిపంథిని-ఆతతాయిని-లోకద్రోహిని మహాపాతకిని-శిక్షింపకవిడిచినచో ఈప్రపంచ

ము కాలక్రమమున తలక్రిందు కాదా ?...యజ్ఞేశ్వరునికి బుద్ధి వచ్చునట్లు కొట్టి ఒకసారి చెఱసాలకు నేను పోయియుంటిని. నీకు బుద్ధిరావలెనన్న నీవే పోవలయు. ఇప్పటికి నీపాపము పండుటచే నీవంతు వచ్చినది. నడువుము.

(పోవుదురు.)

---

—• రెండవ రంగము •—

(దేవేంద్రు నింటిలో సుశీలా వినయకుమారులు.)

విన—సుశీలా ! పెండ్లి చేసుకో నంటివే !

సుశీ—నాది పొరపాటు—ఈలోకమును స్వర్గ మను కొంటిని. కాదు, ఇది నరకము. నారీజాతిని పురుషుల కామిష రూపమున పరమేశ్వరుడు సృజించెనని ఎఱుగనైతిని.

విన—అదెట్లు ?

సుశీ—ప్రపంచమను నీయరణ్యమున ముగ్ధహరిణము వోలె స్త్రీజాతి మెలగుచుండును...అయ్యో... నారీలోక మా !—దాస్యమొనర్చుటకే నీవు పుట్టితివి; మొదట తండ్రికి పిదప పతికి, ఆవెనుక సంతతికి ! అన్యాశ్రయమే నీకు జీవిత పరమావధి- నీవు స్వతంత్రవు కానేరవు. ఆశక్తి నీకులేదు, కావుననే అబలవు.

విన—శక్తి లేకేమి ? పురుషుని అంధతాశక్తిని దారి లోనికి తెచ్చునది స్త్రీయే కదా ?...నార్యవమానముచే కౌరవ కులము సమూలము నశింపలేదా ? నారీశాపప్రభావమున

రావణుని లంక ధ్వస్తముకాలేదా? నారీకటాక్షవీక్షణా ప్రభావమున నెందరెందరో దైత్యులు పరాజితులు కాలేదా?

సుశీ——పురుషుల కృపను ఆధారముగా గొని స్త్రీ జాతి జీవింపవలయు- ఇదే బహుదుఃఖహేతువు.

విన——ఇందు పురుషుల నేర మేమి?

సుశీ——లేదు లేదు. నేరము వారిది కాదు. పురుషుల కాహారముగా పరమేశ్వరుఁడు స్త్రీలను సృజించెను. పురుషు లేమి చేయుదురు? వారును శక్తివంచన లేక సర్వేశ్వరుని అవిచారమునకు యథాసంభవ ప్రతీకార మొనర్చుచునే యున్నారు. కావుననే వారు స్త్రీల నాదరించుట- గృహ లక్ష్ములని గౌరవించుట సంభవించు చున్నది. ఇదంతయు వారి కృపగాదా?

విన——కృపయా?

సుశీ——కాకున్న?... బాల్యవివాహము, అంతఃపుర నిర్బంధము (ఘోషా) మొదలగునవి స్త్రీజాతియెడ పురుషు లొనర్చు అత్యాచారములని భావించుచుంటిని కాని, లంప టులు, రక్తపిపాసువులు నగు పురుషాధముల బారినుండి సహజ కోమలమగు స్త్రీజనమును రక్షించుకొఱకు కొనర్చిన మహా కృత్యములని యిప్పు డెఱింగితిని. మన యాచారములు కుసం స్కారము లనరాదు. పురుషులు నీచులు, లంపటులు, వ్యభి చారులు నగునంతకాలము, సంఘము అధఃపతితమై యుండు నంత వరకు——స్త్రీలకు దేహదార్ఢ్యము, మనోబలమును

కలుగనంతకాలము వారిని రక్షించుట కిట్టి యేర్పాటు లుండి తీరవలయు. ఏలయన వారు తమ్ము తాము రక్షించుకొన నేరరు.

విన—పురుషు లంత నీచు లంటివే, వివాహ మేల చేసుకొంటివి ?

సుశీ—ఇది వివాహమా ? కాదు కాదు. ఒక్కొక్క స్త్రీ ఒక్కొక్క పురుషు నాశ్రయించి వాని యాజ్ఞలను పాలించుచు, వానిసేవ చేయుచుండును; దానికిమారుగ అత డామెకు అన్నవస్త్రములు నిచ్చుచుండును. ఇది నింద్యమగు దాస్యము కాని, యోగ్యమైన వివాహము కాదు.

(వినోదిని వచ్చును)

విన—యోగ్యమైన వివాహ మెట్టిది ?

సుశీ—స్త్రీపురుషులు సమకక్ష్యులనియు, వారియం దెట్టి ఎచ్చుతగ్గులును లేవనియు భావనప్రబలి, వివాహము లాలసాపేరితము కాక ప్రేమకల్పితమై, మగవాని విలాసము నకును ఆడదాని అన్నోదకములకును వివాహ మేకాధారము కాకయుండిన వివాహము యథార్థమైన వివాహమనజెల్లును.

విన—అదెట్లు ?

సుశీ—దంపతులప్రేమ నిష్కామమై, నిర్మమమై, నిర్ముక్తము కావలయు. ప్రేమ ఉత్కటము కాక ధీరమై, శాంతమై ఉండవలయు- సంశయము, ఉద్రేకము, అసహనము- విరహము అందుండరాదు. అది ఆకాశమువలె స్వచ్ఛమై,

సముద్రమువలె గభీరమై, పర్వతమువలె అచలమై యుండ వలయును.

వినో—చెల్లెలా, నీవు చెప్పునది ఆదర్శ ప్రేమ- ఈ కాలమున నట్టిది సమకూరదు- జరుగనేరనిది జతపడు టెట్టులు? ద్వంద్వసమ్మిళితమై యుండుటచేతనే ఈలోకము మధుర మగుచున్నది. వెలుగు, చీకటి; ఎండ, వాన; సుఖము, దుఃఖము; మంచి, చెడ్డ—మొదలగువాటి చేతనే ఈసంసారము మధురమై, సర్వజనాభిలషిత మగుచున్నది. ఇందు గెల్చి మంచివార మనిపించుకొనినచో స్వర్గము మనకు కరగతమగును- భోజనమునకు వేళ మీరినది రండు.

(పోవుదురు)

(కేదారుడు తొందరగా వచ్చును)

కేదా—ఏదీ బిడ్డ? ఇం దెవ్వరును లేరు! పాట వినిపించుటకు సదానందుని సామాజికుల పిల్చుకొని వచ్చితిని. ఆహా! సదానందుడు రచించిన ఆపాట ఎంత హృద్యముగా నున్నది!...ఏదీ?...చిరము జీవింపుము...ఆపైని...ఆఁ... భారతరమణీ...తరువాత...ఏదో ప్రవరా' అని వచ్చును. నాకు స్మృతిశక్తి సన్నగిల్లినది...బుద్ధి...అసలే పూజ్యము...!

(సదానందుడు వచ్చును)

సదా—అక్క ఆలేదు. మహోదారహృత్సంపదచేతనే నీవు పృథ్వినెల్ల జయించితివి! పురాణములయం దనేక చరిత్రము లున్నవి. ఇతిహాసములందు మరికొన్ని కలవు, కాని ఇట్టి

సరళము, స్థిరము, ఉదారము, అనఘము, అకృపణము, ఆనం దమయము నగు శీల మెందును గాంచబోము.

(దేవేంద్రుడు సుశీల, వినయుడు, వినోదినియు వత్తురు.)

దేవే — సదానందా, ఏరీ నీశిష్యులు ? నీవు రచించిన గీతమును మనపిల్లలకు వినిపింతము లోనికి రమ్మనుము...

(సదానందుడువెళ్ళి వారితో వచ్చును.)

(భక్తగణము పాడుదురు.)

పాట.

చిరముజీవింపుము - భారతరమణీ -
రమణీకుల ప్రవరా!
దరహాసితానన - సుధామయీ -
కోకిలకంఠ మృదుమధురస్వరా ||చి||
లలితగుణాగణా - లజ్జాభరణా -
నిఖిల భువనవిజయీనయనా!
మలయపవన గమనా - వినయాంచిత -
స్నేహప్రీతి శమదమముఖరా
ముక్తాదశనా - సక్తగురుజనా -
రక్తకమలదళ కోమల అధరా ||చి||
ధరసమసహనా - సరళసువచనా।
స్వార్థదాసునికి దాసిక
బురదను శశికళ - పూడ్చిన పోలిక
సరసిజగర్భుడు - నెరపెను నిన్నున్

పూతచరిత్రా - గౌరవపాత్రా
సంసృతి శోకలతాలవిత్రా ॥చి॥

---

అందరు——జే భారతరమణికి జే! భారతమాతకు జే! భారతభాగ్యవిధాతకు జే!

---

——• మూడవ రంగము •——

(చెరసాలలో ఉపేంద్రుడు)

ఉపే——నేను సర్వమును వీడి వచ్చితిని గాని దుఃఖము నన్ను వీడుటలేదు. చెఱసాలకు నేను వచ్చినను ఇది చేయి వీడకున్నది...అయ్యో! నేను గానుగయెద్దువలె నాపాపావరణమున క్రుమ్మరుచున్నాను. అబ్బా! ఇది నన్ను కొరడాతో చావమోదుచు ముల్లుకఱ్ఱతో ముట్టిపొడుచుచున్నది. నాహృదయసాగరమున తుపాను పుట్టినప్పుడెల్ల దాని ప్రబలోచ్ఛ్వాసము పొంగి పొర్లుచున్నది. ఇప్పు డెవరినైన గాఢముగా కౌగిలింపవలెనని యున్నది. నా అంతరంగము పరిక్షుభిత మగుచున్నది. మనోవ్యాధి జనించి లోలోన బాధ కెరలుచున్నది. ప్రాయశ్చిత్త మేనాటికి పరిశేషించునో యోచింపజాలను. హా! దైవమా! ఎన్నాళ్లకు దరిజేర్చెదవు?

(చెఱకాపరి వచ్చును)

చెఱ——రెండేళ్లకు——

ఉపే—అయ్యో ! నేనొనర్చిన పాపపుంజము నీవెరింగి నచో—రెండేండ్లు కాదు. రెండువందలేండ్లు శిక్ష ననుభవించినను నా పాపము తరుగబోదని నీవెంతువు. నేనేమి చేసితినో నీ వెరుగుదువా ?

చెలి—ఎరుగ కేమి ? మోసము చేసితివి.

ఉపే—అయ్యో ! ఇదేనా నీవెరిగినది ? ఏమియు నెరుగని అనాథ బాల మానము మాప నెంచితిని, అమాయికుడు ఋజుమార్గవర్తియు నగు సోదరుని మోసగించి ధ్వంసము చేయ నెంచితిని ; రక్తమాంస సంబంధమును తారుమారు చేసి, దానికి తిండిపెట్టక చంపితిని. అది సన్నిపాతరోగముచే సమయులేదు, అన్నపానములులేక అలసి మడిసినది. అయ్యో!

చెలి—ఎవరు ?

ఉపే—నా భార్య! దానికి మాతండ్రి వ్రాసిన వీలు భోగట్టా తెలియును, అది బైటపెట్టునను భీతిచే దానికి విషమిచ్చి చేతులార చంపుకొంటిని. నిద్రలో నాకంటి కేది కట్టుచున్నదో ఎరుగుదువా ?

చెలి—చెప్పు చెప్పు.

ఉపే—ఈ పాపమంతయు నా తలకడ నిల్చి, నా వైపు చూచుచు, నా నెత్తిపై నాడుచున్నది...అన్నిటికన్న ఘోరతమమగు పాప మింకొకటి కలదు. నా పాపజాలమును భగవన్నామమను తెరమరుగున దాచి బకధ్యానము చేయు

చుంటిని....అయ్యో! నా గతి ఏమి కానున్నది?

చె॥ కా॥—ఛీ! ఛీ! పాతకీ! నీ మొగము చూడరాదు.

(పోవును)

ఉపే—నిజము-నిజము. ఇక్కడ ఏ కూలివానితో నైన మాటలాడినచో కొంత తాపోపశమన మగునేమో? కాని ఎవ్వరును కానరారు...ఒంటరి నైతిని. జంఝామారుతము లీల, పొగబండి తెరగున, ఉప్పెన లాగున, నా మనము ప్రచండవేగమున పారిపోవ నెంచుచున్నది. ఎచ్చటికో నే నెరుగను. పరుగు మాత్రము కనబడుచున్నది. అహోరాత్రములు గానుగ త్రిప్పవలెనని యున్నది, గాని దేహమున కట్టిదార్ఢ్యము లేదు-పాపికి చిత్తశాంతి అలవడునా?—అబ్బా! అబ్బా! ఈ నరక మెంతని అనుభవింతును? దయామయా ఎంత కాల మిట్లోర్తును నన్ను త్రోయుదువు. అదిగో దేవేంద్రుడు-తమ్ముడా! రమ్ము.

దేవే—(నమస్కరించి) అన్నా! నాతప్పు సైరింపుము.

ఉపే—నేనా! నీవు నా తప్పుల సైరింపవలయు. నేను చేయు దుష్కృతము లన్నియు ప్రపంచప్రభలచే ఇంతవరకు ఎరుగబడకున్నను, ఈ బందియందున్న రెండు దినములలో నా కన్నులకు కట్టినట్లున్నది. ఈ చెరసాల పాపులకు పరమ పావనమగు చోటు.

(సదానందుడు కేదారుడును వచ్చెదరు)

కేదా—ఈశ్వరు డున్నాడా, లేడా, అని గొప్ప సమస్య!

సదా—లేకేమి? ఉన్నాడని నీవే సిద్ధాంతీకరించితివి.

కేదా—నాకు సందియము లేదు, కాని చిత్తము చలించునప్పు డెల్ల «నీవు లేవ''ని తలచుచుంటిని, దైవమా! తప్పు సైరింపుము. "నీ వున్నావు", అందుకు ప్రత్యక్ష ప్రమాణ మిదిగో! (ఉపేంద్రుని చూపును)

సదా—కేదారా! గొడ్డు గోతి బడిన బెడ్డవేయ తగునా? పీడితుని దుఃఖమును జూచి సంతసించుట సత్పురుషులకు పాడిగాదు.

కేదా—ఔను కాని, వాడు పాపియైనచో—

సదా—పాపియైనను, పతితుడైనను, బ్రహ్మరాక్షసియైనను కష్ట మనుభవించుట కనజాలను.

కేదా—అట్టియెడ నా కెట్టి చింతయు నుండదు, పరమానంద ముదయించును, తదుద్రేకమున గెంతవలెనని కోరిక పుట్టును.

సదా—కేదారా! అది నీకు తగదు.

కేదా—దుష్టులు దండింపబడ వలదా?

ఉపే—సత్యము, కేదారా, నీ వన్నది నిజము. ఈ ప్రపంచమున ఋషు లున్నారని చెప్పుటకు నీవే తార్కాణము ఏలయన నీ గూర్చి చింత నీ కెన్నడును లేదు, ఇతరులకె

నీ సర్వస్వమును ధారపోయుచుందువని నిన్నింతవఱకు తెలుసుకొనలేకుంటిని. నా అపరాధము లనేకములు, వానినెల్ల సైరింపుము.

కేదా—ఇప్పుడెవరివేల ఉపేంద్రా?

దేవే—కేదారా! అన్నగారిని క్షమింపుము.

కేదా—బాగు బాగు! నే నెవ్వడను క్షమించుటకు?

ఉపే—అయ్యో! నా మొగము చూడుము. నా హృదయమున నత్యంత భయావహమగు ఆధి యున్నది. బయట కమ్ముచున్న అంధకారము కన్న అది సాంద్రతరము-ఈ శిక్షకన్న ఆ శిక్ష కఠోరతరము. రాత్రి నిద్రలో పీడకలలు వచ్చి, "ఎంత ద్రోహ మొనర్చితిని? ఎంత పాప మొనర్చితిని?" అని ఒడలెల్ల కంపమునొంది మేల్కొనుచుందును. సోదరా! క్షమింపవా?

(నమస్కరించును)

దేవే—కేదారా! అన్నగారిని క్షమింపుము. (ఏడ్చును.)

కేదా—ఉపేంద్రా! నీ సోదరుడు నీకై యేడ్చుచున్నాడు, కావున నాకు కూడ నీ యెడ జాలి పుట్టుచున్నది. నీ వెంత పాపివి, ఎంత ద్రోహి వైనను, నేడు సుఖావహమగు దినము కావున నీపై నాకుండు ద్వేషము నంతయు క్షమ అను గంగాజలమున కడిగి పవిత్రము చేయుచున్నాను. ఉపేంద్రా! సోదరా! మ్లానమగు నీ ముఖము చూడ నీ కీచెఱ బాపి

నే నిందుండవలయునను కోర్కె పుట్టుచున్నది-అది వీలగునా?

సదా—కేదారా! నీ పల్కు దారుణమగు పిడుగు వంటి దైనను, నీ మనసు నవ్యనవనీతము వంటిది. మన పురాణములయందలి మహర్షుల చరిత్రములు చదువుచుండుము-వారు నీకన్న ఉత్తములా?

ఉపే—కేదారా, నీవు క్షమించితివి కావున నాకే దుఃఖము లేదు. ఇక నవ్వుచు ఈ శిక్ష సహింతును. దేవేంద్రా! నా సర్వస్వము నీది, విత్తమంతయు నీ పిల్లల కిచ్చి, అంతకన్న నెక్కుడగు నాహృదయమును నీవు గొనుము. నీవు సుఖివై చిరము జీవింపుము.

దేవే—సుఖమా? నా వంటి దౌర్భాగ్యునకు సుఖమా?

సదా—దేవేంద్రా! నీ యెడ కొన్ని దుఃఖహేతువు లున్నవని యెఱుంగుదు. ఈ లోకమున కేవలసుఖ మనుభవించువారు కాని కేవలదుఃఖ మనుభవించువారు గాని ఉండరు. అంతటను సుఖదుఃఖములు మిశ్రితములై యుండును. దుఃఖములేని సుఖము నాటకరంగస్థలమందే కావచ్చును; సంసారము నాటకము కాదు.

ఉపే—సదానందా, దేవేంద్రా! మీ యిద్దఱి ఋణము నే నీ జన్మమున తీర్పజాలను, మీ యుపకారమును జన్మాంతరములనైన మఱువజాలను. ఇక నెంతయో కాలము

మనియుండువాడ గాను, జీవింపవలెనని కోర్కె కూడ లేదు. నా భార్యయెడ నే నొనర్చిన ఘోరపాతకమును సమ్మార్జింపుమని ఆమెను వేడుకొనుట మిగిలినది. ఆమె జీవితమంతయు దారిద్ర్యదుఃఖమున గడిచెను. అట్టిచో నే నొంటరిగా సంపత్సుఖము ననుభవించు టెట్లు?

కేదా—ఒంటరిగా నుండుటేల? దేవేంద్రా! మా వదినె కూడ నీకు తోడునీడయై సుఖింపగలదు.

దేవ—కలలోని వార్త! ఆ యుత్తమురాలు. పాపభూయిష్టమగు ఈప్రపంచమును వీడినది. ఆమెను నా కడుపున పెట్టుకొంటిని- చేతులార చంపితిని.

కేదా—దేవేంద్రా, పాపము శమించునుగాక! ఆమె జీవముల బాయలేదు.

దేవే—కేదారా, నిజమేనా?

కేదా—నే నెన్నడేని అసత్య మాడితినా? ఇది పరియాచక మనుకొంటివా? ఆత్మహత్య కావించుకొన వలెనని ఆమె నిశ్చయించుకొనుట నిజము. కాని నే నామెను సమాధానపరచి పుట్టింటికి పంపితిని. తిరుగ నే డిటకు రప్పించి మా యింట నుంచితిని... నీ కెట్టి చింతయు వలదు.

దేవే—కేదారా! కేదారా! ని న్నేమని భావింతును?

కేదా—నన్ను సోదరునిగా నెంచుము.

ఉపే—వలదు, వలదు- సోదరున కిట్టి మహాత్మ్య ముండునా?

కేదా—ఉపేంద్రా! సౌందర్యమహిమ యందలి గౌరవము నీవు నిల్పుకొనలేకపోతివి. సౌందర్యమున నింతకన్న నెక్కుడు మహాత్వమున్నది.

(చెలికాపరి వచ్చును)

చె॥కా॥—అయ్యలారా! జాగయ్యె- వెలికి రండు.

దేవే—అన్నా! నాకు సెలవిమ్ము.

ఉపే—దేవేంద్రా సుఖివై చిరజీవివి కమ్ము.

సదా—తథాస్తు.

సమాప్తము.